ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 352 పేజీలు: 10+4 వెల: 6.50


దావోస్ వేదికగా గాజా శాంతి మండలి ప్రకటన

చంద్రుడిపై హోటల్ ముందుకొచ్చిన యుఎస్ స్టార్టప్

5






## జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 15 మంది మావోయిస్టులు మృతి

మృతుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు

పతిరామ్ మాంజీపై రూ.5 కోట్ల రివార్డు

సారండా అడవుల్లో కొనసాగుతున్న కాల్పులు

కొల్హాన్ డిఐజి అనురంజన్ వెల్లడి



మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



పతిరామ్ మాంజీ (ఫైల్)

**చర్ల, జనవరి22, ప్రభాతవార్త:** జార్ఖండ్ రాష్ట్రంలోని సింగ్‌భూమ్ జిల్లాలో కిరిభూమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు పతీరామ్ మాంజీ అలియాస్ పాటిల్ మాంజీ అలియాస్ అనల్ మాంజి తోపాటు మరో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు. కొన్నేళ్లుగామావోయిస్టు కూటమిలో >>2



## ఫిబ్రవరి 5న గ్రూప్-1పై తుది తీర్పు

### మరోసారి తీర్పును వాయిదా వేసిన హైకోర్టు ధర్మాసనం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 22:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా నిర్వహించిన గ్రూప్-1 నియామకాలపై తుదితీర్పును రాష్ట్ర హైకోర్టు మరోసారి వాయిదా వేసింది. గత ఏడాది 30న గ్రూప్-1 నియామకాలపై తుది వాదనలు జరిగిన విషయం తెలిసింది. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును ఈ ఏడాది జనవరి 22న వెలువరించనున్నట్టు >>2

## భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగా వాట్ల ఎఐ డేటా సెంటర్

### రూ.5వేల కోట్ల పెట్టుబడులు.. 4 వేల మందికి ఉద్యోగాలు

యుపిసి వోల్ట్‌తో తెలంగాణ రైజింగ్ బృందం ఒప్పందం

రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ

బ్రిటన్ పబ్లిషింగ్ సంస్థ పియర్సన్‌తో ఎంఒయు

దుబాయ్ మల్టీ కమొడిటీస్ సెంటర్‌తో ఒప్పందం

తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హాబ్‌కు అపూర్వ స్పందన

గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ

హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో డెయిరీ విస్తరణ

భారత్ ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ



దావోస్‌లో గురువారం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సి4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో భేటీ అయిన సిఎం రేవంత్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్,వోల్ట్ డేటాసెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 >>2

తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు

2

## ఈసారి స్మార్ట్ అగ్రి బడ్జెట్

### కేంద్రం తాజా యోచన

డిజిటల్ మార్కెట్ల బలోపేతమే లక్ష్యం



**హైదరాబాద్, జనవరి 22, ప్రభాత వార్త:** వచ్చే 2026-27 బడ్జెట్‌లో ప్రధానంగా సంప్రదాయ సాగు విధానాల నుంచి సాంకేతికత ఆధారిత స్మార్ట్ అగ్రికల్చర్ వైపు తీసుకెళ్లే మార్పును లక్ష్యంగా కేంద్రం పెట్టుకుంది. తాత్కాలిక సబ్సిడీలకు పరిమితం కాకుండా ఉత్పాదకత, స్థిరత్వం, మార్కెట్ ఆధారిత వృద్ధి దిశగా వ్యవసాయాన్ని తీసుకెళ్లే విధాన నిర్ణయాలు ఈ కొత్త బడ్జెట్‌లో రూపకల్పన చేస్తోంది. ఈ నేపథ్యంలో 2026-27 కేంద్ర అంచనా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మద్దతును పెంచడానికిగాను దాదాపు రూ.1.50 లక్షల కోట్ల మేర కేటాయింపులు జరపనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత 2025-26 అంచనా బడ్జెట్‌లో కేంద్రం రూ.1.37 లక్షల కోట్లు కేటాయింపులు చేసింది. దీనికన్నా ఈ సారి రూ.13 లక్షల కోట్లు అదనంగా కేటాయించనున్నట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని ఒక సీనియర్ అధికారి వెల్లడించిన వివరాలు ప్రకారం >>2



గంగాబాయి, లక్ష్మీబాయిలతో ముచ్చటిస్తున్న డి.సిఎం భట్టి

## కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చా!

### గిరిజనుల అభివృద్ధికి ఇందిరా సౌర గిరిజన వికాసం

పాదయాత్ర జ్ఞాపకాలతో.. ప్రజాభవన్‌కు ఆహ్వానం

బడ్జెట్‌లో పాదయాత్ర ప్రజల కష్టాలకు ప్రాధాన్యం

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వ చర్యలు


విద్యార్థుల భవిష్యత్‌కు యంగ్‌ఇండియా

రెసిడెన్షియల్ స్కూల్స్: డి.సిఎం భట్టి విక్రమార్క

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుడిగాలి పర్యటన

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి 22, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆదిలాబాద్ జిలాలో గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా రెండేళ్ల క్రితం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ప్రజలతో ముచ్చటించారు. బడ్జెట్ రూపొందించేటప్పుడు పాదయాత్రలో చూసిన ప్రజల కష్టాలు, సమస్యలు తీరేలా ప్రతి అంశాన్ని చేర్చుతామని హామీ ఇచ్చారు. జిల్లాలో పలు 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేశారు. రూ 15 కోట్లకు పైగా విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ ఏర్పాట్లు, సబ్ స్టేషన్, ఎస్ఈ కార్యాలయ నిర్మాణాలకు శిలాఫలకల ఆవిష్కరణ చేశారు. ఇందిరా సౌర గిరిజన వికాసం, గిరిజనుల అభివృద్ధి పథకాలపై హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు, వడ్డీలేని రుణాలను అందిస్తూ మహిళల శ్రేయస్సుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జిలాలలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో లింగాపూర్, కెరమెరి, ధనోరా, >>2

## నైనీ బొగ్గుగని టెండర్ల వ్యవహారం..



### టెండర్లు రద్దు

సింగరేణి యాజమాన్యం నిర్ణయం

22న జరగాల్సిన బిడ్‌లకు బ్రేక్

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. నైనీ కోల్ మైన్స్ టెండర్స్ విషయంలో ఇటీవల తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్స్ రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో గురువారం సాయంత్రం 5 గంటల నుండి బిడ్స్ ప్రారంభం కావాల్సి ఉండగా పాలనాపరమైన కారణాలతో టెండర్ రద్దు చేస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. మరోపక్క నైనీ టెండర్ల విషయంలో సింగరేణి వ్యవహార శైలిని కేంద్రం తప్పుపట్టింది. బొగ్గు గని టెండర్ల వ్యవహారంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ సీరియస్ >>2

### కేంద్రం ఎంట్రీ

ఇద్దరితో కమిటీ ఏర్పాటు

త్వరలో సింగరేణిలో పర్యటన

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** సింగరేణికి చెందిన నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు, వివాదాలు తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బృందం రాష్ట్రానికి రానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఇద్దరు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు. ఈ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించనుంది. నైని బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై వివరాలను >>2



ఫోన్ ట్యాపింగ్ కేసు:

## కెటిఆర్‌కు సిట్ నోటీసులు

### నేటి ఉ.11 గంటలకు జూబ్లీహిల్స్ పిఎస్‌కు రండి


నందినగర్‌లోని ఇంటికెళ్లి తాఖీదులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. నేడు (జనవరి 23, శుక్రవారం) ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్(ఏసీపి ఆఫీస్)లో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో ఆదేశించింది. ఈ మేరకు నార్సింగి ఆలీవ్ విల్లాస్‌లోని కేటీఆర్ నివాసంలో సిట్ అధికారులు సీఆర్‌పీసీ 160 ప్రకారం నోటీసులు ఇవ్వడానికి ప్రయత్నించారు. అక్కడ నోటీసులు తీసుకోకపోవడంతో నందినగర్‌లోని నివాసంలో అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రధానంగా 2023 ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై సిట్ అధికారులు 2024 మార్చి 10 నుంచి దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో కొందరిపై ప్రధాన చార్జిషీటు దాఖలు చేయగా, విచారణను మరింత లోతుగా కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా రెండు రోజుల క్రితం (ఈ నెల 20న) మాజీ మంత్రి హరీశ్ రావును అధికారులు సుమారు 7 గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ..ఉద్యమాలు మాకు కొత్త కాదు, మీలాగా పారిపోలేదు. ఇలాంటి అక్రమ కేసులు సమైక్య రాష్ట్రంలో చాలా పెట్టారు అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హరీశ్ రావు విచారణ ముగిసిన రెండు రోజులకే కేటీఆర్‌కు నోటీసులు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయడంపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. "నిన్న(20న) నాకు నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు(22న) కేటీఆర్‌కు ఇచ్చారు. బొగ్గు >>2

## కార్తీక దీపం సీరియల్‌గా సిట్ విచారణ

### సింగరేణి బొగ్గు గనుల కుంభకోణం వదిలి పెట్టం: కెటిఆర్

**సిరిసిల్ల బ్యూరో, జనవరి 22, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ అంటే సిట్... స్టాండ్ అంటే స్టాండంటూ... ఈ విచారణ కార్తీక దీపం సీరియల్ లాగా సాగుతూనే ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు ఎద్దేవా చేశారు. గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరుల >>2



### లోయలో పడ్డ ఆర్మీ వాహనం

10 మంది సైనికులు మృతి

మరో ఆరుగురికి గాయాలు

ఉధంపూర్ ఆస్పత్రికి తరలింపు

దోడా జిల్లాలో ఘటన

5



### చరిత్ర సృష్టించిన పివి సింధు


కెరీర్‌లో 500 మ్యాచ్ విజయాలు నమోదు

ఈ ఘనత సాధించిన ఆరో ఉమెన్ షట్లర్

తొలి భారతీయురాలిగా రికార్డు

ఇండోనేసియా సూపర్ 500 టోర్నీలో డెన్మార్క్ షట్లర్‌పై 21-19, 21-18తేడాతో విజయం

10



### కర్ణాటకలోనూ గవర్నర్ సీన్ రిపీట్

రెండు వాక్యాలు చదివి అసెంబ్లీ నుంచి వాకౌట్

బడ్జెట్ సమావేశాలకు ముందు కీలక పరిణామం

5



న్యూఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన జాతీయ ఎంజిఎన్ఆర్ఇజిఎ కార్మికుల సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

## కృతజ్ఞతలు చెప్పడానికే వచ్చా!

>> ఆసిఫాబాద్, చింతలమానేపల్లి గూడెం గ్రామాల్లో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాలు ఇంజనీరింగ్ కార్యాలయ నిర్మాణాలకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. లింగాపూర్ లో రూ 3. 99 కోట్లు, ధనోరాలో రూ 2. 30 కోట్లు, వావుడంలో రూ 2. 64 కోట్లు, గూడెంలో రూ 2. 32, కోట్లతో విద్యుత్ ఉపకేంద్రాలు, జిల్లా కేంద్రంలో రూ 1.కోటితో సబ్ స్టేషన్ రూ 1. 70 కోట్లతో ఎస్ఈ కార్యాలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని మోడీ (ఝరి) గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ బడ్జెట్ రూపొందించేటప్పుడు పాదయాత్రలో చుసిన ప్రజల కష్టాలు, సమస్యలు తీరేలా ప్రతి అంశాన్ని చేర్చుతున్నామని తెలిపారు. పాదయాత్ర సమయంలో మోడీ గ్రామంలో ఉగాది రోజుల్లో మూడు రోజులు గడిపిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. రైతుల పొలాల్లో పని చేసి, గ్రామస్థులతో కలిసి భోజనం చేసిన అనుభవాలను వివరించారు. తాను చూసిన గ్రామాలూ, మనుషులు సమస్యలను మర్చిపోలేదన్నారు. ప్రజల అవసరాల మేరకే ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొలం బాట ప్రజా బాట ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం చేపట్టామని తెలిపారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ 17 వేళా కోట్లు కేటాయించి ఐటిడిఏలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత చీరలు, సన్నబియ్యం పంపిణి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అన్నారు. రెండు సంవత్సరాల క్రితం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా తనకు భోజనం పెట్టి, అడుగులో అడుగు వేసి నడిచిన గంగూబాయి, లక్ష్మీబాయిలను హైదరాబాద్ లోని ప్రజాభవన్ కు భోజనానికి రావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి ఆహ్వానించారు. పాదయాత్ర సమయంలో ఈ ప్రాంత ప్రజల స్వేచ్ఛ పోయిందని ఇక్కడి సంపద ఇక్కడి ప్రజలకే దక్కాలని కోరారని గుర్తు చేశారు. ఉట్నూర్ మండలం దేవుగూడ గూడెంలో గ్రామస్థులతో భేటీ అయిన అయన, ఆనాటి పాదయాత్ర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రామస్థులు అప్పట్లో తెలిపిన సమస్యల్లో చాల వరకు పరిష్కరించామని తెలిపారు. ఇండ్ల సమస్య, డ్రైనేజీ, పట్టాదారు పాస్ పుస్తకాలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనాలు, పీఏసీఎస్ షబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గంగూబాయి, లక్ష్మీబాయిల హైదరాబాద్ ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు తానే చేస్తానని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. ఉట్నూర్ ఆసిపాబాద్ రహదారి వెడల్పు, ఉట్నూర్ కెరమెరి రోడ్డు అభివృద్ధి అనార్పల్లి వంతెన నిర్మాణానికి పాదయాత్రలో చేసిన విజ్ఞప్తులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ట్రైకార్ రాష్ట్ర ఛైర్మెన్ బెల్లయ్య నాయక్, జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, జీసీసీ ఛైర్మెన్ కొట్నాక తిరుపతి, ఎంపిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నికిత పంత్, డీఏఫ్ఓ నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ చిత్తరంజన్ వివిధ కార్పొరేషన్ల ఛైర్మెన్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సీరియల్‌గా సిట్ విచారణ

>> సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల, కరీంగనర్ కార్పోరేషన్‌లతో పాటుఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బిఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ మంచి పలితాలు సాదించిందని కెసిఆర్ ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలను రద్దు చేయాలని కాంగ్రెస్ కుట్ర చేస్తుందని ఆరోపించారు. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టకుండ ఉండడం కోసం జిల్లాల రద్దు అంశం ముందు పెట్టుకున్నారని విమర్శించారు. ప్రజల సౌకర్యం కోసం జిల్లాలను కెసిఆర్ ఏర్పాటు చేశారని తండాలను గ్రామ పంచాయితీలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. రేవంత్ రెడ్డి సిట్ విచారణను టివి సీరియల్‌గా కొనసాగిస్తున్నారని కొన్ని రోజులు కాళేశ్వరం, ఈ పార్ములా, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు తప్ప సాదించింది ఏమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బిజెపిలు కలిసి డ్రామాలు చేస్తున్నాయని బొగ్గు కుంభకోణంలో రేవంత్ రెడ్డి బామ్మర్థిని భయట పెడితేనే మాపై సిట్ విచారణ అంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన రాదని అసమర్దుడని ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే తెలివి లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని దీని నుంచి తప్పించుకోవాలంటే ఏం చేయాలి..? ఏదో ఒక రూపంలో అటెన్షన్ డైవర్షన్ గేమ్స్ ఆడాలి అందులో బాగంగానే కొన్ని రోజులుగా విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. సిట్ వేయాల్సింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు గుండాలను తీసుకుని పోయి భూములు కబ్జా చేస్తుండు వారి మీద సిట్ వేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి డైరెక్ట్‌గా బొగ్గు కుంభకోణాలు చేస్తున్నాడని ఆదారాలతో చూపెడితే వారిపై సిట్ ఉండదని ఎలాంటి విచారణ లేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడితే ఆశ్చర్యం అనిపించిందిని రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేస్తే కేంద్రం సిబిఐ విచారణకు ఆధేశిస్తుందని పట్టపగలే దోపిడి చేసిన దొంగ నేను దొంగతనం చేసినాను అని ఎవరైనా చెబుతారా తాము ఆదారాలతో సహా చూపెడితే కాదు దొంగనే పిర్యాదు చేయాలని చెప్పడం అసహ్యంగా ఉందని తెలిపారు. అమత్ స్కాంలో అర్హత లేకపోయిన కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్‌లో సిఎం రేవంత్ బామ్మర్ది కాంట్రాక్ట్ దక్కించుకున్నారో తాము ఆదారాలతో సహ డిల్లీకి వెళ్లి సిట్ విచారణ జరిపించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కోరిన ఎందుకు స్పందించడం లేదని కెటిఆర్ ప్రశ్నించారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని విచారణకు హాజరువుతామని తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొంటూ 50 లక్షల రూపాయలతో ఓ సన్నాసి దొరికిండని మా ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్ర చేస్తే పోలీసులు ఫోన్లు విన్నారెమో నాకేం తేలియదని కెటిఆర్ పెర్కొన్నారు.

కోమటిరెడ్డి వెకంటరెడ్డి, ఉత్తం కుమార్ రెడ్డిల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని చెప్పి జర్నలిస్టులకు చెప్తె దానిమీద వార్తలు రాస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం ఖండించలేదన్నారు. రాష్ట్ర డిజిపి, ఇంటెలిజెన్స్ ఐజిని ప్రమాణం చేసి రాష్ట్రంలో ఫోన్లు ప్రస్తుతం ట్యాప్ చేయట్లేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. గతంలో ఇంటెలిజెన్సీ ఐజిగా పని చేసి ప్రస్తుతం డిజిపిగా ఉన్న శివదర్ రెడ్డిని విచారణకు పిలిచారా? ఆయనకు తెలుస్తుందని ఎవరు ట్యాప్ చేశారో అనే విషయం అన్నారు. సిఎం దావోస్ పోయాడని ఆక్కడ నుంచి హార్వర్డ్ పోయి పది రోజులు టైం పాస్ చేయాలనే ఒక రోజు హారీష్‌రావు, మరో రోజు కెటిఆర్‌ను పిలవండని ఆదేశాలిచ్చారని ఆరోపించారు.

## ఫిబ్రవరి 5న గ్రూప్-1పై తుది తీర్పు

>> ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం(జనవరి 22)న తీర్పును మరోసారి వాయిదా వేసి.. ఫిబ్రవరి 5న వెలువరించనున్నట్టు ప్రకటించింది. గ్రూప్-1 నియామకాలపై తెలంగాణ హైకోర్టు తీర్పును వాయిదా వేసి.. వచ్చే నెల(ఫిబ్రవరి) 5న తుది తీర్పు వెల్లడించనున్నట్లుగా గురువారం తెలిపింది. కేసుకు సంబంధించిన తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని న్యాయవాదులకు డివిజన్ బెంచ్ సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తుది తీర్పును ఫిబ్రవరి 5న వెలువరించనున్నట్టు ప్రకటించింది. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, కరెక్షన్, బయోమెట్రిక్ నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయంటూ పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్, గ్రూప్1 ఫలితాలను రద్దు చేస్తూ సంచలన తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని, అవసరమైతే పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తూ అప్పట్లో నియామకాలపై సింగిల్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి)తోపాటు గ్రూప్-1కి ఎంపికైన అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ జరిపి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని ధర్మాసనం అప్పుడే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం వేగంగా స్పందించి ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసింది. ఇపుడు గ్రూప్-1 నియామకాలపై మరోసారి తుది తీర్పును ధర్మాసనం వాయిదా వేసిన నేపథ్యంలో ఇప్పటికే ఉద్యోగాల్లో చేరిన అభ్యర్థుల నియామకాలు కొనసాగుతాయా? అనే అనుమానంతో నియమితులైన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

## కేంద్రం ఎంట్రీ

>> సేకరించనుంది. బొగ్గు గని కేటాయింపులకు సంబంధించి జరుగుతున్న వివాదం తో పాటు, టెండర్ రద్దు చేయడానికి గల కారణాలను, ఇతర అంశాలపైనా ఈ బృందం సింగరేణి అధికారులతో కలిసి విచారించనుంది.

## వారం - వర్జ్యం

23-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం,ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం,ఉత్తరాషాఢ కార్తె
పంచమి తె.5.59
పూర్వాభాద్ర మ.2.33
వర్జ్యం : రా.7.06-9.14
దు.ఉ.8.56-9.41, 2) 12.42-1.27
శుభసమయం: ఉ.10.10-10.40,సా.5.30-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇంటా బయటా అనుకూల కాలం. ఆభరణాలు కొనగోలు.

**వృషభం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. భూవివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.క్రయ విక్రయాలలో లాభాలు.

**కర్కాటకం:** కోర్టు కేసుల నుండి బయటపడుతారు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**సింహం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు. పోటీ పరీక్షలలో విజయం.

**కన్య :** వృత్తి, ఉద్యోగాలలో మీ బుద్ధికుశలత బాగా లాభిస్తుంది. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణను పాటించడం వలన లాభపడతారు.బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు.

**వృశ్చికం:** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసేదిశగా ప్రయాణం సాగిస్తారు. వస్తు కొనుగోలు. నూతన కార్య క్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. సంఘసేవా కార్య క్రమాలలో పాల్గొంటారు.వాహనసౌఖ్యం.

**మకరం:** జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు. యాత్రలు సంభవము.

**కుంభం:** విదేశీ వస్తువులు అకర్షణ నుండి బయటపడుటకు జాగ్రత్త వహించండి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.సకాలంలో ఋణాలు తీరుతాయి.

**మీనం:** నూతన పెట్టుబడుల విషయంలో మెలుకువతో వ్యవహరించండి. వాహన సౌఖ్యం. కొన్ని అవ కాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు

# వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్

### ప్రతి యేడాది జులైలో హైదరాబాద్‌లో డబ్ల్యుఇఫ్ ఫాలోఅప్ సదస్సు

### సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలకు డబ్ల్యుఇఫ్ బృందం సానుకూలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి22:** దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సి4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు.ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో దావోస్‌లో జరిగే సదస్సులోని చర్చలు,తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది సమ్మర్ దావోస్ జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్‌లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డవలప్‌మెంట్,స్పోర్ట్స్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సి4ఐఆర్ తెలంగాణ (సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్‌లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. సి4ఐఆర్ ఆదర్శవంతమైన మోడల్‌గా గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై డబ్ల్యుఇఫ్ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. క్యూర్(సియుఆర్ఈ),ప్యూర్(పియుఆర్ఈ),రేర్(ఆర్ఏఆర్ఏ) ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు.సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయోడిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.

## జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> ఆనల్ కీలకంగా కొనసాగుతున్నాడు. భద్రతా బలగాలపై భారీ దాడులకు అతడే వ్యూహరచన చేసినట్లుసమాచారం. మావోయిస్టుల ఏరివేత కొనసాగుతున్న క్రమంలో చనిపోయిన మావోయిస్టుల సంఖ్య మరింతగా పెరుగుతోంది.కోబ్రా బెటాలియన్ 209తో ఈ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికీ కాల్పులు కొనసాగుతున్నాయని ఆపరేషన్స్ ఐజి మైఖేల్‌రాజ్ వెల్లడించారు. కిరీబురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారండా అటవీప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కాగా అనల్ తలపై ఆరు రాష్ట్రాల్లో మొత్తంర ఊ.5 కోట్లవరకూ రివార్డు ఉంది. కొన్నేళ్లుగా కీలకంగా వ్యవహరించిన అనల్ మృతితో మావోయిస్టులకు షాక్ తగిలిందనే చెప్పాలి. మావోయిస్టు రహిత భారత్ లక్షంగా కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు మార్చి31తో ముగియనుంది.ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర బలగాలు మరింత దూకుడును పెంచాయి.ఈ క్రమంలో వరస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి.మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఒడిశా, జార్ఖండ్‌లతో పాటు ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఇప్పటికే కూంబింగ్‌ను తీవ్రతరం చేయడంతో ఆ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం దాదాపుగా తగ్గింది.మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్య ప్రాంతాన్ని ఇప్పటికే భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నా సంగతి విధితమే. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న పలువురు అగ్రనేతలు వయో భారంతో ఉన్నారు. వారే లక్ష్యంగా ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం సహా సరిహద్దు రాష్ట్రాల్లో కూంబింగ్‌ను తీవ్రతరం చేశాయి భద్రతా బలగాలు. నిర్దేశించుకున్న లక్ష్యం కోసం కేంద్రం ఆ దిశగా అడుగులు వేస్తోంది.చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ని దండకారణ్యంలో అడపాదడపా మావోయిస్టు కార్యక్రమాలు జరుగుతున్నా గత ప్రభావం కనిపించడంలేదు.




బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా లండన్‌లో నిరసన ప్రదర్శన చేసిన బ్రిటిష్ హిందువులు

## టెండర్లు రద్దు

>> అయింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలకమండలిలో ఎందుకు చర్చించలేదన్న గురువారం కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ సింగరేణి యాజమాన్యాన్ని నిలదీశారు. ఒకవేళ చర్చించి ఉంటే టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇదే సమయంలో టెండర్ వేయదలచిన కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు అంటూ ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే టెండర్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని సింగరేణి అధికారులు వివరణ ఇచ్చారు. బొగ్గు గని టెండర్ల నిబంధనలు, బిడ్లు పై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం తెలిపింది. మరోపక్క కోల్ లింకేజీలో భాగంగా సింగరేణికి ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గని దక్కింది. ఈ గనిలో తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తి పనులకు టెండర్ వేసే సంస్థ విధిగా ఆ సైట్ ను సందర్శించాలి. ఆ సంస్థ బొగ్గు గనిని సందర్శించినట్లు సింగరేణి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే నిబంధనపై పలు విమర్శలు వచ్చాయి. ఈ విషయంలో ఆరోపణలు రావడంతో టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలు ఏ నిబంధనలు విధించాయో వాటిపై అధ్యయనం చేసి తిరిగి టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు సింగరేణి అధికారులకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలతోనే సింగరేణి యాజమాన్యం గురువారం జరగాల్సిన టెండర్ ప్రక్రియను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, నైనీ బొగ్గు గనిలో ఓవర్ బర్డెన్ (బొగ్గుపై ఉండే మట్టి, ఇతర రాళ్లు) తొలగింపు, బొగ్గు వెలికితీత, ఆ బొగ్గును తొలి విడతలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)1, 2లకు తరలించడంతో పాటు, మలి విడతలో మూడో సీహెచ్‌పీకి తరలించే పనులను 25 ఏళ్ల కాలానికి గాను అప్పగించడానికి వీలుగా రూ.1604.42 కోట్లతో సింగరేణి ఇటీవల ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. సాధారణంగా బొగ్గు బ్లాకు సమగ్ర నిర్వహణ పనులను ఎవరికైనా అప్పగించాలంటే ఓవర్ బర్డెన్ తొలగింపు, భారీ గని నిర్వహణలో పూర్వానుభవంతో పాటు బొగ్గు తరలింపునకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలు, అనుభవాన్ని ప్రామాణికంగా తీసుకునేవారు. కానీ నైనీ బొగ్గు గని విషయంలో మాత్రం విధిగా గనిని సందర్శించి, పరిసరాలనుగమనించాలని, అంతేకాకుండా సింగరేణి సంస్థ నుంచి సర్టిఫికెట్ పొందాలనే నిబంధనే వివాదాలకు కారణమైంది. దాంతో టెండర్ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని సింగరేణి నిర్ణయించింది.

## కెటిఆర్‌కు సిట్ నోటీసులు

>> స్కామ్‌పై సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టమని హెచ్చరించారు. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా వెంటపడతామని తేల్చి చెప్పారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా..రేవంత్ వెంటపడుతూనే ఉంటాం అని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్‌కు సిట్ నోటీసుల పేరుతో కాంగ్రెస్ సర్కారు నాటకం ఆడుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. పాలన గాలికి వదిలి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చేస్తున్నారని ఆక్షేపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని అత్యున్నత న్యాయస్థానాలు తేల్చి చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం మొగలి రేకులు సీరియల్‌గా దర్యాప్తు నడిపిస్తోందని అన్నారు.ప్రతిపక్షాల నోరు మూయించేందుకే సిట్ ద్వారా నోటీసులు ఇప్పిస్తున్నారని బీఆర్ఎస్ నేత సోమభరత్ విమర్శించారు. కోర్టులు, చట్టంపై నమ్మకం ఉన్నందున చట్టబద్ధంగా ఎదుర్కొంటామని తెలిపారు. పాలించాలని ప్రజలు తీర్పు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పాడు పనులు చేస్తోందని దుయ్యబట్టారు. హామీలు అమలు చేయకపోవడంతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయని, ప్రజల దృష్టి మళ్లించేందుకు సిట్ వేశారని ఆరోపించారు.కేటీఆర్‌పై ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు చేసి పలుమార్లు విచారణ చేసింది. ఫార్ములా ఈ కేసుకు సంబంధించి హెచ్ఎండీఏ నిధులను క్యాబినెట్ అనుమతులు లేకుండా విదేశాలకు మళ్లించారనే అంశంలో ఏ1గా కేటీఆర్, ఏ2గా అర్వింద్ కుమార్ ఐఏఎస్, ఏ3గా బీఎల్ఎన్‌రెడ్డిలపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

## 100 మెగా వాట్ల ఎఐ డేటా సెంటర్

>> మెగావాట్ల సామర్థంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

నెట్ జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్‌లో భాగమని అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్, గాగిల్లాపూర్ లోని రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్)-2026 లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ష్నైడర్ కంపెనీ సీఈవో దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ష్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలోనే 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో కృషి చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తెలంగాణ ఎదిగిందని శ్రీదర్‌బాబు తెలిపారు.

## ఈసారి స్మార్ట్ అగ్రి బడ్జెట్

>> ఈసారి బడ్జెట్‌లో సబ్సిడీ సంస్కరణలు, డిజిటల్ వ్యవసాయం, క్లైమేట్ రెసిలియంట్ పద్ధతులు, కోల్డ్‌చైన్ ఫుడ్ ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన ప్రాధాన్యతలుగా ఉండనున్నాయి. పశుపోషణ, మత్స్య సంపద, ఉద్యానవనాల వంటి అనుబంధ రంగాలపై దృష్టి పెట్టడం ద్వారా రైతుల ఆదాయాలను గణనీయంగా పెంచేందుకు చర్యలు చేపడుతుంది. కేంద్ర బడ్జెట్ కోసం ప్రాథమిక నివేదికలు, అంచనాల ఆధారంగా కేటాయింపుల పెంపుదల, డిజిటల్ స్వీకరణ, వాతావరణ స్థితిస్థాపక పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తోంది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రత్యక్ష నగదు ప్రయోజనాల కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల ఆర్థిక సాయాన్ని రూ.8 వేలకు పెంచడం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మద్దతు ఇవ్వనుంది. అలాగే కొత్త బడ్జెట్‌లో వ్యవసాయ రుణాన్ని పెంచే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. పాడి పరిశ్రమ, మత్స్య, పశుసంవర్ధక రంగాలకు రుణాలను మరింత అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించి, పూచీకత్తు లేని రుణాల పరిమితిని పొడిగించనుంది. ముఖ్యంగా నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టడం, రైతులను నష్టాల నుండి రక్షించడానికి రూ.30 లక్షల వరకు జరిమానా మరియు 3 సంవత్సరాల జైలు శిక్ష విధించడం లక్ష్యంగా ప్రభుత్వం కొత్త విత్తన చట్టాన్ని ప్రవేశపెట్టనుంది. దీంతో పాటు, మెరుగైన నాణ్యత గల, తెగులు నిరోధక, అధిక దిగుబడినిచ్చే విత్తనాలపై జాతీయ మిషన్ వైపు ముందుకు సాగడం, మౌలిక సదుపాయాలు, శీతలీకరణ, గిడ్డంగులను పెంచడం. పంటకోత తర్వాత నష్టాలను తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోనుంది. మెరుగైన ధరల కోసం మరిన్ని మండీలను ఈనామ్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించడం, సాంకేతికత, స్థిరమైన డిజిటల్ వ్యవసాయం (అగ్రిస్టాక్) అందుబాటులోకి తీసుకురానుంది. సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రైతు డేటా, భూమి రికార్డులు మరియు మార్కెట్ ప్లాట్‌ఫారమ్‌ల ఏకీకరణతోసహా డిజిటల్ కార్యక్రమాలకు నిధులను అందించడంలో ప్రధాన ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. నమోడ్రోన్ దీదీ యాంత్రీకరణలో భాగంగా పోషకాల పిచికారీ కోసం డ్రోన్‌లను ఉపయోగించడం, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి మద్దతు పెంచడం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడానికి రసాయన రహిత వ్యవసాయాన్ని నిరంతరం ప్రోత్సహించడం. ఆవాలు, వేరుశనగ వంటి నూనెగింజలను పండించడానికి రైతులను ప్రోత్సహించడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో "నూనెగింజలలో ఆత్మనిర్భరత" మిషన్‌ను పటిష్టంగా అమలు చేయనుంది.



# గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ

## హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో డెయిరీ విస్తరణ

### భారత్ ఫ్యూచర్ సిటీలో హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఈఎఫ్)-2026 సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్త రించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌళిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైద రాబాద్‌కు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.

# ఛత్తీస్‌గఢ్ స్టీల్‌ప్లాంట్‌లో భారీ పేలుడు

## ఏడుగురు మృతి, మరో పదిమందికి తీవ్రగాయాలు

**నయారాయ్‌పూర్, జనవరి 22:** స్టీల్ ప్లాంట్‌లో పేలుడు సంభవించింది. బొగ్గు కొలిమి అకస్మాత్తుగా పేలింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో తీవ్రంగా పదిమంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలోడా బజార్ జిల్లాలో గురువారం ఉదయం బకులాహిలోని రియల్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్



లో దుర్ఘటన జరిగింది. బొగ్గు కొలిమి ప్రాంతం చుట్టూ కొంతమంది కార్మి కులు శుభ్రపరిచే పనులు చేస్తుండగా అది పేలింది. మంటలు, దట్టంగా పొగలు చాలా దూరం వరకు కనిపించాయి. మండుతున్న బొగ్గు, అధిక వేడిమి వల్ల సుమారు ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. పది మందికిపైగా కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు పోలీసులు, అధికారులు ఆ స్టీల్ ప్లాంట్ వద్దకు చేరుకున్నారు. కోల్డ్ ఫర్నేస్ పేలుడుపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్లాంట్‌లోని భద్రతా నిబంధనలను పరిశీలిస్తున్నారు. పేలుడు ధాటికి నల్లటిపొగ ఆకాశాన్ని కమ్మేసిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి భారీ ప్రమాదం జరిగిందని ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నట్లు జిల్లా అదికారులు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాల పాలయినవారిని అత్యవసర చికిత్సలకోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఫ్యాక్టరీలో భద్రతా లోపాలపైనా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# బ్రిటన్ పబ్లిషింగ్ సంస్థ పియర్సన్‌తో ఎంఒయు

## దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ ఒప్పందం

## తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వస్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమావేశాల్లో తెలంగాణ ఏ ఐ ఇన్నోవేషన్ హబ్ (టిఏఐ హెచ్)కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఒయూలు) కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఒయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లా డుతూ.. యువతకు ఏఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఒయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్సన్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రాజెక్ట్ త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీకి చెందిన ఏఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఒయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ (డిఎంసిసి)తో కుదిరిన ఎంఒయూ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి





అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్‌లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు.

# 317 బాధిత టీచర్లకు ఉపశమనం కలిగేలా జిఒ 190ని అమలు చేయాలి



## జిఒ 25తో లింక్ చేయొద్దు

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తపస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జీవో 317 మూలంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలాగా జీవో 190ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ హన్మంతరావు గురువారం సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో 25తో లింక్ చేయకుండా 317 జీవో బాధితు ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా జీవో 190ని పూర్తిగా అమలు చేయాలన్నారు.

జీవో 25ను ప్రత్యేకంగా అమలు చేయాలన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు తాత్కాలిక ఉపశమనం కోసం ప్రభుత్వం జారీ చేసిన 190 జీవోను వెంటనే పూర్తిస్థాయిలో అమలు పరచాలని కోరారు. స్థానికతను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం సానుకూల నిర్ణయం త్వరగా తీసుకోవాలన్నారు. జీవో 190 ప్రకారం, వివిధ జిల్లాలలో గుర్తించబడిన అన్ని అర్హత కలిగిన స్థానచ్యుత ఉపాధ్యాయులకు తాత్కాలిక బదిలీలను వారి సంబంధిత జిల్లాల్లో ఇవ్వాలని కోరారు. 33 జిల్లాల నుంచి సేకరించిన సమాచార ప్రకారం సుమారు 3,200 మంది ఉపాధ్యాయులు మాత్రమే జీవో ఎంఎస్ నంబర్ 190 కింద స్థానచ్యుత ఉపాధ్యాయులుగా అర్హత పొందినట్లు దరఖాస్తులు సమర్పించారన్నారు.

ఈ అర్హత కలిగిన ఉపాధ్యాయులను వారి సంబంధిత జిల్లాల్లో లభ్యమయ్యే ఖాళీల ప్రకారం ఖచ్చితంగా సర్దుబాటు చేసి బదిలీ చేయాలని సీఎస్‌ని కోరినట్లు తెలిపారు. విద్యాశాఖలో జీవో ఎంఎస్ నంబర్ 25 ఖాళీలను మాత్రమే తీసుకుని వాటి ద్వారా జీవో 190 అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

# దావోస్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎపి మంత్రి నారా లోకేశ్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి22:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో కొనసాగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ మర్యాదపూర్వకంగా సమావేశమ య్యారు. ఈ భేటీలో పరస్పర గౌరవ సూచకంగా సీఎం రేవంత్ రెడ్డిని లోకేశ్ శాలువాతో సన్మానించారు. లోకేశ్‌ను కూడా సిఎం రేవంత్ సన్మానించారు. ఒకరినొకరు మెమొంటోలు ఇచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. దావోస్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య కూడా భేటీ జరగనుందని తెలుస్తోంది. ఒకే వేదికపై ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనడం వల్ల పెట్టుబడుల పరంగా కొత్త అవకాశాలు తెరుచుకునే అవకాశం ఉంది. కాగా గతంలో కూడా దావోస్‌లో ఇద్దరు ముఖ్యమంత్రులు ఒకే వేదికపై కలుసుకున్నారు.



## ఆర్థిక ఇబ్బందులు తాళలేక

# సామూహిక ఆత్మహత్యకు యత్నించిన కుటుంబం

**జగద్గిరిగుట్ట, జనవరి 22, ప్రభాతవార్త :** జగద్గిరిగుట్ట ఇబ్బందులు తాళలేక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషాద సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ బి. వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన సతీష్‌కుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి ఆల్విన్ కాలనీ సమీపంలోని విజయనగర్ కాలనీలో భార్య ఆమని, కుమారుడు నితిష్‌కుమార్, కుమార్తె శ్రీ జావళి (18)తో నివాసముంటున్నాడు. సతీష్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. రెండు రోజుల క్రితం దివ్యాంగురాలైన కుమార్తెను చంపేశారు. మిగితా ముగ్గురూ బుధవారం చేతులు కోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. ఈ విషయాన్ని నితీశ్ తన స్నేహితుడు భాస్కర్‌కు సమా చారం అందించాడు. దాంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాణా పాయ స్థితిలో ఉన్న ముగ్గురిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

వార్త

దూరదృష్టి లేని వ్యక్తి ఉన్నతాశయాలు సాధించలేడు. గొప్పపనులు చేపట్టలేడు.

-ఉడ్రోవిల్సన్


# ఆదివాసులకు అనాదిగా అన్యాయమే?

ఆదివాసుల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని ఒకవైపు నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా, మరోపక్క కనీస సదుపాయాలులేక అర్ధాకలితో అల్లాడుతున్న లక్షలాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతం. వైద్య సదుపాయం మాట అటుంచి కడుపునిండా తిండిలేక పోష్టికాహారం లోపించి, గిరిపుత్రులు అనేక వ్యాధులతోపాటు అంధులుగా మారుతున్నారనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.భావిభారత పౌరులుగా ఎదగాల్సిన దేశవ్యాప్తంగా లక్షలాది మంది గిరిజన బాలబాలికలకు గ్లోకోమా, కెటరాక్ట్, విటమిన్ ఎ లోపంతో అంధులుగా మారే అవకాశాలున్నాయని సమాచారం ఆవేదన కలిగిస్తున్నది.సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోయి క్రమేపీ అంధత్వం ప్రాప్తిస్తే ఆ వ్యక్తితోపాటు కుటుంబం పరిస్థితి ఎంతదారుణంగా ఉంటుందో ఊహించవచ్చు. అవిద్య,అజ్ఞానం,మూఢత్వం, దారిద్ర్యం, ప్రకృతితోపాటు తోటి మానవుడి దోపిడీతో గిరిజన ప్రాంతాలు నేటికీ అతలాకుతలం అవుతున్నాయి. గిరిజనులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కోట్లాది నిధుల్లో నాలుగోవంతు కూడా వారికి చేరడంలేదనే ఆరోపణలను తోసిపుచ్చలేం. స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా వారి కోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు (ఐటిడిఏ) ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా వేలాది మంది ఆదివాసులకు రహదారి సౌకర్యం లేదు. నడవడానికి కూడా సరైన బాటలు లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. బస్సు ఎక్కినవారే కాదు, చూడనివారు కూడా ఉన్నారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. అన్నింటికంటే ముఖ్యంగా విద్య, వైద్యం విషయంలో ఆ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పొచ్చు. ప్రధానంగా సీజన్ మారినప్పుడల్లా వారిపై విషజ్వరాలు విజృంభించడం ఎందరో అమాయకులు అసువులు బాయడం ప్రతియేటా సర్వసాధారణమైపోయింది. భారతదేశంలో ఏడువందల ఐదు విభిన్న తెగలకు చెందిన దాదాపు పదకొండు కోట్ల మంది వరకు గిరిజనులు ఉన్నారని దశాబ్దం క్రితం వెల్లడించిన అంచనాలు చెబుతున్నాయి. ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి కనీస మౌలిక వసతుల్లో కూడా ఆయా వర్గాలు వెనుకబడే ఉన్నాయి. ఆదివాసుల ఆరోగ్య పరిస్థితి అధ్యయనం చేయడానికి కేంద్రం పన్నెండేళ్లక్రితం ప్రముఖ గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు అభయ్‌బంగ్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఆ కమిటీ దేశవ్యాప్తంగా అనేక ఆదివాసుల ప్రాంతాలను పర్యటించి అధ్యయనం అనంతరం 2018లో నివేదికను సమర్పించింది. మలేరియా కేసులు అత్యధికంగా ముప్పైశాతంపైగా ఆదివాసీ ప్రాంతాల్లో వెలుగు చూస్తున్నాయని ప్రతి నలుగురు గిరిజనుల్లో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని స్పష్టం చేసింది. గిరిజనుల అనారోగ్యానికి మూలకారణమైన పొగాకు వినియోగం రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. పదిహేను నుంచి యాభైనాలుగేళ్ల ఆదివాసుల్లో పొగాకు అధికం అవ్వడం కారణంగా క్షయతో పాటు ఇతర వ్యాధులు ప్రబలిపోతున్నాయని ఆ నివేదిక స్పష్టం చేసింది. మరోవైపు ఐదేళ్లలోపు ఆదివాసీ చిన్నారుల్లో నలభైశాతం సరైన పౌష్టికాహారం కొరవడి గిడసబారిపోతున్నారని పదహారు శాతం పిల్లల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉందని యునిసెఫ్ గతంలో తేల్చి చెప్పింది. భారతదేశంలోని మొత్తం గిరిజనుల్లో ఎనభైశాతం శాతం మధ్యప్రదేశ్,మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్నాటక, జార్ఖండ్, తదితర రాష్ట్రాల్లో ఉన్నారు. ఈశాన్య రాష్ట్రాలు జమ్మూకాశ్మీర్,బీహార్‌తోపాటు తమిళనాడులో 15.3శాతం ఆదివాసులు నివసిస్తున్నారు. వీరి అవసరాలకు తగ్గట్టుగా నేటికీ వైద్యసౌకర్యాలు లేవనేచెప్పాలి. ఇతర విషయాలు ఎలాఉన్నా గిరిజనుల విషయంలో వైద్యసేవలను నిర్లక్ష్యం చేయడం క్షమార్హంకాదు. వైద్యం,విద్య విషయంలో ప్రత్యేకించివారికి కేటాయించిన నిధులు వారికే అందేలా చూడడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. గిరిజనుల కోసం కేటాయించిన నిధులు దారిమళ్లించి ఇతర ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా జరుగుతున్నది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1970లో సాంఘిక సంక్షేమశాఖనుంచి విడదీసి ప్రత్యేకంగా గిరిజన సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొట్నాక భీమ్‌రావును తొలిగిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా నియమించారు.ఆయన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టగానే ఎంతోకాలంగా మూలపడి ఉన్న 'హేమండార్ఫ్' నివేదికను బయటకుతీసి ఆ సిఫారసులను అమలు చేసేందుకు నడుం బిగించారు. ఆనాడే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ ఏర్పాటుకు నాంది పలికారు. వందలాది కోట్లరూపాయలు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలకు భవనాలు నిర్మించి డాక్టర్లను కింది స్థాయి ఉద్యోగులను నియమించారు. కానీ వారిని అక్కడికి పంపడంలో విఫలమవుతున్నారు.దీనికితోడు ఆ ప్రాంతాల్లో సరఫరా అవుతున్న మందులు నాసిరకం కావడంతో రోగాలు తగ్గక నమ్మకం సన్నగిల్లి గిరిజనులు నాటు వైద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. పసర్లు,వేర్లతో వచ్చీరాని వైద్యం చేసుకొని ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆదివాసుల ఆకలితీర్చి వారిఅభ్యున్నతికి పాటుపడాలి. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలను అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీనిని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.



మనిషి తన హృదయంలోని మాధుర్యాన్ని చూపులలో, మాటలలో వెల్లడించాలి. మాలిన్యాన్ని మనసులోనే ప్రక్షాళన చేసేయాలి.

షేక్‌స్పియర్



చదువులో ఆనందాన్ని పొందితే, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటావు.

మహాత్మాగాంధీ

## ప్రజావాక్కు



### పెరిగిన వెండి,బంగారం ధరలు

వెండే కాదు పెళ్ళిళ్ళలో ముఖ్యమైన తాళి బొట్టుకు కావలసిన కనీసం అరతులం బంగారం కూడా కొనలేని దుస్థితిలో ఉన్న సామాన్య గృహస్తుడు సంసారాన్ని ఈడ్చుకు రావడం కూడా దుర్లభమే. ముందు రోజులు ఇంకా గడ్డు కాలమే. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎప్పటికప్పుడు బాగా పెరుగుతున్నాయి. చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే ప్రైవేటు సంస్థలలో పనిచేసే వారికి,కూలినాలి చేసుకుని రేపటి పనికోసం ఎదురు చూసే అభాగ్యులకు బంగారం, వెండి మాట ఎత్తడానికి కూడా నోచుకునే అదృష్టం లేకుండాపోయింది. దీని ప్రభావం అన్నిటిపైన పడుతుంది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### ఆన్‌లైన్ సర్వీసెస్‌లో సాంకేతిక లోపం

తెలంగాణ మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ట్యాబ్ ఓపెన్ కావడం లేదు. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులోఉండాల్సి ఉంది.కానీ ప్రస్తుతం ఈ లోపం కారణంగా అనేక మంది భక్తులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొం టున్నారు. కావున, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ సాంకేతిక సమస్యను తక్షణమే పరిష్కరిం చి, మీసేవ యాప్ అన్ని విధాలుగా సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

- సి.వి.ఆర్ కృష్ణ, హైదరాబాద్

### అంబేద్కర్‌పై వివక్ష ఎందుకు

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న,చిన్న రాష్ట్రాల ప్రదాతడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌గారి విగ్రహాలపై కొందరు దుండగులు విచక్షణారహితంగా ప్రవర్తించి ధ్వంసం చేస్తున్న వారిపై దేశద్రోహానికి సమానమైన చట్టం చేసి శిక్షించాలి. అంబేద్కర్‌గారుఉన్నత విద్యలను అభ్యసించి, అనేక డిగ్రీలు పొంది, భారతదేశానికి రాజ్యాంగం రూపకల్పన చేయడం జరిగింది.కొన్నిచోట్ల కొంతమంది దుండగులు అంబేద్కర్ విగ్రహాలపై వివక్షత చూపుతూ కొన్ని రకాల అసభ్య ప్రవర్తన చేయడం జరుగుతుంది. అట్టివారిని గుర్తించి కఠినంగా శిక్షించడంలో భాగంగా దేశద్రోహానికి సమానమైన శిక్షలు విధించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### పొగాకు.. యువతకు ముప్పు

పొగాకు వినియోగం కేవలం వ్యక్తిగత అలవాటు కాదు, అది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న తీవ్ర సామాజిక సంక్షోభం. క్యాన్సర్, గుండె, శ్వాసకోశ వ్యాధులకు ప్రధాన కారణమైన పొగాకు వల్ల ప్రతి ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పొగాకు పరిశ్రమద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయం కంటే, దానివల్ల కలిగే అనారోగ్యానికి చేసే వైద్య వ్యయం మరియు మానవ వనరుల నష్టంచాలారెట్లు అధికం.ముఖ్యంగా ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా యువతను ఈ వ్యసనానికి బానిసలుగా మార్చడం భవిష్యత్తు తరాల మనుగడకే ముప్పుగా మారింది.ఈ నేపథ్యంలో, పొగాకు ఉత్పత్తులపై కేవలం హెచ్చరికలు సరిపోవని, సంపూర్ణ నిషేధం దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ట్రంప్‌కు నోబెల్ పిచ్చి

డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ ఇవ్వలేదు అని ఆగ్రహంతోనే ఇవన్నీ చేస్తున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఎట్టకేలకు ఇరాన్‌పైన మాత్రం దండ యాత్రను ఆపివేశాడు. అయితే 8 యుద్ధాలు ఆపిన వాడికి నోబెల్ ఎందుకు ఇవ్వరు అనేదాక ఆయన స్వరం వెళ్ళింది అంటే ఆయనకు నోబెల్ పట్ల ఎంత ప్రీతి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అంత మాత్రమే కాదు కైలాష్ సత్యార్థి లాంటి వాళ్ళు నోబెల్ పట్ల ఇంత పిచ్చి ఉన్న నాయకుడిని చూడలేదు అంటే పరిస్థితి అర్థం అవుతుంది. నోబెల్ ఇవ్వలేదని ఇవ్వాళ గ్రీన్ ల్యాండ్ మీద దండెత్తిన వాడు రేపు ఇంకా ఏదో అవార్డ్ ఇవ్వకపోతే ప్రపంచం మొత్తం మీదికి దండెత్తుతా అంటే పరిస్థితి ఏమిటి?

-భారత అవినాష్, జనగామ

### సెలవులను పొడిగించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నెలకు ఎన్ని సెలవులు ఉంటాయి. ఒక సంవత్సరానికి ఎన్ని సెలవులు ఉంటాయి. అధికారుల అండదండలతో చాలామంది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువగా సెలవులు వాడుకుంటున్నారు. క్యాజువల్ లీవులు విపరీతంగా పెడుతున్నారు. వికలాంగులకు అందరికంటే 10 సెలవులు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలి. వారికి ఒక సంవత్సరంలో మిగిలిన సెలవులను తర్వాత వచ్చే సంవత్సరంలో వాడుకునే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# తైవాన్‌పై యుద్ధమేఘాలు

**తైవాన్ చిన్న దేశమే అయినా పలురంగాల్లో బాగా అభివృద్ధి చెందిన దేశం. ఐక్యరాజ్య సమితి గుర్తించకపోయినా ఆర్థికబలం,ఆయుధ బలంతోపాటుగా పలుఅంశాల్లో తైవాన్ తన ప్రత్యేకతను ప్రపంచా నికి నిరూపించుకుంది.చైనా నిరంకుశత్వాన్ని నిరసిస్తూ, విస్తరణవాదంతో కాకుండా ప్రజాస్వామ్య వాదంతో పని చేయాలని చెబుతున్నా, తైవాన్‌పైచైనా కోపంతో రగిలిపోతున్నది. తైవాన్‌పై చైనా దాడికి తెగబడితే పలుదేశాలు అండగా నిలబడతాయని పూర్తిగా నిర్ధారణకురాలేము. తైవాన్ తనకుతాను స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నప్పటికీ, అక్కడ ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టబద్ధమైన స్వయం పాలన కొనసాగుతున్నప్పటికీ, ఇప్పటికీ తైవాన్‌ను ప్రపంచ దేశాలు పూర్తిస్థాయిలో గుర్తించ లేదు. కేవలం 12దేశాలు మాత్రమే తైవాన్ ఉనికిని గుర్తించాయి. ఇప్పటికైనా తైవాన్‌ను చైనా ప్రత్యేకదేశంగా గుర్తించాలి. ఇలాంటి అభివృద్ధి చెందుతున్న, ఉత్తమ ప్రజాస్వామ్య దేశమైన తైవాన్ అస్థిత్వాన్ని కాపాడాలి.**



సుంకవల్లి సత్తిరాజు

ఆధునిక యుగంలో యుద్ధాలు అనాగరికానికి, అరాచక వాదానికి పరాకాష్ట. మధ్య యుగాల నాటి చరిత్రను పునరావృతం చేసి,ప్రజలను చీకటి యుగంలోకి నెట్టే ఆటవిక చర్యలను వేగవంతం చేయడానికి బలమైన దేశాలు కంకణం కట్టుకున్న చందంగా నేటి ప్రపంచ పరిస్థితులు అగుపిస్తున్నాయి. యుద్ధాలతో ప్రపంచాన్ని భస్మీపటలం చేసే ఉన్మాద చర్యలకు సామ్రాజ్యవాద శక్తులుప్రయత్నించడం బాధ్యతారాహిత్యం. తైవాన్‌పై డ్రాగన్ దేశం దాడిచేసి, ఆక్రమించుకోబోతుందనే వార్తలు పతాక శీర్షికల్లో ప్రచురింపబడుతున్నాయి. అన్ని సమాచార, ప్రసార, ప్రచార,సాంఘిక మాధ్యమాల్లో తైవాన్ పేరు మారుమోగిపోవడం చూస్తున్నాం.ఒక సమస్య తరువాత మరొక సమస్య ప్రపంచ దేశాలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక వైపు ఇరాన్ అమెరికాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు,మాటల యుద్ధం ఏ క్షణంలోనైనా భారీ యుద్ధానికి దారితీసే పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రపంచ దేశాలను వణికిస్తున్న మరో సంఘర్షణకు చైనాతెరతీసింది.తైవాన్‌పై దాడికి తెగబడుతున్నది. తూర్పు ఆసియాలో వాయవ్య పసిఫిక్ మహా సముద్రంలో భూసరిహద్దులు లేని ద్వీప దేశమైన తైవాన్‌ను ఆక్రమించుకుని, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో విలీనం చేసితూర్పు ఆసియాలో తిరుగులేని శక్తిగా ఎదగాలని చేసేప్రయత్నంలో భాగమే చైనా చేపట్టిన 'జస్టిస్‌మిషన్' ప్రధానోద్దేశ్యంగా భావించాలి. జస్టిస్ మిషన్ పేరుతో చైనా ఇప్పటికే తైవాన్‌ను చుట్టిముట్టింది. ఈ నేపథ్యంలో తైవాన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం తైవాన్‌కు ఆయుధాల సరఫరా వేగవంతం చేయాలని అమెరికా సెనేట్ కోరింది. ఇప్పటికే తైవాన్ తన దేశ రక్షణకోసం3.5లక్షల కోట్లు కేటాయించింది. తైవాన్ చైనాలో అంతర్భాగమని, తైవాన్‌ను ఆక్రమించుకుంటామని జిన్‌పింగ్ హెచ్చరించగా, ప్రజాస్వామ్య దేశమైన తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని ఆ దేశ అధ్యక్షుడు లై చింగ్‌టె ప్రకటించడమే కాకుండా, ఇందుకు అమెరికా సహాయాన్ని అర్థించడం కూడా జరిగింది. దక్షిణ కొరియా, జపాన్ వంటి పలు దేశాలు తైవాన్‌కు అండగా నిలబడే అవకాశాలున్నాయి. అమెరికా అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వెనిజులాపై దాడిచేసి ఆ దేశ అధ్యక్షుడైన నికోలస్ మదురోను నిర్బంధించిన తర్వాత తాము కూడా తైవాన్‌ను ఆక్రమించుకుంటే తప్పేంటనే ఆలోచన చైనాలో అంకురించింది. తైవాన్ అంశం చిలికి చిలికి గాలివానలా మారి పెనుయుద్ధానికి దారితీసే అవకాశాన్ని తోసిపుచ్చలేం. ఇప్పటికే తైవాన్ జలసంధి చుట్టూ చైనా వందలాది యుద్ధ విమానాలను, పదుల సంఖ్యలో యుద్ధనౌకలను మోహరించినట్టు వార్తలు వెలువడ్డాయి.తైవాన్ చూట్టూ చైనా సైనిక, నౌకా వైమానిక విన్యాసాలు చేయడం పట్ల అమెరికా అభ్యంతరం చెబుతూ ఈ చర్యను ఖండించింది. తైవాన్ భూతల, గగనతలాల్లో చైనా యుద్ధ విన్యాసాలు చేస్తున్నది.అసలు ఈ పరిస్థితులు ఏర్పడడానికి కారణమేమిటి? తైవాన్‌ను తన దేశ అంతర్భాగంగా చైనా పేర్కొనడానికి కారణమేమిటి?తైవాన్ తనను తాను స్వతంత్ర దేశంగా ఎందుకు భావిస్తున్నది? చైనా తైవాన్ మధ్యలో అమెరికా ఎందుకుజోక్యం చేసుకుంటున్నదనే విషయాలపై అవగాహన కలగాలంటే చరిత్ర పుటలను తిరగేయాలి. అప్పట్లో చైనాలో చెలరేగిన అంతర్యుద్ధంలో చైనా ప్రధాన భూభాగంపై కమ్యూనిస్టులు పట్టుసాధించారు. 1949లో చైనాలోని కుమో మింటాంగ్ ప్రభుత్వం పతనంతో మావో జెడాంగ్ నేతృత్వంలో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆవిర్భవించింది.మావో చేతికి చైనా అధికారపగ్గాలు రావడంతో సివిల్‌వార్‌లో ఓడిపోయినసైనికులు, నాయకులు,వ్యాపారులు, లక్షలాది మంది ప్రజలు తైవాన్



కు పలాయనం చిత్తగించి,అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పటి వరకు శాంతి,సామరస్యాలతో మనుగడ సాగిస్తున్నారు. చైనా ప్రధాన భూభాగం'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' (పి.ఆర్.సి)గాను, తైవాన్ 'రిపబ్లిక్ ఆఫ్ చైనా' (ఆర్.ఒ.సి)గాను పిలువబడుతున్నది. 1949నుండి 1975వరకు చియాంగ్ కై షేక్ ఆధ్వర్యంలో తైవాన్ గణనీయమైన ప్రగతి సాధించింది. అతని మరణానంతరం కూడా తైవాన్ అనేక రంగాల్లో ముందంజలో దూసుకుపోవడం గమనార్హం. నేడు ప్రపంచంలో తైవాన్ అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థలు గల దేశాల్లో 20వ స్థానంలో ఉంది. వన్ చైనా పాలసీ ప్రకారం తైవాన్‌ను ఏ దేశమూ స్వతంత్ర దేశంగా గుర్తించకూడదు. తైవాన్‌కు సంబంధించిన విషయాలను చైనాతో మాత్రమే అధికారికంగాసంప్రదించాలి.అమెరికా చైనాల మధ్య 1972,1979,1982వ సంవత్సరాల్లోమూడు కమ్యూనిక్ ఒప్పందాలు కుదిరాయి.వన్ చైనా పాలసీని ఉల్లఘించి, తైవాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేయడం, ప్రత్యక్ష ఒప్పందాలు కుదుర్చుకోవడం పట్ల,'త్రీ కమ్యూనిక్స్'ను ఉల్లంఘించడం పట్ల చైనా తీవ్రఅభ్యంతరం చెబుతున్నది. తైవాన్ స్వతంత్రంగా వ్యవహరించడం తమకు ముప్పుగా భావించిన చైనా తాజాగా తైవాన్ ఆక్రమణకు రంగం సిద్ధం చేసింది. చైనా ప్రధాన భూభాగం నుండి దక్షిణ సముద్ర తీరానికి 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న తైవాన్ దేశం ఒక వ్యూహాత్మక ప్రాముఖ్యత గలదేశం. పసిఫిక్ మహాసముద్రంలో తైవాన్‌ను చైనా ప్రధాన భూభాగం నుండి వేరు చేసే 'తైవాన్ స్ట్రయిట్' చైనా తైవాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు కారణం. ఈశాన్యంలో తూర్పు చైనా, నైరుతిలోదక్షిణ చైనా సముద్రాలను కలిపే తైవాన్ జలసంధి ప్రస్తుతం రణరంగంగా మారింది. బలమైన చైనాతో కలవకుండా, తైవాన్ ప్రజలు స్వతంత్ర జీవనం సాగించడానికే ఇష్టపడతారు. చైనా ప్రభుత్వ పోకడలను, చైనా సామ్రాజ్య వాదాన్ని తైవాన్ ప్రజలు అంగీకరించడం లేదు. చైనాలో కమ్యూనిస్టు పాలన వాస్తవంగా నియంతృత్వ పునాదులపై ఆధారపడి కొనసాగుతున్నది. స్వేచ్ఛపై అనేక పరిమితులుంటాయి. చైనా ప్రభుత్వ రహస్యాలు బాహ్య ప్రపంచానికి తెలియనీయకుండా పత్రికా వ్యవస్థపై ఉక్కుపాదం మోపడం జరుగుతున్నది. చైనా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించినా, ప్రపంచంలో అమెరికా తర్వాత బలమైన ఆర్థిక శక్తిగా అవతరించినా ప్రజాభిప్రాయానికి విలువ లేకపోవడం,స్వేచ్ఛను అణగద్రొక్కడం లాంటి చర్యలతో చైనా పట్ల పలు ప్రపంచ దేశాలకు సానుకూల దృక్పథంలేదు. మావో జెడాంగ్ నుండి జిన్‌పింగ్ వరకు చైనా నియంతృత్వ దేశంగానే పరిగణించబడుతున్నది. వ్యూహాత్మక, ఆర్థిక, రాజకీయ, భౌగోళిక, రక్షణ ప్రయోజనాల రీత్యా తైవాన్ చైనాకు ఎంతో ప్రాధాన్యత గల ద్వీపం. తైవాన్‌తో రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుని, ఆసియాలో సైనిక మనుగడ సాగించాలని కలలుకంటున్న అమెరికాను నిలువరించడానికి తైపీపై యుద్ధానికి బీజింగ్ సన్నద్ధమవుతున్నది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా,కెనడా లాంటి దేశాలు చైనాకు వ్యతిరేకంగా తైవాన్‌కు మద్దతు పలకడం చైనాకు ఆగ్రహం కలిగించింది. తైవాన్ ప్రజలు సుభిక్షంగా జీవిస్తున్న తరుణంలో చైనా సైనికచర్యకు పూనుకోవాలనుకోవడం తూర్పు ఆసియాలో అశాంతికి ఆజ్యంపోసినట్టే కాగలదు. 2.3కోట్ల జనాభా గల తైవాన్ పై141 కోట్లజనాభా కలిగి, బలమైన ఆర్థిక, ఆయుధ సామర్థ్యం గల చైనా యుద్ధానికి సిద్ధపడడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడమే నన్న అభిప్రాయం కూడాఏర్పడింది. తైవాన్‌ను ఒక దేశంగా కాకుండా ఒక ప్రావిన్స్‌గానే చైనా పరిగణిస్తున్నది. తైవాన్ జలసంధిలో పెరుగుతున్న ఉద్రిక్తతల దృష్ట్యా తైవాన్ రక్షణ సామర్థ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తైవాన్ చిన్న దేశమే అయినా పలురంగాల్లో బాగా అభివృద్ధిచెందిన దేశం. ఐక్యరాజ్య సమితి గుర్తించకపోయినా ఆర్థికబలం,ఆయుధ బలంతోపాటుగా పలుఅంశాల్లో తైవాన్ తనప్రత్యేకతను ప్రపంచానికి నిరూపించుకుంది.చైనా నిరంకుశత్వాన్ని నిరసిస్తూ, విస్తరణవాదంతో కాకుండా ప్రజాస్వామ్య వాదంతో పని చేయాలని చెబుతున్నా, తైవాన్‌పైచైనా కోపంతో రగిలిపోతున్నది. తైవాన్‌పై చైనా దాడికి తెగబడితే పలుదేశాలు అండగా నిలబడతాయని పూర్తిగా నిర్ధారణకురాలేము.తైవాన్ తనకుతాను స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నప్పటికీ,అక్కడప్రజాస్వామ్య పద్ధతిలో,చట్టబద్ధమైన స్వయంపాలనకొనసాగుతున్నప్పటికీ, ఇప్పటికీ తైవాన్‌ను ప్రపంచ దేశాలు పూర్తిస్థాయిలో గుర్తించ లేదు.కేవలం 12దేశాలు మాత్రమే తైవాన్‌ఉనికిని గుర్తించాయి.ఇప్పటికైనా తైవాన్‌ను చైనా ప్రత్యేకదేశంగా గుర్తించాలి. ఇలాంటి అభివృద్ధి చెందుతున్న, ఉత్తమ ప్రజాస్వామ్య దేశమైన తైవాన్ అస్థిత్వాన్ని కాపాడాలి. ●

# స్వామి దర్శనంలో సమానత్వం సాధ్యమేనా?

తరిగోపుల నారాయణస్వామి

ఆధ్యాత్మిక క్షేత్రాలు అనగా భక్తి, సమానత్వం, వినయం, త్యాగం వంటి విలువలకు ప్రతీకలుగా ఉండవలసినవి. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన తిరుమల తిరుపతి దేవస్థానం వంటి క్షేత్రాలు సామాన్య భక్తుని మనసులో దేవుని సన్నిధిని ప్రత్యక్షంగా అనుభూతి కలిగించాలి. కానీ నేటి పరిస్థితులు సామాన్య భక్తుడికి తీవ్రమైన పరీక్షగా మారుతున్నాయి. స్వామివారి దర్శనం కోసం ఇరవై నాలుగు గంటలు, నలభై ఎనిమిది గంటలు క్యూలైన్లలో వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది.వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే భక్తులకు ఇది శారీరకంగా మాత్రమే కాక మానసికంగా కూడా తీవ్రమైన వేదనగా మారుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా దర్శన విధానాలలో పెరుగుతున్న అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వీఐపీ దర్శనాల సంఖ్య నియంత్రణ లేకుండా పెరగడం వలన సామాన్య భక్తుడి అవకాశాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. హోదా కలిగిన వ్యక్తులు తరచుగా దర్శించుకోవడం ఒక సాధారణ వ్యవహారంగా మారిపోయింది. అంతేకాకుండా వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సిఫారసు లేఖలతో వచ్చే వారికి కూడా అదే ప్రత్యేక సౌకర్యాలు కల్పించబడటం మరింత ఆందోళనకరమైన విషయం. దీని వలన దర్శన వ్యవస్థ భక్తి ఆధారంగా కాకుండా పలుకుబడి, పరిచయాల ఆధారంగా నడుస్తున్నదన్న భావన ప్రజల్లో బలపడుతోంది. భగవంతుని దృష్టిలో అందరూ సమానులనే భావనహిందూ ధర్మానికి మూలసిద్ధాంతం. దేవుని ముందు రాజు, పేదవాడుఅనే తేడా లేదని మన శాస్త్రాలు స్పష్టంగా బోధించాయి. అటువంటి ధార్మిక నేపథ్యంతో చూసినప్పుడు ప్రత్యేక హోదాల ఆధారంగా దర్శనాల విభజన జరగడం ధర్మ సూత్రాలకు విరుద్ధంగా కనిపిస్తోంది. దేవాలయం సామాజిక హోదాల ప్రదర్శన వేదికగా మారకూడదు.ఇక్కడ ఒకఅత్యంత కీలకమైన అంశాన్ని గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఒకసారి స్వామివారి దర్శనం పొందిన భక్తులకు కొంత నిర్దిష్ట కాలం తర్వాత మాత్రమే మరల దర్శన అవకాశం ఇవ్వాలనే విధానం తప్పనిసరిగా అమలులోకి రావాలి. పదే పదే,వారానికోసారి లేదా నెలకు పలుమార్లు అదేవ్యక్తులు దర్శించుకోవడం వలన లక్షలాదిమంది భక్తులు ఒక్కసారి దర్శనం కోసం కూడా దీర్ఘకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.దర్శనం అనేది వ్యక్తిగత అలవాటు కాదు, అది సమూహానికి చెందిన పవిత్ర అవకాశం అనే భావనను తిరిగి బలపరచాలి. నేటి పరిస్థితుల్లో సామాన్య భక్తుడు దర్శనం పొందాలంటే తన భక్తిని కాకుండా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన స్థితి నెలకొంది. ఇది ఆధ్యాత్మిక అనుభూతిని తీవ్రంగా దెబ్బతీస్తోంది. సిఫారసు లేఖల సంస్కృతి భక్తి విలువలను మసకబారుస్తోంది.దేవుడి సన్నిధిలో సమానత్వం ఉండాల్సిన చోట అధికారుల దగ్గర చేరుకునే సామర్థ్యమే ముఖ్యమన్న భావన సమాజంలో వ్యాపిస్తోంది. హైందవ సంప్రదాయంలో దేవాలయం సమానత్వానికి, సామాజిక ఐక్యతకు ప్రతీక.అక్కడ కులం,వర్గం, హోదా వంటి భేదాలు ఉండకూడదు. కానీ నేటి ఆచరణలో ఇవన్నీ దర్శనాల వద్ద స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక చరిత్రను పరిశీలిస్తే మహానుభావులంతా తమను తాము దేవుని ముందు అతి చిన్నవారిగా భావించారు. అలాంటి వినయం నేటి దర్శన వ్యవస్థల్లో కనుమరుగవుతున్నది. దేవస్థాన పాలకులు, ప్రభుత్వాలు ఈ అంశాన్ని అత్యంత బాధ్యతతో పరిగణించాలి. దర్శనవిధానాలలో పారదర్శకత, సమానత్వం తీసుకురావడం అత్యవసరం. ఒకసారి దర్శనం పొందినవారికి కాలపరిమితి విధించడం, వీఐపీ దర్శనాలను నిజంగాఅత్యవసర సందర్భాలకు మాత్రమే పరిమితం చేయడం వంటి సంస్కరణలు అమలైతే సామాన్య భక్తుడికి న్యాయం జరుగుతుంది. భక్తుడు దేవాలయానికి వచ్చేది ప్రశాంతత కోసం కానీ గంటల తరబడి వేచిఉండడం, శారీరక ఇబ్బందులు పడడంవలన ఆ ప్రశాంతత కరిగిపోతోంది. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో భక్తి భావం క్రమంగా తగ్గిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. దేవాలయాలు భక్తి కేంద్రాలుగా కాకుండా అధికార కేంద్రాలుగా మారితే అది ఆధ్యాత్మికంగా సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. అందుకే ఇప్పుడు సమాజం మొత్తం ఆలోచించాల్సిన సమయం వచ్చింది. దేవుడు అందరికీ సమానుడైతే దర్శన అవకాశాలు కూడా సమానంగా ఉండాలని మౌలిక సూత్రాన్ని తిరిగి స్థాపించాల్సిన అవసరం ఉంది. సామాన్య భక్తుడి కన్నీరు, అలసట, నిరాశలను పాలకులు గుర్తించినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక సంస్కరణలు సాధ్యమవుతాయి. అప్పుడే దేవాలయాలు తిరిగి భక్తి, విశ్వాసాల కేంద్రాలుగా నిలుస్తాయి. ఇది కేవలం ఒక దేవస్థానానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, ఇది మన ఆధ్యాత్మిక విలువల భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. దీనిపై సమాజం చైతన్యంతో స్పందించాల్సిన అవసరం ఉంది. ●

# స్వర్ణ ధరల నీడలో ఆయుర్వేదం

తిప్పర్తి శ్రీనివాస్

దేశీయ సంప్రదాయ వైద్య విధానాలలో ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానంఉంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్యశాస్త్రం కేవలం చికిత్సకే పరిమితం కాకుండా జీవన విధానంగా, ఆరోగ్య సంరక్షణ పద్ధతిగా భారతీయ సమాజంలో లోతుగా నాటుకుపోయింది.'సర్వే సంతు నిరామయాః' అన్న భావనను ఆచరణలో పెట్టిన ఆయుర్వేదం, ఒకప్పుడు గ్రామీణ ప్రజలకు అత్యంత చేరువైన వైద్యవిధానం. అయితే నేటి పరిస్థితుల్లో బంగారం, వెండి వంటి లోహాల ధరలు విపరీతంగా పెరగడంతో ఆయుర్వేద ఔషధాల ఖర్చు కూడా ఆకాశాన్ని తాకుతోంది. ఈ పరిణామం ఆయుర్వేదాన్ని పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారుస్తుందా?అన్న ప్రశ్న తీవ్రంగా ఆలోచింపజేస్తోంది. ఆయుర్వేదంలో బంగారం, వెండి వంటి లోహాలకు ప్రత్యేకమైన ఔషధ ప్రాముఖ్యత ఉంది. స్వర్ణ భస్మ, రాజత భస్మ వంటి తయారులు రోగ నిరోధక శక్తిని పెంచడంలో,దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలో కీలకపాత్ర పోషిస్తాయని ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటాయి. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం కోసం ఇచ్చే స్వర్ణ ప్రాశనంలో బంగారం కీలక అంశం. అలాగే నరాల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఆరోగ్యసమస్యల చికిత్సలో ఈ భస్మలకు ప్రాధాన్యం ఉంది. కానీ అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో బంగారం, వెండి ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ ఔషధాల తయారీ ఖర్చు భారీగాపెరిగింది. దీని ప్రత్యక్ష ప్రభావం ఆయుర్వేద వైద్యం ఖర్చులపై పడుతోంది. ఒకప్పుడు తక్కువ ఖర్చుతో లభించిన ఆయుర్వేద మందులు, నేడు మధ్యతరగతి ప్రజలకు కూడా భారంగా మారుతున్నాయి. పేద ప్రజల సంగతి చెప్పనవసరం లేదు. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల్లో కొంతవరకు ఉచిత చికిత్స అందుతున్నప్పటికీ, అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రైవేటు ఆయుర్వేద ఆసుపత్రులు, ఫార్మసీలలో ధరలు మరింత ఎక్కువగా ఉండటంతో పేదలు ఆయుర్వేద వైద్యానికి దూరమవుతున్నారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు,ఇది సామాజిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్య. ఆధునిక వైద్య విధానాలతో పోలిస్తే ఆయుర్వేదం దుష్ప్రభావాలు తక్కువగా ఉండే, సహజ చికిత్స పద్ధతి. అలాంటి వైద్య విధానం పేదలకు అందకుండాపోవడం అంటే, ఆరోగ్య అసమానతలు మరింత



పెరగడమే.ఒకవైపు సంపన్నులు ఖరీదైన ఆయుర్వేద చికిత్సలు పొందుతుంటే, మరోవైపు పేదలు తక్కువ నాణ్యత గల ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈసమస్యకు ప్రభుత్వవిధానాల పాత్రకూడా కీలకం. ఆయుష్ మంత్రిత్వశాఖ ద్వారా ఆయుర్వేదాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, భూమి స్థాయిలో పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. బంగారం,వెండి వంటి లోహాల ధరల పెరుగుదల వల్ల ఏర్పడిన ఖర్చును భరించేందుకు ఆయుర్వేద ఔషధ తయారీదారులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వడం, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల్లో స్వర్ణ,రాజత భస్మ ఆధారిత మందులను ఉచితంగా లేదా తక్కువ ధరకు అందించడం వంటి చర్యలు అవసరం. అదే సమయంలో ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులు కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే,తక్కువ ఖర్చుతో సమాన ఫలితాలు ఇచ్చే ప్రత్యామ్నాయ ఔషధ సూత్రాలను అభివృద్ధి చేయడం కాలానుగుణ అవసరం. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, లోహాల వినియోగాన్ని తగ్గిస్తూ లేదా సమర్థవంతంగా వినియోగించే విధానాలపై పరిశోధన జరగాలి. అలా చేసినప్పుడే ఆయుర్వేదం'ఎలైట్ మెడిసిన్'గా కాకుండా 'పబ్లిక్ మెడిసిన్'గా నిలుస్తుంది. మరోవైపు ప్రజల్లోనూ అవగాహన పెరగాలి. ఆయుర్వేదం అంటే తప్పనిసరిగా ఖరీదైన స్వర్ణ భస్మలే కావాలన్న భావనతప్పు. ఆహార నియమాలు, జీవన శైలి మార్పులు, స్థానికంగా లభించే ఔషధ మొక్కల వినియోగం వంటి అంశాలు కూడా ఆయుర్వేదంలో అంతే ముఖ్యమైనవి. వీటిని ప్రోత్సహించడం ద్వారా చికిత్స ఖర్చును తగ్గించవచ్చు. మొత్తానికి బంగారం, వెండి ధరల పెరుగుదల ఆయుర్వేద వైద్యాన్ని పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారుస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే ఇది అనివార్యమైన పరిస్థితి కాదు. సరైన ప్రభుత్వ విధానాలు, శాస్త్రీయ పరిశోధనలు, సామాజిక బాధ్యత కలిగిన వైద్య దృక్పథం కలిసివస్తే, ఆయుర్వేదాన్ని మళ్లీ ప్రజల వైద్యంగా నిలబెట్టవచ్చు. లేనిపక్షంలో, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ పురాతన వైద్య శాస్త్రం, కొద్ది మందికే పరిమితమైపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ఇప్పుడే చైతన్యం అవసరం లేదంటే ఆయుర్వేదం పేరు మాత్రమే మిగిలి, ప్రజల ఆరోగ్యానికి దూరమయ్యే పరిస్థితి తలెత్తుతుంది. ●

# కర్ణాటకలోనూ గవర్నర్ సీన్ రిపీట్

## రెండు వాక్యాలు చదివి అసెంబ్లీ నుంచి వాకౌట్

## బడ్జెట్ సమావేశాలకు ముందు కీలక పరిణామం



**బెంగళూరు, జనవరి 22:** కర్ణాటక అసెంబ్లీలో ఇవాళ గందరగోళం నెలకొన్నది. గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ కేవలం రెండు లైన్ల ప్రసంగాన్ని మాత్రమే చదివి వినిపించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై విమర్శలు చేసింది. కేవలం ప్రారంభ పంక్తులు మాత్రమే చదవి గెహ్లాట్ తన ప్రసంగాన్ని ముగించేశారు. ఆర్థికంగా, సామాజిక అభివృద్ధి పరిచేందుకు తన రాష్ట్రం కట్టుబడి ఉందని, జై హింద్ జై కర్ణాటక అని ఆయన హిందీలో ప్రసంగాన్ని చదివి వినిపించారు. గవర్నర్ థావర్‌చాంద్ తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ముగించడంతో కాంగ్రెస్ సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు. షేమ్ షేమ్ అని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని గవర్నర్ గెహ్లాట్ ఉల్లంఘించారని సిఎం సిద్ధరామయ్య అన్నారు. ప్రభుత్వం రాసిచ్చిన పూర్తి ప్రసంగాన్ని ఆయన చదవలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి కీలుబొమ్మగా గవర్నర్ గెహ్లాట్ మారినట్లు పేర్కొన్నారు. గవర్నర్ ప్రవర్తన పట్ల సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ఉన్నట్లు సిఎం సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక సర్కారు రూపొందించిన ప్రసంగంలోని 11 పేరాలపై గవర్నర్ థావర్‌చాంద్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా బిజెపి ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్‌కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది.

దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ సింపుల్‌గా రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సిఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్‌పై మండిపడ్డారు. అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బిజెపి ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సిఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్ నిర్దోషి

## ఢిల్లీ కోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ, జనవరి 22:** సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన మరో రెండు కేసులలో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు ఊరట లభించింది. ఆయనను నిర్దోషిగా ఢిల్లీ కోర్టు గురువారం ప్రకటించింది. ప్రత్యేక న్యాయమూర్తి దిగ్ వినయ్ సింగ్ ఈ తీర్పును వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత సిక్కు వ్యతిరేక అల్లర్లు జరి గాయి. 1984 నవంబర్ 1న ఢిల్లీలోని జనక్‌పురిలో జరిగిన హింసలో సోహన్ సింగ్, ఆయన అల్లుడు అవతార్ సింగ్ హత్యకు గురయ్యారు. నవంబర్ 2న వికాస్‌పురిలో గురుచరణ్ సింగ్‌ను నిప్పంటించి చంపారు. నాడు ఢిల్లీలో కీలక కాంగ్రెస్ నేత, ఎంపీ అయిన సజ్జన్ కుమార్ సిక్కు వ్యతిరేక అల్లర్లకు కారణమని ఆరోపణలు వచ్చాయి. 2015 ఫిబ్రవరిలో ఈ రెండు కేసుల దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశారు. 2023 ఆగస్టులో అల్లర్లకు పాల్పడటం, శత్రుత్వాన్ని ప్రోత్సహించడం వంటి అభియోగా లను కోర్టు సమర్థించింది. అయితే హత్య, నేరపూరిత కుట్ర నేరాల నుంచి ఆయనకు విముక్తి కల్పించింది. తాజాగా ఈ రెండు కేసుల్లో సజ్జన్ కుమార్ నిర్దోషిగా ఢిల్లీ కోర్టు పేర్కొంది. మరోవైపు ఢిల్లీలోని సరస్వతి విహార్ ప్రాంతంలో 1984 నవంబర్ 1న జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్ హత్యలకు సంబంధించిన కేసులో గత ఏడాది ఫిబ్రవరి 25న ట్రయల్ కోర్టు సజ్జన్ కుమార్‌కు జీవిత ఖైదు విధించింది. అలాగే ఢిల్లీలోని పాలం కాలనీ ప్రాంతంలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో ఐదుగురి మరణానికి కారణమైనందుకు సజ్జన్ కుమార్‌ను దోషిగా ఢిల్లీ హైకోర్టు నిర్ధారించింది. 2018 డిసెంబర్ 17న జీవిత ఖైదు విధించింది. దీంతో ప్రస్తుతం ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నారు. హైకోర్టు తీర్పుపై ఆయన దాఖలు చేసిన అప్పీల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది.

# భోజ్‌శాలలో హిందూ, ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చు



**దార్(ఎంపి),జనవరి 22:** సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లాలో ఉన్న భోజ్‌శాలకమల్ మోలా మసీదులో హిందువులు, ముస్లింలు కలిసి పూజలు, ప్రార్థనలు చేసుకోవచ్చు అని పేర్కొన్నది. శుక్రవారం వసంత పంచమి రానున్నందున కోరు తీర్పును వెలువరించింది. వసంత పంచమి రోజున సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు హిందువులు పూజలు చేసుకోవచ్చు అని, అలాగే ఆ రోజు మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చు అని సుప్రీం పేర్కొంది. నమాజ్‌కు వచ్చే ముస్లింలు జిల్లా యాజమాన్యం వద్ద తమ పేర్లను నమోదు చేయాల్సి ఉంటుందని కోర్టు ఆదేశించింది. వసంత పంచమి సందర్భంగా శుక్రవారం భోజ్‌శాలలో సరస్వతీదేవి పూజ నిర్వహించనున్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పాంచోలితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. రెండు వర్గాల ప్రజలు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, రాష్ట్ర, జిల్లా ప్రభుత్వ యాజమాన్యానికి సహకరించాలని కోర్టు పేర్కొన్నది. వసంత పంచమి సందర్భంగా దార్‌లో సుమారు 8వేలమంది పోలీసుల్ని మోహరించారు. అవాంఛిత సంఘటనలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. విష్ణు శంకర్ జైన్ అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. 2003లోనే ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ముస్లింల ప్రార్థనల విషయంలో ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం రోజు మధ్యాహ్నం 1 నుంచి 3 మధ్య ప్రార్థనలు చేసుకోవడానికి వీలు కల్పించింది. వసంత పంచమి రోజున హిందువులు పూజలు చేసుకోవచ్చు అని, మంగళవారం కూడా పూర్తి స్థాయిలో పూజలు చేసుకునేందుకు ఏఎస్ఐ అనుమతి ఇచ్చింది.

# లోయలో పడ్డ ఆర్మీ వాహనం

## 10 మంది సైనికులు మృతి, మరో ఆరుగురికి గాయాలు

**శ్రీనగర్, జనవరి 22:** జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. భద్రతా సిబ్బందితో వెళుతున్న ఓ వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా మరి కొందరు గాయపడ్డారు. భదేర్వాహ్ - చంబా రోడ్డులోని ఖన్నీ పర్వత ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. లోయలో పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే రంగంలోకి దిగిన ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. గాయపడిన వారిని ఉధంపుర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.



# గాజా శాంతి మండలి

## దావోస్ వేదికగా ట్రంప్ ప్రకటన

## సభ్య దేశంగా పాకిస్థాన్!

**వాషింగ్టన్, జనవరి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి మండలిని ప్రారంభించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దీనిని అధికారికంగా ప్రకటించారు. 'ప్రతి ఒక్కరు ఈ మండలిలో భాగం కావాలని కోరుతున్నాను. ఐరాసతో సహా అందరితో కలిసి పనిచేస్తాను' అని ఆయన వ్యాఖ్యానించారు. మండలి సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఉండటం గమనార్హం. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను పర్యవేక్షించడం కోసం కొన్ని రోజుల క్రితం అధ్యక్షుడు దీని ఏర్పాటు గురించి ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్. ఆ హోదాలో ఆయన కొంతమంది సభ్యులను మాత్రమే నియమిస్తారని తొలుత అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఆయన 50 మందికిపైగా దేశాధినేతలకు ఆహ్వానాలు పంపారు. ఇందులో భారత ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు ఉన్నారు. ఐరాస స్థానంలో ట్రంప్ ఈ గాజా శాంతి మండలిని తీసుకువస్తున్నారనే చర్చ నడుస్తోంది. 'ఐరాస ఎంతో చేయాల్సి ఉందన్నది నా భావన. అలా చేసుంటే ఈ శాంతి మండలి అవసరమే ఉండేది కాదు' అని ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇది గాజాకు పరిమితమైన మండలి కాదన్న విషయం స్పష్టమువుతోంది. ఇందులో శాశ్వత సభ్యత్వం పొందాలనుకునే దేశం ఒక బిలియన్ డాలర్లు (రూ. 9 వేల కోట్లకు పైగానే) చెల్లించాల్సి ఉంటుంది.

గాజా శాంతిమండలికి సంబంధించి ట్రంప్ ఆధ్వర్యంలో పలువురు నేతలు సంతకాలు చేశారు. వారిలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు వార్నింగ్ ఇచ్చారు. 'వారు ఆయుధాలు విడనాడేందుకు అంగీకరించకపోతే.. వారి అస్తిత్వానికే నష్టం' అని హెచ్చరించారు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ట్రంప్ కుదిర్చిన 20 సూత్రాల కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో బోర్డ్ ఆఫ్ పీస్ ఏర్పాటుపై ట్రంప ముఖ్య ప్రకటన చేశారు. ప్రపంచ దేశాధినేతలతో కలిసి ఆయన మీటింగ్ ఏర్పాటు చేశారు. బోర్డ్ ఆఫ్ పీస్ ఏర్పాటుపై గత ఏడాది ఆలోచనపుట్టింది. వాస్తవానికి గత సెప్టెంబర్‌లో గాజా యుద్ధం కోసం 20 సూత్రాల శాంతి ఒప్పందాన్ని ఆయన క్రియేట్ చేశారు. ఆ ప్లాన్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. ఆ ప్రణాళికకు యూఎన్ అంతర్జాతీయ గుర్తింపు ఇచ్చింది. గాజా నుంచి మిలిటరీని వెనక్కి పంపేందుకు, ఆ పట్టణాన్ని మళ్లీ పునర్ నిర్మించేందుకు బోర్డ్ ఆఫ్ పీస్ అవసరమని పేర్కొన్నారు. ఈనేపథ్యంలోనే బోర్డ్ ఆఫ్ పీస్‌ను ఏర్పాటు చేశారు. బోర్డ్ ఆఫ్ పీస్‌ను అంతర్జాతీయ సంస్థగా గుర్తిస్తున్నారు. సంక్షోభ ప్రదేశాల్లో స్థిరత్వం, శాంతి, సుపరిపాలన లక్ష్యంగా ఆ బోర్డును ఏర్పాటు చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. ఆ బోర్డుకు నిరవధిక ఛైర్మెన్‌గా ట్రంప్ వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. ఆ బోర్డు క్రియేట్ చేసుకున్న తీర్మానం ప్రకారం ఆయన సుదీర్ఘంగా ఆ పదవిలో కొనసాగే అవకాశాలు ఉన్నాయి. బోర్డ్ ఆఫ్ పీస్‌లో అల్లుడు జేర్డ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఉంటారు. బోర్డ్ ఆఫ్ పీస్ ప్రతిపాదనకు యుఎఇ, సౌదీ అరేబియా, ఈజిప్ట్, ఖతార్, బహరెయిన్, పాకిస్థాన్, టర్కీ, హంగేరీ, మొరాక్కో, కొసావో, అర్జెంటీనా, పరాగ్వే దేశాలు ఆమోదం తెలిపాయి. కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం దేశాలు కూడా ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.

ఆ బోర్డులో ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యూ ఉన్నారు. అర్మేనియా, అజర్‌బైజాన్ కూడా అమెరికా ప్రతిపాదిత శాంతి ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. బెలారస్ నేత అలెగ్జాండర్ లుకషెంకో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పటికే సంతకం చేశారు. బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరేందుకు పుతిన్ అప్పుడే బిలియన్ డాలర్ల ఫీజు చెల్లించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. కొన్ని షరతులతో ఆ బృందంలో కలిసేందుకు కెనడా ప్రధాని మార్క్ కార్నే అంగీకరించారు. బోర్డ్ ఆఫ్ పీస్‌లో చేరేందుకు ఫ్రాన్స్, నార్వే దేశాలు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. చైనాకు ఆహ్వానం వెళ్లినా ఆ దేశం ఇంకా ఏమీ వెల్లడించలేదు. రష్యా మాకు శత్రువుకాబట్టి, ఆ బోర్డులో ఉండేది డౌటే అని జెలెన్‌స్కీ అన్నారు. బోర్డు మీటింగ్‌కు హాజరుకావడం లేదని ఇటలీ ప్రధాని మెలోనీ తెలిపారు. ట్రంప్ ఏర్పాటు చేసిన బోర్డ్ ఆఫ్ పీస్‌పై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త బోర్డు వల్ల యూఎన్‌కు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నట్లు కొందరు విమర్శిస్తున్నారు. సభ్యత దేశాలు పర్మనెంట్ సీటు కోసం బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

వసూల్ చేసిన నిధుల్ని గాజా పునర్ నిర్మాణానికి వినియోగించనున్నారు. బోర్డ్ ఆఫ్ పీస్ వల్ల ఐక్యరాజ్యసమితికి ఎటువంటి ప్రమాదం వాటిల్లదని ట్రంప్ అన్నారు. కానీ కొందరు నేతలు మాత్రం ఆ టెన్షన్‌లోనే ఉన్నారు. ఐక్యరాజ్య సమితికి ప్రత్యామ్నాయంగా బోర్డ్ ఆఫ్ పీస్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బోర్డ్ ఆఫ్ పీస్ సంతకాల సెర్మనీ దావోస్‌లో జరిగింది. అర్జెంటీనా ప్రెసిడెంట్ జావియర్ మిలే, హంగేరి ప్రధాని విక్టర్ ఓర్బన్ పేపర్లపై సంతకాలు చేశారు. ఐక్యరాజ్యసమితి విధివిధానాలనే ట్రంప్ ప్రతిపాదిత బోర్డ్ ఆఫ్ పీస్ నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు ముసాయిదా ద్వారా తెలుస్తోంది.

**బోర్డ్ ఆఫ్ పీస్‌లోకి ఏడు ముస్లిం దేశాలు!**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు పాకిస్తాన్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో ట్రంప్ వైపు నిలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అక్కడితో దీనికి బ్రేకులు పడలేదు. మరో ఏడు దేశాలు ట్రంప్ కు జిందాబాద్ కొట్టాయి. గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, పునర్నిర్మాణం, ప్రాంతీయ శాంతిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయతలపెట్టిన 'బోర్డ్ ఆఫ్ పీస్'లో చేరడానికి చేరాయి ఆయా దేశాలన్నీ కూడా. అందులో చేరికకు ఎనిమిది ఇస్లామిక్ దేశాలు మనస్ఫూర్తిగా అంగీకరించాయి.

సంపూర్ణ మద్దతు తెలిపాయి. గాజాలో శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తోన్న ప్రయత్నాలను స్వాగతించడంతో పాటు అందులో తాము కూడా భాగస్వాములు కానున్నట్లు పేర్కొన్నాయి. పాకిస్తాన్, సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశాంగ మంత్రులు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

# యూరోప్ సుంకాలపై వెనక్కి తగ్గిన ట్రంప్!

**దావోస్, జనవరి 22:** గ్రీన్‌ల్యాండ్‌ను తమదేశంలో విలీనంచేసుకునే విషయంలో తీవ్రంగా ప్రయత్నించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా వెనక్కితగ్గారు. గ్రీన్‌ల్యాండ్‌ను తమకు అప్పగించాలంటూ యూరప్ మిత్రదేశాలను బెదిరించిన ఆయన, ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆర్కిటిక్ భద్రతకు సంబంధించి నాటోతో ఒక భవిష్యత్ ఒప్పందానికి మార్గం సుగమమైందని, ఈ నేపథ్యంలో యూరప్ దేశాలపై విధించాలనుకున్న టారిఫ్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో నాటో కూటమిలో తలెత్తిన తీవ్ర సంక్షోభానికి తాత్కాలికంగా తెరపడినట్లయింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ గ్రీన్‌ల్యాండ్ 'హక్కు, టైటిల్, యాజమాన్యం' తమకు కావాలని, అయితే దాని కోసం సైనిక బలగాలను ఉపయోగించబోమని స్పష్టం చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా వల్లే యూరప్ నిలబడిందని, దశాబ్దాలుగా తాము చేసిన సాయంతో పోలిస్తే గ్రీన్‌ల్యాండ్‌ను అడగటం చాలా చిన్న విషయమని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ మాటలు నాటో కూటమి పునాదులను కదిలించేలా ఉండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఆర్కిటిక్ మహాసముద్రంలో రష్యా, చైనాల నుంచి ఎదురవుతున్న ముప్పును ఎదుర్కోవాలంటే ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపమైన గ్రీన్‌ల్యాండ్ తమ నియంత్రణలో ఉండటం అత్యవసరమని ట్రంప్ చాలాకాలంగా వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రీన్‌ల్యాండ్‌ను అప్పగించని పక్షంలో డెన్మార్క్‌తో పాటు మరో ఏడు మిత్రదేశాలపై వచ్చే నెల నుంచి 10 శాతం, జూన్ నాటికి 25 శాతం దిగుమతి సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అయితే, డెన్మార్క్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో మొదటి నుంచి గట్టిగా నిలబడింది. అమెరికా భద్రతాపరమైన ఆందోళనలపై చర్చకు సిద్ధమే కానీ, గ్రీన్‌ల్యాండ్ సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ట్రంప్ బెదిరింపులతో గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తాజా పరిణామాలతో ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నప్పటికీ, ఆర్కిటిక్ ప్రాంతంపై పట్టుసాధించాలన్న వ్యూహం మారలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

# చంద్రునిపై హోటల్ నిర్మించేందుకు యుఎస్ స్టార్టప్ రెడీ!



**కాలిఫోర్నియా,జనవరి 22:** చంద్రునిపై ప్రపంచ దేశాలు అనేక ప్రయోగాలు చేస్తున్న తరుణంలో ఓ కంపెనీ చంద్రునిపై హోటల్ నిర్మించేందుకు రెడీ అయ్యింది. ఏకంగా హోటల్‌లో బస చేసేందుకు బుకింగ్స్‌ను కూడా ప్రారంభించింది. చంద్రునిపైకి వెళ్లగలమా అనే అనుమానాలకు ఫుల్ స్టాప్ పడనున్నట్లే అనిపిస్తుంది. ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో మాత్రమే సాధ్యమని భావించినది ఇప్పుడు వాస్తవంగా మారడానికి దగ్గరగా ఉంది. ఒక అమెరికా స్టార్టప్ చంద్రునిపై హోటల్ బసల కోసం బుకింగ్‌లు తీసుకోవడం ప్రారంభించింది. చంద్రునిపై నివసించాలనే కల నెరవేరబోతున్నట్లు ఈ కంపెనీ తీరు చెపుతోంది. కానీ హోటల్ బుక్ చేసుకుంటే లక్షలాది రూపాయలు ఖర్చవుతుంది. కాలిఫోర్నియాకు చెందిన గెలాక్టిక్ రిసోర్స్ యుటిలైజేషన్ స్పేస్ అనే స్టార్టప్ 2032 నాటికి చంద్రుని ఉపరితలంపై మానవ స్థావరాన్ని నిర్మించాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. గత సంవత్సరం స్థాపించబడిన ఈ సిలికాన్ వ్యాలీ స్టార్టప్, ల్యూనార్ ఎకానమి ప్రారంభించడానికి చంద్ర పర్యాటకం మొదటి, అత్యంత ప్రభావవంతమైన మార్గం అని నమ్ముతున్నది. ఈ చంద్ర యాత్రకు చాలా డబ్బు అవసరం. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం, హోటల్ రిజర్వేషన్లు రూ.2.2 కోట్ల నుండి రూ.9 కోట్ల వరకు ఉండనున్నట్లు సమాచారం. ఇది కేవలం రిజర్వేషన్ మొత్తం మాత్రమే. మీరు నిజంగా చంద్రునిపైకి ప్రయాణించినప్పుడు, మొత్తం ప్రయాణానికి అయ్యే మొత్తం ఖర్చు రూ.90 కోట్లు దాటవచ్చని కంపెనీ అంచనా వేసింది. అదనంగా తిరిగి చెల్లించని దరఖాస్తు రుసుము 1,000డాలర్లు అవసరం. మీరు కొద్దిపాటి రుసుము చెల్లించడం ద్వారా చంద్రునిపైకి వెళ్లవచ్చని అనుకుంటే పొరపాటే. కంపెనీ ప్రయాణికులపై కఠినమైన బ్యా గ్రౌండ్ చెకప్స్‌ను నిర్వహిస్తుంది. ఈ సవాలుతో కూడిన ప్రయాణానికి మీరు శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉన్నారని నిర్ధారించుకోవడానికి మిమ్మల్ని వైద్య నివేదికలు, ఆర్థిక పత్రాలు అడగవచ్చు. చంద్రునిపై హోటల్ ఎలా నిర్మిస్తారు ఇటుకలను చంద్రుడికి రవాణా చేయడం అసాధ్యం, కాబట్టి జిఆర్‌యు స్పేస్ ఒక ప్రత్యేకమైన సాంకేతికతపై పనిచేస్తోంది. వారు చంద్రుని ధూళిని ఇటుకలుగా మార్చాలని యోచిస్తున్నారు. కంపెనీ మొదటి పేలోడ్ 2029 లో చంద్రునిపై దిగుతుంది. చంద్రుని దుమ్ముతో తయారు చేసిన ఈ ఇటుకలను హోటల్‌ను రేడియేషన్, అక్కడి ప్రమాదకరమైన ఉష్ణోగ్రతల నుండి రక్షించడానికి ఉపయోగిస్తారు. ఇప్పటివరకు, 12 మంది మానవులు మాత్రమే చంద్రుని ఉపరితలంపై నడిచారు. ఈ ప్రాజెక్ట్ సాధారణ ప్రజలకు ఆ ఉన్నత సమూహంలో చేరడానికి అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వెనిజులా దాడిలో రహస్య ఆయుధం వాడాం: ట్రంప్

**దావోస్, జనవరి 22:** వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు చేపట్టిన ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్‌లో రహస్య ఆయుధాన్ని వాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. అమెరికా బలగాలు కారకాస్‌లోని మదురో నివాసంపై దిగి ఆయనను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను బంధించి అమెరికాకు తరలించారు. ఈ సందర్భంగా మదురో భవనంలో భద్రతా విధులు నిర్వర్తిస్తున్న గార్డులకు భయానక పరిస్థితి ఎదురైందని, అమెరికా సైనికులపై తలపడే శక్తిలేక నిర్వీర్యమయ్యారని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. అమెరికా రహస్య ఆయుధం ప్రయోగించడంతో మాలో చాలామంది నిర్వీర్యమయ్యారు. కొంతమందికి ముక్కు నుంచి రక్తం కారింది. మరికొందరు వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయారు అంటూ ఓ గార్డు చెప్పిన మాటలు మీడియాలో వైరల్‌గా మారాయి. తాజాగా ఈ విషయంపై డొనాల్డ్ ట్రంప్ వాస్తవాలను వెల్లడించారు.వెనెజువెలా అధ్యక్షుడి నివాసంపై జరిపిన దాడిలో రహస్య ఆయుధం వాడిన విషయం నిజమేనని చెప్పారు. అయితే, అదేమిటనే విషయం మాత్రం ట్రంప్ వెల్లడించలేదు. అదొక్కటే కాదు.. అలాంటి రహస్య ఆయుధాలు తమ వద్ద చాలా ఉన్నాయని, వాటి గురించి ప్రపంచానికి తెలియకపోవడమే మంచిదని ఆయన అన్నారు.

## సంక్షిప్తంగా..

### మణిపూర్‌లో మెయిటీ యువకుడి కాల్చివేత

**ఇంఫాల్, జనవరి 22:** మణిపూర్‌లో మరో ఘోరం చోటుచేసుకుంది. మెయిటీలు, కుకీ తెగల మధ్య దాడులు ఆగడంలేదు. కుకీ తెగకు చెందిన తన భార్యను కలుసుకోవడానికి వెళ్లిన మెయిటీ యువకుడిని దుండగులు కాల్చి చంపారు. ఈ నెల 21న యువకుడిని కిడ్నాప్ చేసి అనంతరం హత్య చేశారు. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మృతుడు నేపాల్‌లో పనిచేస్తున్నాడని, ఇటీవల రాష్ట్రంలో జరిగిన అల్లర్లతో అతడికి సంబంధం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మెయిటీ సామాజిక వర్గానికి చెందిన మయాంగ్లబామ్ రిషికాంత సింగ్ అనే యువకుడు కుకీ సామాజిక వర్గానికి చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. మణిపూర్‌లో ఇటీవలి అల్లర్లకు ముందు వీరి వివాహం జరిగింది. కాక్చింగ్ ఖునో గ్రామానికి చెందిన రిషికాంత కొంతకాలంగా నేపాల్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవుపై గ్రామానికి వచ్చిన రిషికాంత పుట్టింట్లో ఉన్న భార్యను కలుసుకోవడానికి చుర్‌చంద్ పూర్ జిల్లాలోని గ్రామానికి వెళ్లాడు.


### విమానాశ్రయంలో మహిళ పట్ల అసభ్యప్రవర్తన

**బెంగళూరు, జనవరి 22:** బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సెక్యూరిటీ చెక్ పేరుతో ఓ కొరియా మహిళపై లైంగిక దాడికి పాల్పడిన గ్రౌండ్ స్టాఫ్ సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల భద్రతకే ముప్పు కలిగించిన ఈ ఘటన కలకలంరేపింది. ఈ నెల 19న ఓ కొరియా మహిళ తన స్వదేశానికి వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చారు. ఇమ్మిగ్రేషన్ తనిఖీలు పూర్తి చేసుకుని టెర్మినల్ వైపు వెళ్తుండగా, ఎయిర్ ఇండియా శాట్స్ గ్రౌండ్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న మహమ్మద్ అఫాన్ అనే ఉద్యోగి ఆమెను అడ్డగించాడు. ఆమె ఫ్లైట్ టికెట్ పరిశీలించి, చెక్‌ఇన్ లగేజీ నుంచి బీప్ సౌండ్ వస్తోందని, సమస్య ఉందని చెప్పాడు. తిరిగి స్క్రీనింగ్ కౌంటర్‌కు వెళితే విమానం మిస్సయ్యే ప్రమాదం ఉందని, తాను ప్రత్యేకంగా తనిఖీ చేస్తానని నమ్మించాడు. అనంతరం ఆమెను పురుషుల వాష్‌రూమ్‌సమీపంలోకితీసుకెళ్లి, అభ్యంతరాలు పెడుతున్నావినకుండా అసభ్యంగాతాకాడు. ఆమె ప్రతిఘటించడంతో ఆమెను కౌగిలించుకుని, థ్యాంక్యూఅని చెప్పి వెళ్లిపోయాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన ఆ మహిళ వెంటనే విమానాశ్రయ భద్రతా సిబ్బందికి ఫిర్యాదు చేసింది. వారు వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

### పెంపుడు కుక్క కోసం స్టేడియం ఖాళీచేయించిన ఐఎఎస్

**న్యూఢిల్లీ, జనవరి 22:** పెంపుడు కుక్క నడక కోసం ఒక ఐఎఎస్ అధికారి ఏకంగా స్టేడియాన్ని ఖాళీ చేయించడంపై విమర్శలు రావడంతో ఆయనను బదిలీ చేశారు. తాజాగా ఆ ఐఎఎస్ అధికారికి ఢిల్లీలో మళ్లీ కీలక పోస్ట్ దక్కింది. ఎంసిడి అని పిలిచే ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఎఎస్ అధికారి సంజీవ్ ఖిర్వార్ నియమితులయ్యారు. ఆయన భార్య రింకు కూడా ఐఎఎస్ అధికారిణి. 2022 మే 26న భార్య, పెంపుడు కుక్కతో కలిసి వాక్ చేసేందుకు ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియాన్ని ఖాళీ చేయించారు. రాత్రి 8 గంటలకు పైగా శిక్షణ పొందే యువ క్రీడాకారులను రాత్రి 7 గంటలలోపు స్టేడియం నుంచి పంపించి వేశారు. దీనితో ఐఎఎస్ అధికారి తన పెంపుడు కుక్క వాకింగ్ కోసం కొన్ని రోజులుగా స్టేడియాన్ని ముందుగా ఖాళీ చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

### ముంబయి మేయర్‌గా మహిళ.. ఎంపిక వివాదాస్పదం



**ముంబయి, జనవరి 22:** ముంబయికి ఓ మహిళ మేయర్‌గా రానున్నారు. అయితే ఈ ఎంపిక ప్రక్రియ మాత్రం వివాదాస్పదమైంది. ఈ పోస్టును ఏ కేటగిరికి కేటాయించాలనే దానిపై లాటరీ తీశారు. ఫలితాల్లో జనరల్ మహిళ కేటగిరీ ఎంపికైంది. ఈ లాటరీ ప్రక్రియ, ఫలితంపై ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివ సేన అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది గందరగోళ పరిస్థితులకు దారి తీసింది. మేయర్ పదవిని ఏకేటగిరీకి కేటాయించాలనే దానిని నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లాటరీ సిస్టమ్‌ను అనుసరిస్తుంది. ఈ లాటరీ ప్రక్రియ తర్వాత పుణె, ధూలే, బిఎంసి, నాందేడ్, నవీ ముంబయి, మాలేగావ్, మీరాభయందర్, నాసిక్, నాగ్‌పుర్ మేయర్ పోస్టులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. అయితే ముంబయి మేయర్ పదవిపై మాత్రం ఉద్ధవ్ శివసేన అభ్యంతరం వ్యక్తంచేసింది. బిఎంసిని ఒబిసి కేటగిరీ కింద ఎందుకు పరిగణించలేదని మాజీ మేయర్ కిశోరి ఫడ్నేకర్ ప్రశ్నించారు. గతంలో రెండు దఫాలుకూడా ఈ పోస్టు ఓపెన్ కేటగిరీలోనే ఉందని గుర్తు చేశారు.



# ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### హెల్త్ ఎడ్యుకేటర్స్, మీడియా ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణలో వైద్య, ఆరోగ్య మంత్రి రాజనర్సింహా

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యసేవలను, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర డైరీ, క్యాలం డర్‌లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్స్ అందిస్తున్న సేవలను మంత్రి అభినందించారు. వైద్య. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల అద్వర్యంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైద్య సేవలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఉద్యోగులు శాఖ పరమైన పలు అంశాలను మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసు కొచ్చారు. సమస్యలను పరిష్కారించాలని వినతి పత్రం సమర్పించారు. హెల్త్ ఎడ్యూకేటర్స్ సమస్యలపై సానుకూలంగా స్పం దించిన మంత్రి దామోదర రాజనర్సింహ సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయం చేస్తానని, తప్పకుండా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు కొప్పు ప్రసాద్, జక్కుల రాములు, వెంకటేశ్వర్లు, కే. శ్రీనివాసులు, ఎం. శ్రీని వాస్, రేష్మ, కటుకం శంకర్, జె. శ్రీనివాసులు, శ్రీనివాసరావు, పుష్ప, నర్సిం హులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల మీదుగా మరో అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 22, ప్రభాతవార్త :** తెలుగు రైల్వే ప్రయాణి కులకు శుభవార్తను అందించింది దక్షిణ మధ్యరైల్వే. రైల్వే ప్రయాణికులకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు రాష్ట్రాలకు అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ అమృత్ భారత్ రైలు తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణించనుంది. ఈ రైలును జనవరి 23 న కేరళలోని తిరువనంతపురం నుంచి ఈ రైలును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఇప్పటికి చర్లపల్లి ముజఫర్ పూర్ ( భీహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. తిరువనంత పురం....చర్లపల్లి మధ్య నడిచే ఈ రైలు తెలంగాణకు కేటాయించిన రెండో అమృత్ భారత్ రైలు. ఈ రెలు ప్రతి మంగళవారం చర్లపల్లి నుంచి ఉదయం 7.15కు బయలు దేరి తరువాతి రోజు తిరిగి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలు దేరి తర్వాత రోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లికి చేరకుంటుంది. ఆధునిక సదుపాయాలతో, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా ఈ రైలును రూపొందించారు. మధ్యతరగతి, సాధారణ ప్రయాణికులకు అందుబాటు ధరల్లో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడం ఈ రైలు ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రారంభంతో తెలుగు రాష్ట్రాల్లో రైల్వే కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు భద్రత, సౌకర్యాలు పెరుగుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రైలు తెలంగాణలోని పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగనుంది. ముఖ్యంగా నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, ఖమ్మం, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట తదితర స్టేషన్లలో ఈ రైలు నిలుస్తుందని అధికారులు తెలిపారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణం మరింత సులభం కానుందని, సాధారణ ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రైల్వే సేవలు అందుబాటులోకి వస్తాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

**మేడారం జాతరకు 28 జన సాధారణ ప్రత్యేక రైళ్లు**

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 22, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన జనవరి 22:మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షి ణ మధ్య రైల్వే మొత్తం 28 జనసాధారణ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వివిధ మార్గాల్లో అందుబాటులో ఉంటాయి. సికింద్రాబాద్- మంచిర్యాల మధ్య (07495/07496) మొత్తం 6 సేవలు, సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య (07497/07498) 4 సేవలు, నిజామాబాద్- వరంగల్ మధ్య (07499/07500) 8 సేవలు, కాజీపేట-ఖమ్మం మధ్య (07504/07503) 8 ట్రిప్పులు, ఆదిలాబాద్-కాజీపేట మధ్య (07501/ 07502) 2 ట్రిప్పులు నడపనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, జనగాం, వరంగల్, కాజీపేట, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, రామగుండం, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ తదితర ప్రధాన స్టేషన్లలో ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లన్నీ పూర్తిగా సెకండ్ జనరల్ కోచ్‌లతో నడుస్తాయని, మేడారం జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ వెల్లడించారు.

## విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యాలు, నాయకత్వం పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు

### నిర్మాణ్ సంస్థతో బిసి గురుకులాల ఒప్పందం

### బిసి గురుకుల కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబా పూలేబీసీ గురుకుల విద్యాలయ సంస్థల్లో చదివే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా, ఉపాధి నైపుణ్యాలు మెరుగు పరిచే లాగా అవగాహన కల్పించేందుకు వీలుగా నిర్మాణ్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం నిర్మాణ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. బీసీ గురుకుల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే లక్ష్యంతో నిర్మాణ్ ఎన్‌జీవో సంస్థతో ఒక అవగాహన ఒప్పందం(ఎంవోయు) కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గురుకుల కార్యదర్శి సైదులు మాట్లాడుతూ.. నిర్మాణ్ సంస్థ అందించే సహకారంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, ఉపాధి నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమగ్రాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 2005లో బిట్స్ పిలానీలో చదివిన నవిద్యార్థులచే స్థాపించబడిన లాభాపేక్షలేని సంస్థ నిర్మాణ్ ఆర్గనైజేషన్ అని.. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్య అభివృద్ధి, ఆరోగ్యం, మానసిక వికాసం, సామాజిక నాయకత్వం వంటి రంగాల్లో పనిచేస్తుందన్నారు. దేశంలోని 26 రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేసిందని నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు సిఈవో మయూర్ పట్నాల అన్నారు. బీసీ గురుకుల విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. అవగాహన ఒప్పందంపై సంతకం చేసే కార్యక్రమంలో డాక్టర్ సుచిత్ర, శాంత కుమార్ చిలుముల, ఉషాకర్ కీర్తి పాల్గొన్నారు.

# రాత్రి చలి.. పగలు ఎండ

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వింత వాతావరణం

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త :** తెలంగాణలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే, మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే, ఫిబ్రవరిలో అది కాస్తా పెరిగి మార్చిలోనే ప్రజల మాడు పగలేలా ఉష్ణోగ్రతలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో రాబోయే వేసవి రోజుల్లో ఎంత తీవ్రంగా ఉండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు దాటి అధికంగా ఉంటున్నాయి.

మరోవైపు రాత్రివేళల్లో చలితో పాటు, చల్లని గాలులు వీస్తుండగా, ఉదయం మంచు ఎక్కువగా ఉంటోంది. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఎండ, మరికొన్నిచోట్ల వర్షాలు, ఇంకొన్నిచోట్ల చలి వంటి విభిన్న పరిస్థితులు ఒకేసారి కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో రాత్రి పూట చలి తీవ్రత తగ్గడం లేదు. కోస్తా, రాయలసీమలో చలి తీవ్రత పెరిగింది. అరకు లోయలో 5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గిమరో రెండు రోజుల పాటు తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పొగమంచు కురుస్తోంది. కొన్ని చోట్ల విజిబిలిటీ వంద మీటర్ల కంటే తక్కువగా నమోదవుతోందని తెలిపారు. దీని కారణంగా ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. మరో రెండు రోజుల పాటు అక్కడ చలితీవ్ర ఉంటోందని భారత వాతావరణశాఖ తెలిపింది.

# ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారం బలోపేతం

### విద్యారంగ అభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం

### తెలంగాణ, ఎపి ఉన్నత విద్యామండళ్ల ఛైర్మన్ల సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్లు అభిప్రాయ పడ్డారు. రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాల మధ్య ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారం ఉండాలన్నారు. గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తితో మంగళ గిరిలోని ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏపి ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్ రావు, ప్రొఫెసర్ కె రత్నశీల మణి, కార్యదర్శి ప్రొఫెసర్ బి తిరుపతి రావు పాల్గొన్నారు. ఉన్నత విద్యా రంగంలో కొనసాగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యా నైపుణ్యాన్ని పెంచడంతో పాటు పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్స హించాల న్నారు. సంస్థాగత భాగస్వామ్యాలను పెంపొందించడంతోపాటు రెండు రాష్ట్రాలలో విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలను మెరుగు పరచడంపై చర్చించారు. చర్చల సందర్భంగా ఏపి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపి ఉన్నత విద్యా మండలి చేపడుతున్న వివిధ విద్యా కార్యక్రమాల గురించి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డికి వివరించారు. క్వాంటం టెక్నాలజీస్‌లో చొరవలు, బోధన అభ్యాస ప్రక్రియల నాణ్యతను మెరుగుపరచడం, విద్యార్థులు, అధ్యాపకులకు అధికనాణ్యత ఆన్‌లైన్ కోర్సులకు ప్రాప్యతను విస్తరించడం లక్ష్యంగా ఏపి ఉన్నత విద్యా మండలి చేపడుతున్న కార్యక్రమాల విస్తృత అమలు కార్యక్రమాల గురించి వివరించారు. ప్రపంచ విద్యా, పరిశ్రమ అవసరాలను తీర్చడానికి రెండు రాష్ట్రాలలోని విద్యార్థులను సిద్ధం చేస్తూ, అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో నైపుణ్యాలతో సన్నద్ధం చేయవలసిన అవసరాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి నొక్కి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నత విద్య నాణ్యతను పెంచడానికి రెండు కౌన్సిల్‌లు నైపుణ్యం, ఉత్తమ పద్ధతులు, వనరులను చురుకుగా పంచుకోవాలని సూచించారు. విద్యా విధానాల అభివృద్ధి, సంస్థలు, అధ్యాపకులు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ఉమ్మడి చొరవలను అన్వేషించడం, తద్వారా రెండు రాష్ట్రాలలో ఉన్నత విద్యారంగాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా ముందుకుసాగాలని నిర్ణయించారు.

### ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లకు

# అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

### 100 మందికిపైగా ప్రమోషన్లు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టిజిసిటిఎ కృతజ్ఞతలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వారికి కెరీర్ అడ్వాన్స్‌మెంటన స్కీమ్ (సీఏఎస్) కింద అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదో న్నతులు కల్పిస్తూ కళాశాల విద్య కమిషనర్ ఉత్త ర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 104 ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫె సర్లుగా పదోన్నతిలభించింది. వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న 100 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గురువారం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు 14 సంవత్సరాల బోధన సేవలను, పరిశోధనా అనుభవాన్ని గుర్తించి ఇచ్చే అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతికి అన్ని సబ్జెక్టులలో కలిపి మల్టీ జోన్-1 నుండి 50 మంది అధ్యాపకులు, మల్టీజోన్-2 నుండి 54 మంది అధ్యాపకులు ఎంపికయ్యారు. బోధనా రంగంలో ఉన్నతమైన అధ్యాపక వృత్తిలో అసోసియేట్ ప్రొఫెసర్ అనేది ఉన్నతమైన పదోన్నతి అని, 100మందికి పైగా ప్రభుత్వ అధ్యాపకులు ఈ ప్రమోషన్ పొందడం పట్ల తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం(టిజిసిటిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎరుగు బ్రిజేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల, కళాశాల అభివృద్ధికైపాటు పడుతన్న అధ్యాపకులకు సకాలంలో అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతి అందించిన ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్‌రెడ్డికి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్య కమిషనర్ ఏ శ్రీదేవసేనకు పదోన్నతుల విషయంలో భాగస్వాములైన ఇతర అధికారులకు, బోధనేతర సిబ్బందికి టిజిసిటిఏ రాష్ట్ర భాధ్యులు డాక్టర్ సౌందర్య జోసెఫ్, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ అమరేందర్ రెడ్డి ధన్య వాదాలు తెలిపారు.

# 27న దేశవ్యాప్తంగా బ్యాంక్‌ల సమ్మె




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ కె.ఆంజనేయప్రసాద్ తదితరులు

### ఐదు రోజుల పనివిధానం అమలు కోసం డిమాండ్

### యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ వెల్లడి

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ బ్యాంకులకు ఐదు రోజుల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 27న దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె పాటించనున్నట్టు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్ బియు) వెల్లడించాయి. ఈమేరకు గురువారం హైదరబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ తొమ్మిది బ్యాంకు, అధికారుల సంఘాల ఆధ్వర్యం లో జరిగిన మీడియా సమావేశంలో యుఎఫ్‌బియు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కె.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. 2015లో ప్రభుత్వం ప్రతి నెల 2వ, 4వ శనివారాలు సెలవ దినాలు ప్రకటించిందని గుర్తుచేశారు. బ్యాంకు ఉద్యోగులకు పని సమయం పెంచడం, మిగిలిన శని వారాలు పని దినాలుగా ప్రకటిం చేందుకు ప్రభుత్వం, యునైటెడ్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో చర్చకు నిర్ణయించినట్లు తెలి పారు. తర్వాత, 2023లో శుక్రవారం వరకు పని సమయాన్ని 40 నిమిషాలు పెంచి, మిగిలిన శనివారాలను సెలవు లుగా ప్రకటించాలని అంగీక రించి, ప్రభుత్వానికి సిఫారసు కూడా చేశారన్నారు. కానీ, రెండేళ్లుగా అది ఆమోదం పొందకుండా పెండింగ్ లోనే ఉందని కావున ప్రభుత్వ నిరక్ష్య వైఖరిని నిరసిస్తూ 2025 మార్చి 24, 25న రెండు రోజులు బ్యాంకుల సమ్మెకు పిలుపు నిచ్చామన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తమ హామీలను పరిశీలి స్తుందని చెప్పగానే సమ్మెను వాయిదా వేశామ న్నారు. బ్యాంకింగ్ రంగంలో 98శాతం కంటే ఎక్కువ లావాదేవీలు డిజిటల్ ద్వారానే జరుగుతు న్నందున ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ఐదురోజుల పనిదినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు డి.ఎస్. రాంబాబు, శాండిల్య, కుమార్, సతీశ్, అర్జున్, సతీష్‌రెడ్డి, రాజేష్ కుమార్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

**వరుసగా నాలుగురోజులు బ్యాంక్‌లకు సెలవు**

అయితే ఈ నెల 24 నాలుగో శనివారం, 25న ఆదివారం, 26న గణతంత్ర దినోత్సవాలు, 27న బ్యాంక్‌ల సమ్మెతో వరుసగా నాలుగు రోజులపాటు బ్యాంక్‌లకు సెలవు రానుంది.

# కోర్టు కేసు తేలకుండా మున్సిపల్ ఎన్నికలకు ఎలా వెళతారు?

### 42 శాతం బిసి రిజర్వేషన్ ఇవ్వకుండా ఎన్నికలు జరపడం బిసిలను దగా చేయడమే

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త :** కోర్టు కేసు తేలకుండా మున్సిపల్ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు ఎలా వెళతారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 42శాతం బి.సి రిజర్వేషన్ ఇవ్వకుండా ఎన్నికలు జరుపడం బీసీలను దగా చేయడమే అవుతుందని, స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచిన కేసు హైకోర్టును నడుస్తుంది. గత నవంబర్ లో హైకోర్టులో ఫుల్ బెంచ్ మీదకు రావలసిన కేసు ఇంతవరకు కోర్టు బెంచ్ కూడా రాకుండా వాదించకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. బీసీ బంద్ తర్వాత రాజకీయ పార్టీలు రాజ్యాంగ వ్యవస్థలని బీసీలకు అన్యాయం చేయడానికి సాహసం చేయడం లేదని అన్నారు. దీనిపై "స్టే" ఉంది. పంచాయతీ ఎన్నికలు జరిపే సమయంలో ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి వచ్చే 3000 కోట్లు గ్రాంట్ రాదని అందుకు ఎన్ని కలు జరపాలని జరిపారన్నారు. ఎందుకు మున్సి పల్ ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలకు తొందర. కోర్టు కేసు న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగపరంగా బలంగా ఉంది. ఎన్ని కోణాల్లో చూసిన కేసు గెలుస్తుంది. గెలిపించడానికి సర్వశక్తులు ఓడిపోరాడుతున్నాం. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వం కేసు గెలిపించడానికి గట్టిగా ప్రయత్నం చేయకుండా ఎన్నికలకు తొందరపడడం దేనికి? కోర్టులో బీసీల కేసు అంటే ఓడిపోతుంది. కొట్టివేస్తారు. అనేది ఒక ఫ్యాషన్ గా తయారయిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డిజి టిసి ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది. దీనికి రాజ్యాంగ బద్ధత యుంది. అలాగే చట్టబద్ధత కల్పించారు. కావున అసెంబ్లీ చట్టం చేశారు. 50 శాతం సీలింగ్‌ను న్యాయపరమైన వాటిని అధిగామిం చామని, బీసీలు కేసులు గెలిచే అవకాశం ఉం దని, చట్ట ప్రకారం, న్యాయప్రకారం రాజ్యాం గపరమైన అవరోధాలు లేనందున జనాభా లెక్క లు ఉన్నప్పటికీ కోర్టులో కేసు గెలుస్తుందని అన్నారు. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశారన్నారు. కేసు గెలవాలి. న్యాయం ముందు ఎలా గెలవదో చూస్తామని హెచ్చరించారు. బీసీల జీవితాలతో బీసీ ఆత్మగౌరవంతో చెలగాటం ఆడుతుంది. ప్రభుత్వం ఈ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణా మాలు జరుగుతాయని హెచ్చరించారు.

# విద్యుత్ బకాయిలు చెల్లించాల్సిందే

### గీతం వర్సిటీకి హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త :** తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు బకాయిలను మూడు వారాల్లోగా చెల్లించాలని గీతం యూనిర్సిటీని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు గాను బకాయిలు కింద 54 కోట్ల రూపాయలను డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని రుద్రారం సెక్షన్ ఉన్న గీతం యూనివర్సిటీ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థకు 118 కోట్ల రూపాయల విద్యుత్ బకాయి పడిన విషయం తెల్సిందే. సంస్థ పరిధిలో వివిధ సర్కిళ్ల నుండి డిస్కం కు దాదాపు 2,400 కోట్ల రూపాయలు కోర్టు కేసులతో లింక్ అయివున్నాయి. ఈ మొండి బకాయిల వసూళ్ళలో భాగంగా గత ఏడాది జులై లో బకాయిలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దానిలో భాగంగా బకాయిదారులందరికి డిస్కనెక్షన్ నోటీసులు జారీ చేసారు. కొంత మంది వినియోగదారుల నుండి దాదాపు 500 కోట్ల రూపాయిల మేర వసూలయ్యాయి. అయితే గీతం యూనివర్సిటీ మాత్రం బకాయి చెల్లించకుండా హైకోర్ట్‌ను ఆశ్రయించింది. కేసును విచారించిన ఇద్దరు న్యాయ మూర్తులతో కూడిన హై కోర్ట్ ధర్మాసనం మూడు వారాల్లోగా 54 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాల్సిందిగా గురువారం యూనివర్శిటీ యాజమాన్యాన్ని ఆదేశించింది.



### పామాయిల్ లక్ష్యాలు చేరని

# కంపెనీల రద్దు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఆయిల్ పామ్ సాగు ఆశించిన స్థాయిలో లేదని, వెంటనే అక్కడ ఉన్నటువంటి ఆయిల్ పామ్ కంపెనీల జోన్లనును రద్దు చేసి, ఆసక్తి కలిగిన ఇతర కంపెనీలకు ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ లక్ష్యాల్లో వెనుకబడిన కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలలోని ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను ఇప్పటికే రద్దు చేశామన్నారు. వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించినట్లు చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోవడంలో ఆయిల్ ఫెడ్ సంస్థ కూడా విఫలమైతే వాటిని కూడా రద్దు చేస్తామన్నారు. ఆయిల్ పామ్ విస్తరణ కోసం ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగులను చేర్చుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్‌లో వచ్చే వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారుచేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. దిగుబడి పెంచేందుకు రైతులకు ట్రైకోడర్మా, గానోడెర్మా నిరోధక బయో ఫర్టిలైజర్లు 50 శాతం సబ్సిడీతో అందించాలని పేర్కొన్నారు. పామ్ ఆయిల్ సాగులో యంత్ర సేవల కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కాగా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న, ధాన్యానికి టెండర్లు పిలవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో పాడవకముందే మంచి రేటుకు అమ్ముకోవాలని చెప్పారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యత, అధిక దిగుబడి వచ్చే విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రైవేట్ కంపెనీలకు ధీటుగా విత్తనాభివృద్ధి సంస్థ కూడా విత్తనాలను ఉత్పత్తి చేయాలన్నారు. సీజన్ కు ముందే రైతు సాగు చేసే విస్తీర్ణాన్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పేరెంట్-టీచర్ సమావేశం

### 430 ప్రభుత్వ జూ. కాలేజీల్లో ఒకేరోజు ఏర్పాటు

### వార్షిక పరీక్షలు, విద్యార్థుల స్థితిగతులే ప్రధాన అజెండా

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నేడు(శుక్రవారం) పేరెంట్ టీచర్ మీటింగ్(పిటిఎం)ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉన్న 430కిపైగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పిటిఎంను నిర్వహించాలని ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారు(డిఐఈవో)లను ఆదేశించారు. బుధవారం, గురువారం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించగా.. నేడు జరగాల్సిన ఎథిక్స్ పరీక్షను రేపటి(శనివారం) జరగనుంది. పరీక్షను రద్దు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పి వారిని సమావేశంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని డైరక్టర్ ఆదేశించారు. వాస్తవానికి నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పిటిఎం మీటింగ్‌లో భాగంగా ఒకచోట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మీటింగ్ పెట్టించాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు తొలుత భావించినప్పటికీ .. సీఎం దావోస్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆయన లేకుండానే సమావేశాలను నిర్వహిస్తున్నారు. నేడు జరిగే పిటిఎం సమావేశంలో ప్రధానంగా రాబోయే ఫిబ్రవరిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎలా చదువుకుంటున్నారు.. వారి పిల్లలకు వస్తున్న ఇబ్బందులేమిటీ.. ఆయా కాలేజీల్లో ఉన్న సమస్యలేంటి, విద్యార్థులు తల్లిదండ్రులతో చెప్పిన ఇబ్బందులు, సమస్యలను పిటిఎంలో చర్చించనున్నారు. పిటిఎంలో చర్చించిన అంశాలపై దృష్టి పెట్టి రానున్న రోజుల్లో వాటిని అధిగమించి రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అనుకున్నదానికంటే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించేలాగా ప్రణాళికలను రూపొందించుకోవాలని ఇంటర్ విద్య డైరక్టర్ డిఐఈవోలు, ప్రిన్సిపాల్స్‌కి సూచించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని మౌలిక వసతులపై కూడా ఇదే సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంచడంతోపాటు విద్యార్థులు సామర్థ్యస్థాయిని పెంచడం కోసం 90 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దానిపై కూడా ఇదే పిటిఎంలో చర్చించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## మల్టీజోన్-2 పరిధిలో 14 మంది పోలీసు అధికారుల బదలీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** రాష్ట్రంలోని పోలీసు ఉద్యోగుల మల్టిజోన్2 పరిధిలో పనిచేస్తున్న 14 మంది పోలీసు అధికారులను బదిలీ చేస్తూ అడిషనల్ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ పరిధిలోని మహబూబ్‌నగర్ జిల్లాలో సీసీఎస్‌లో పనిచేస్తున్న కె. సుగంధ రత్నంను వనపర్తి జిల్లాకు బదిలీ చేశారు. వనపర్తి సర్కిల్‌లో పనిచేస్తున్న ఎం. కృష్ణయ్యను, మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఎండీ మగ్దూం అలీని, వికారాబాద్ టౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న బి. భీంకుమార్‌ను, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో సర్కిల్‌లో పనిచేస్తున్న డి.విష్ణువర్దన్ రెడ్డిని, నల్గొండ జిల్లా నకిరేకల్ పీఎస్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న జి.రవిబాబును మల్టిజోన్2లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. నల్గొండలో వేయిటింగ్‌లో ఉన్న సీహెచ్ మోతీరాంను మహబూబ్‌నగర్ సీసీఎస్‌కు, ఎం.నర్సింహులును మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. హైదరాబాద్‌లో వేయిటింగ్‌లో ఉన్న కె.రఘుకుమార్‌ను వికారాబాద్ టౌన్ పీఎస్, నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్‌లో పనిచేస్తున్న కె.రాజేందర్ రెడ్డిని మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ పీఎస్‌లో ఉన్న ఎం. భగవంత రెడ్డిని నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్‌కు, నల్గొండ డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఈ. రఘువీరారెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు బదిలీ చేశారు. హైదరాబాద్ సిటీలో వేయిటింగ్‌లో ఉన్న వి. ప్రదీప్ కుమార్‌ను గద్వాల జిల్లా ఆలంపూర్ సర్కిల్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.




గురువారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన పిఎం సంసద్ ఖేల్ మహోత్సవ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## క్రీడల ప్రోత్సాహమే ప్రధాని మోడీ స్వప్నం

### గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (స్పోర్ట్స్), జనవరి 22, ప్రభాతవార్త:** క్రీడలను సమాజంలోని ప్రతి వర్గానికి అందుబాటులో ఉంచాలన్నదే ప్రధాని నరేంద్రమోడీ స్వప్నమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. ప్రధాని ప్రేరణతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'పిఎం సంసద్ ఖేల్ మహోత్సవం' కార్యక్రమం ద్వారా దేశంలో క్రీడా సంస్కృతి మరింతగా బలోపేతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిఎం సంసద్ ఖేల్ మహోత్సవ ప్రారంభోత్సవం గురువారం బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గవర్నర్ ప్రసంగిస్తూ భారతదేశాన్ని అనేక మంది ప్రధాన మంత్రులు పాలించారని, కాని క్రీడల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని చాటుతున్న నాయకుడు మన ప్రధాని నరేంద్రమోడీ అని చెప్పారు. క్రీడలు కేవలం ఆటలకు మాత్రమే కాకుండా విజ్ఞానం, విద్య, శారీరక-మానసిక వికాసానికి మార్గాన్ని అందిస్తాయని ఆయన వివరించారు. వికసిత్ భారత్ దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా భారత బ్యాడ్మింటన్ జట్టు కోచ్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, భారత మహిళా క్రికెటర్ దయానా డేవిడ్, దృష్టి కేసరి తదితరులు హాజరైనారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఖేల్ మహోత్సవం పోటీలు 15 రోజుల పాటు సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని 30 గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్‌తోపాటు పలు ఇతర క్రీడలు ఈ మహోత్సవంలో భాగమన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మ్యూజికల్ ఛైర్స్ వంటి పోటీలను చేపడుతున్నామని, మీడియా ప్రతినిధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించడం ఈ ఏడాది ప్రత్యేకతగా ఆయన పేర్కొన్నారు. మొత్తం 35 వేల మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో కోతులపై విషప్రయోగం

### పది జీవాలు మృతి, మరికొన్ని అపస్మారక స్థితిలోకి..

**కామారెడ్డి, జనవరి 22:** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కోతులపై విషప్రయోగంచేయడంతో పదికోతులు మృతిచెందాయి. మరికొన్ని కోతులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా పశువైద్య సిబ్బంది కాపాడారు. ఈ విషాదకర సంఘటన బిక్కనూరు మండలం అంతంపల్లి సమీపంలో జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కోతులను అంతంపల్లి సమీపం లోని ఓ హోటల్‌వద్ద వదిలివెళ్లిపోయారు. కోతులు మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ ఏనుగు మంజుల వెంటనే పోలీసులతోపాటు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సిసిటివి ఫుటేజిని పరిశీలించి ఎవరో వాహనంలో సుమారు 150 నుంచి 200 వరకూ కోతులను తీసుకొచ్చి వదిలిపెట్టినట్టు గుర్తించారు. ఇటీవలికాలంలో దుండగులు మూగజీవాలకు విషం పెట్టి చంపేస్తున్న సంఘటనలు ప్రతిరోజూ పెరిగిపోతున్నాయి. ఇది గ్రామస్తులకు పశువులకు కూడా ప్రమాదకరమని పలు నివేదికలు విశ్లేషిస్తున్నాయి. ప్రభుత్వాలు స్పందించి నివారణచర్యలుచేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఐనాక్స్ గ్రూప్ ఆసక్తి

### ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్‌జైన్‌తో మంత్రుల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా అభివృద్ధి చేసే లక్ష     ్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం ప్రతినిధులు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. ఐనాక్స్ గ్రూప్ తెలంగాణలో సౌర , పవన విద్యుత్ ఉత్పత్తి చేపట్టి, ఆ తర్వాత తయారీ రంగంలోకి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కాలుష్యం లేని విద్యుత్ (క్లీన్ ఎలక్ట్రిసిటీ) , గ్రీన్ హైడ్రజన్ అందిచాలనే ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తున్నది అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. డేటా సెంటర్ల నుంచి అధిక స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోందని చెప్పారు. నూతన తెలంగాణ ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గి



## నైనీ టెండర్లపై రాష్ట్రం కోరితే సిబిఐ విచారణకు కేంద్రం సిద్ధం

### బిజెపి పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 22:** సింగరేణి నైనీ కోల్ టెండర్ల విషయంలో రాష్ట్రం కోరితే సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. సీబీఐ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలం నుండి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరగాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా రాష్ట్ర కమిటీల పనితీరుతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి నాలుగు నెలల ఫలితాలను సమీక్షి     ంచారు. రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలని రాంచందర్ రావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా అనుబంధ విభాగాల పనితీరుపై కూడా రాంచందర్ రావు సమీక్ష చేశారు. బిజెపి అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గతంలో దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో, ఎంతమందికి ఉద్యోగాలు లభించాయో, అనే విషయాలు ప్రజలకు చూపించాలని సవాల్ విసిరారు. ఇప్పటికి రెండుసార్లు దావోస్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బిసి నేత సిఎం అయ్యే టైమొస్తుంది

### ఒబిసి సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోం దని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. ముమ్మందు బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవ కాశం ఉన్న ప్రతిచోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబిసి డిపార్టమెంట్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ ఎక్స్టెండెడ్ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నరేగా బచావో ఆందోళన్ కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష     ్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు.ఆర్వింద్ జై శ్రీరాం అని కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

**దివ్యాంగుల విభాగంలో సభ్యత్వ నమోదు ప్రక్రియకు యాప్**

కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేసేలా రూపొందించిన సభ్యత్వ నమోదు యాప్‌ను మహేశ్ కుమార్‌గౌడ్ గాంధీ భవన్‌లో అధికారికంగా ప్రారంభించారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని,వారి రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వికలాంగుల విభాగాన్ని మరింత బలపరిచే దిశగా ఇది కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల విభాగం కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం నాయకులు,పార్టీ ముఖ్యనేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆశల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

### రూ.2.14 కోట్లు పోగొట్టుకుని గిలగిల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 22:** హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సైబర్ మోసగాళ్ల చేతిలో దారుణంగా మోసపోయాడు. సోషల్ మీడియాలో పరిచయమైన ఓ మహిళ చెప్పిన మాయమాటలు నమ్మి, నకిలీ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.2.14 కోట్లు పోగొట్టుకున్నాడు.ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది.సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం, టీఎన్‌జీవో కాలనీకి చెందిన 44 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబరులో సోషల్ మీడియా ద్వారా ఓ మహిళ పరిచయమైంది. తాను స్టాక్ ట్రేడింగ్‌లో భారీగా లాభాలు గడిస్తున్నట్లు నమ్మించింది. ఆమె మాటలు విశ్వసించిన బాధితుడి చేత ఓ నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించింది.డిసెంబర్ 12న తొలిసారిగా రూ.31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా, యాప్‌లో భారీగా లాభాలు కనిపించాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయని ఆ మహిళ ఆశ చూపింది. ఆమెను నమ్మి రెండోసారి రూ.42.27 లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, వచ్చిన లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాలని మోసగాళ్లు మెలిక పెట్టారు.యాప్‌లో కనిపిస్తున్న వర్చువల్ లాభాలను నిజమని నమ్మిన బాధితుడు, ఆఫీసు సహోద్యోగుల నుంచి రూ.90 లక్షలు అప్పు తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల నుంచి డబ్బు సేకరించి, కొన్ని ఆస్తులను కూడా అమ్మి మొత్తం 8 విడతల్లో రూ.2.14 కోట్లు వారికి పంపాడు. చివరకు డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా మరో రూ.68 లక్షలు కట్టాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు.వెంటనే అప్రమత్తమైన బాధితుడు, ఆ మహిళ ఫొటోను ఇంటర్నెట్‌లో వెతకగా, అది ఇన్‌స్టాగ్రామ్‌లోని వేరొకరి ప్రొఫైల్ నుంచి దొంగిలించిందని తేలింది. దీంతో తాను నకిలీ ప్రొఫైల్‌తో మోసపోయానని నిర్ధారించుకుని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# న్యూసౌత్‌వేల్స్‌లో కాల్పులు.. ముగ్గురు మృతి



**న్యూసౌత్‌వేల్స్, జనవరి 22:** ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రంలో కాల్పులు కలకలం రేపాయి. దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. కాల్పులు జరిగిన లేక్ కార్గేలిగో ప్రాంతంలో ప్రస్తుతం సహాయక చర్యలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 15 వందల మంది నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం అందుతోంది. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ప్రస్తుతం నిందితుల్ని పట్టుకునే పనిలో పోలీసులు _ఉన్నారు. ఆస్ట్రేలియా మరోసారి కాల్పుల మోతతో అట్టుడికింది. గతేడాది డిసెంబర్ 14 న సిడ్నీలోని బోండీ బీచ్ లో కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఉగ్రదాడిలో 16 మంది మృతి చెందారు. మరో 40 మంది గాయపడ్డారు. ఈ కేసులో తండ్రీ కొడుకులే ఘటనకు పాల్పడినట్లు దర్యాప్తు సంస్థలు తేల్చాయి. అయితే సిడ్నీ ఉగ్రదాడి మృతులకు నివాళిగా ఆస్ట్రేలియా జాతీయ సంతాప దినం పాటిస్తున్న రోజే తాజాగా మరోసారి కాల్పులు జరగడం ఆందోళనకరంగా మారింది. ఆస్ట్రేలియా సౌత్ వేల్స్ రాష్ట్రంలోని లేక్ కార్గేలిగో ప్రాంతంలో కాల్పుల మోత మోగింది. ఈ కాల్పు ల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక ఘటనా నంతరం దుండగులు అక్కడినుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు.. స్థానికులను అప్రమత్తం చేశారు. ఘటన జరిగిన ప్రాంతం ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీకు 611 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్థానిక ప్రజలు ఇళ్లలోనే ఉండాలని బయటకు రావొద్దని అధికా రులు సూచనలు చేశారు. ఇక గతంలో బోండీ బీచ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఇది ఉగ్ర దాడేనా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# ధాన్యం దిగుబడిలోనే కాదు..కొనుగోలులోనూ ఆల్‌టైమ్ రికార్డు

### 14.20 లక్షల మంది రైతులకు లబ్ధి

### రూ.18,532.98 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

### మీడియాకు వెల్లడించిన మంత్రి ఉత్తమ్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు.2025 -26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవధిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖా,నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు.స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనతతెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో లేవని ఆయన తెలిపారు.2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్‌ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్‌లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌తో కలిపి మొత్తం రూ.18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు.ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85శాతం లబ్ది పొందుతున్నారని ఆయన వివరించారు.

# భువనేశ్వర్ నుండి ముంబైకి తరలిస్తున్న గంజాయి స్వాధీనం

### అంతర్రాష్ట్ర గంజాయి వ్యాపారి అరెస్ట్

### 16.452కిలోల గంజాయి, విలువ రూ. 8,22,600

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 22, ప్రభాతవార్త :** భువనేశ్వర్ నుండి ముంబైకి అక్రమంగా తరలిస్తున్న 8,22,600 రూపాయల విలువగల 16.452కిలో గంజాయిని హైదరాబాద్ జీఆర్‌పి సిబ్బంది, ఈగిల్ టీం అంతర్ రాష్ట్ర గంజాయి వ్యాపారి నుండి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఐఆర్‌పి బి.ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ ఎస్ఐఆర్‌పి ఇ.శ్రీనివాస్, సిబ్బంది; ఈగిల్‌టీం టీజిఎన్‌బి లతో కలిసి బేగంపేట రైల్వేస్టేషన్‌లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నప్పుడు మహారాష్ట్రకు చెందిన మమత దిగల్ అనుమానాస్పదరీతిలో రెండు ట్రాలీ సూట్‌కేసులను కలిగి ఉన్నట్లు గమనించి పట్టుకున్నారు. విచారణలో నిందితురాలు మమత దిగల్ తాను ఇంటి పనిమనిషిగా పని చేస్తున్నప్పుడు సోను ద్వారా ముంబైకి చెందిన అశోక్ అనే వ్యక్తిని కలిసానని, అతను గంజాయిని భువనేశ్వర్ నుండి ముంబైకి రవాణా చేయ డానికి ప్రతీ సూట్‌కేస్‌కి 10వేల రూపాయల ఆఫర్ ఇచ్చాడని, ఆ ప్రతిపాద నను అంగీకరించినట్లు తెలిపింది. జనవరి 10న అశోక్ మమతకు ఫోన్‌చేసి గంజాయిని తీసుకు రావడానికి 14న భువనేశ్వర్‌కు వెళ్లమని సూచించాడు. అశోక్ ఆదేశాలమేరకు ఆమె భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలునంబరు 11019 కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కగా గుర్తుతెలియని వ్యక్తి రెండు ట్రాలీ సూట్‌కేసులను ఇచ్చాడు. ఆమె ముంబైకి వెళుతుండగా బేగంపేట రైల్వేస్టేషన్‌లో అనుమానంతో పోలీసులు ఆమె ట్రాలీబ్యాగులను తనిఖీచేయగా గోధుమరంగు టేప్‌తో కప్పబడిన గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. వెంటనే పోలీసులు పంచనామా నిర్వహించి 9 గంజాయి ప్యాకెట్లతో కూడిన రెండు సూట్‌కేసులను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ఎ-1 నిందితుడు అశోక్ అజ్ఞాతంలో ఉన్నాడు. ఐఆర్‌పి హైదరాబాద్ ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ ఎస్ఐఆర్‌పి ఇ.శ్రీనివాస్, సంబంధిత సిబ్బంది, ఎస్.ఎస్.జావేద్, పి.బిక్షపతిరావు ఈగిల్‌టీం డిఎస్పీ పర్యవేక్షణలో నిందితురాలిని అరెస్టు చేశారు.




స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితురాలితో ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, జావేద్, బిక్షపతిరావు తదితర పోలీసు అధికారులు

## కెసిఆర్‌తో కెటిఆర్, హారీశ్‌రావు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ వాతావరణం నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అగ్రనేతలు కీలక సమావేశం నిర్వహించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఫోన్ ట్యాపింగ్ వివాదం నేపథ్యంలో మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో భేటీ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే హారీష్ రావును సిట్ అధికారులు విచారించగా, శుక్రవారం కేటీఆర్ కూడా సిట్ ఎదుట హాజరుకావాలని నోటీసులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో విచారణను రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలి, పార్టీపై వచ్చే విమర్శలను ఎలా తిప్పికొట్టాలి అనే అంశాలపై నేతలు లోతైన చర్చ జరిపినట్లు సమాచారం.



## మహిళా ప్రీమియర్‌లో గుజరాత్ జైంట్స్ గెలుపు

### 45 పరుగుల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**వదోదర, జనవరి 22:** మహిళాప్రీమియర్‌లీగ్‌లో 14 మ్యాచ్‌లో గుజరాత్ జైంట్స్ చెలరేగిపోయింది. 45 పరుగుల తేడాతో యుపి వారియర్స్‌జట్టుపై గెలిచి తన సత్తా చూపించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన గుజరాత్ జట్టు ఎనిమిది వికెట్ల నష్టానికి 153 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన యూపి జట్టు 108 పరుగులకే పరిమితం కావడంతో గుజరాత్ మహిళలు 45 పరుగుల తేడాతో విజయం సాధించారు. గుజరాత్ జట్టులో సోఫీ డివైన్ 42 బంతుల్లో రెండు ఫోర్లు మూడు సిక్స్‌లతో 50 పరుగులుచేసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. బెత్‌మూనీ 34 బంతుల్లో 38 పరుగులుచేసి రాణించగా డాని వ్యాట్ హాడ్జ్ 14, అనుష్కశర్మ 14, కష్విగౌతమ్ 11 పరుగులుచేసారు. యూపి బౌలర్లలో క్రాంతిగౌడ్ 2, సోఫి ఎకిల్‌స్టోన్ రెండు, దీప్తిశర్మ క్లోట్రయాన్ చెరొక వికెట్ తీసారు. యూపి వారియర్స్ హ్యాట్రిక్‌పై కన్నేసినా ఫలితం రాబట్టుకోలేకపోయింది. గుజరాత్ ఐదు మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలుసాధిస్తే ఇపుడు మూడో విజయం సాధించింది. లక్ష్యఛేదనలో యూపి 17.3 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. లిచ్‌ఫీల్డ్ 32, ట్రయాన్30 పరుగులుచేయగలిగారు. గుజరాత్ బౌలర్లలో రాజేశ్వరి గైక్వాడ్ మూడు, రేణుకాసింగ్,సోఫీ డివైన్ చెరొక రెండు వికెట్లు తీసారు. కష్వీగౌతమ్, ఆష్లీ గార్ట్‌నర్ తలొక వికెట్‌తీసారు.

## ముగిసిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం దావోస్ పర్యటన

### జూరిచ్ నుంచి అమెరికాకు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి.. 31 వరకు అక్కడే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసింది. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది.మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించింది.వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది.పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం మూడు రోజుల తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. దావోస్‌లో కార్యక్రమాలు ముంగించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూరిచ్ బయల్దేరారు. అక్కడి నుంచి అమెరికా పర్యటనకు వెళుతున్నారు. మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దావోస్ నుంచి ఇండియాకు తిరుగు పయనమయ్యారు.

## బిఆర్ఎస్ హయాంలోనే సింగరేణికి భారీగా అప్పులు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 22:** సింగరేణి విషయంలో సహకరించేందుకు కేంద్రం సిద్దంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు కుంభకోణం ఇష్యూలో బిఆర్ఎస్ నేతలు పదే పదే సిబిఐ చేత ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.బిఆర్ఎస్ హయాంలో తెలంగాణలోకి సిబిఐ రాకుండా నిషేధించిందే బిఆర్ఎస్ అని గుర్తుచేశారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్కో, ట్రాన్స్‌లకు డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేదని చెప్పారు. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారని చెప్పారు.



# ఎల్లుండి ఏడుకొండల్లో 'మినీబ్రహ్మోత్సవం!

## - రేపటి నుండి 26వరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** రెండురోజుల్లో కలియుగవైకుంఠం తిరుమల కొండపై (ఎల్లుండి) ఆదివారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఈ సందర్భంగా తిరుమల ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆదివారం రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై ఇప్పటికే జిల్లా యంత్రాంగంతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటు చేశారు. ఎల్లుండి ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేశారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేశారు.ఆ రోజు పూర్తిగా భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు.

**- అన్ని దర్శనాలు రద్దు:** ఆదివారం అన్ని ఆర్జిత సేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు.

ఒకరోజు మినీబ్రహ్మోత్సవం వీక్షించేందుకు తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 24వతేదీ నుండి 26వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని కూడా నిలుపుదలచేశారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలకోసం 14రకాల మెనూ తయారీ చేసినట్లు తెలిపారు. గ్యాలరీల్లోని భక్తులకు 85పుడ్‌కౌంటర్ల ద్వారా ఉదయం నుండి రాత్రి వరకు అందజేసేలా చూస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.



# ఆధ్యాత్మిక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

## అరసవిల్లిలోనూ రథసప్తమి వేడుకలకు పూర్తి ఏర్పాట్లు

### మంత్రి ఆనం రామనారాయణ

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, దావోస్ నుండి రాగానే సూర్య జయంతి వేడుకలపై మంత్రులతో సమీక్షిస్తారని రాష్ట్రదేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిచేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి సంపూర్ణశక్తిసామర్థ్యాలు ఇవ్వాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రార్థించానన్నారు. ఇప్పటికే తిరుమలలో వైకుంఠ ఏకాదశి దర్శనాలను ప్రశాంతంగా అందరికీ సంతృప్తిగా కల్పించిన టిటిడి పాలకమండలి, అధికారులు ఆదివారం రథసప్తమి వేడుకలకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారని తెలిపారు. ఒకరోజు అంబ్రహ్మోత్సవానికి ఏడువాహనాలపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఊరేగనున్నందున అన్ని రకాల టిటిడి సిద్ధమైందని, సంతృప్తికర సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తిచేశారన్నారు. రాష్ట్రంలోని శ్రీకాకుళంజిల్లాలో కూడా అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో కూడా రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అక్కడ ఏర్పాట్లు కూడా ఆయన పర్యవేక్షిస్తున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఆ రోజు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఆలయం వద్ద ఉండి భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించేలా చూస్తారన్నారు. రాష్ట్రంలో హిందువుల సంప్రదాయాన్ని గౌరవిస్తూ సంక్రాంతి పండుగ కూడా అందరూ సంతోషంగా జరుపుకున్నారన్నారు. గురువారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వచ్చిన దేవాదాయమంత్రి రామనారాయణరెడ్డి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు.

# ఎపి విద్యార్థులకు కేంబ్రిడ్జి కోర్సులు : మంత్రి నారా లోకేష్

## - యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డెబ్బీ ప్రెంటిస్‌తో మంత్రి సమావేశం

**విజయవాడ,జనవరి 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్దులకు నాణ్యమైన విద్యావిధానాన్ని అభివృద్ధి చేసేందుకు పటిష్టమైన కార్యచరణను అమలు చేస్తున్నామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు.ప్రాథమిక పాఠశాల విద్యార్ది సైతం తనలోని సృజనాత్మక శక్తికి పదును పెట్టే దిశలో నైపుణ్యత పెంచే దిశలో విద్య అందుబాటులోకి తెస్తామన్నారు.దావోస్ పర్యటనల్లో భాగంగా గురువాం కేంబ్రిడ్జి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డెబ్బీ ప్రెంటిస్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 810 తరగతుల విద్యార్థులకు వాతావరణ మార్పులు, సుస్థిరత, భవిష్యత్ నైపుణ్యాలపై కేంబ్రిడ్జి సర్టిఫైడ్ ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలతో కలిసి జాయింట్ రీసెర్చ్, కరిక్యులమ్ డెవలప్‌మెంట్, ఫ్యాకల్టీ ఎక్స్‌ఛేంజ్ కార్యక్రమాల కోసం ఒప్పందం చేసుకోవాలని ప్రతిపాదించారు. ఆంధ్రా యూనివర్సిటీ, ఐఐటీ తిరుపతి వంటి సంస్థలతో కలిసి ఏఐ, డేటా సైన్స్ వంటి అధునాతన రంగాల్లో పరిశోధనలు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై స్పందించిన డెబ్బీ ప్రెంటిస్, భారత్‌లో తాము ఇప్పటికే క్లైమేట్ ఎడ్యుకేషన్, డిజిటల్ స్కిల్స్‌పై దృష్టి సారించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని, త్వరలోనే తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని చెప్పారు.




# పోలీస్ సిబ్బంది పనితీరును మెరుగుపరచేందుకు అవసరమైన వనరుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత: హోంమంత్రి అనిత



హోం శాఖ బడ్జెట్‌పై సమీక్షిస్తున్న మంత్రి అనిత

**విజయవాడ,.జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీస్ సిబ్బంది పనితీరును మెరుగుపరచేందుకు అవసరమైన వనరులు, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.పోలీసింగ్ నూతన సాంకేతికతను వినియోగించడం,క్షణాల్లో నేరాన్ని ఛేధించడం వంటి అంశాల్లో నైపుణ్యతను పెంచుకోవాలన్నారు.ఇందుకు అవసరమైన టెక్నాలజీకి వ్యయం చేయాల్సిన అంశంపై కీలకంగా ఆలోచించాలన్నారు.ఇందు కోసం కేంద్రం నుంచి సహకారం తీసుకోవాలన్నారు.హోం శాఖ వార్షిక బడ్జెట్‌పై హోం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీసు వ్యవస్థను ఆధునీకరించడమే లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల రాకను వేగవంతం చేయాలని, నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు ఏపీఎస్‌పీ.,ఇతర విభాగాల అవసరాలపై కూడా చర్చించారు. పోలీస్ సిబ్బంది పనితీరును మెరుగుపరచేందుకు అవసరమైన వనరులు, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పోలీసు వాహనాలు,

క్వార్టర్లు ఇతరంశాలపైన సమావేశంలో చర్చించారు.ఈ సమావేశంలో ఏ డి జి పి మధుసూదన్ రెడ్డి, ఐజీ రవిప్రకాష్, స్పెషల్ సెక్రటరీ విజయకుమార్, ఈగల్ విభాగం డైరెక్టర్ ఐజీ రవికృష్ణ, ఐజీ రాజకుమారి, ఏపీఎస్పీపి, డి ఐ జి సత్యయేసుబాబు తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో 12 ప్రాంతాల్లో 1050 ఎలక్ట్రికల్ బస్సులు

## - ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమలరావు

**శ్రీకాకుళం, జనవరి 22 ప్రభాతవార్త** రాష్ట్రంలో త్వరలో 12 ప్రాంతాల్లో 1050 నూతన ఎలక్ట్రికల్ బస్సులను తీసుకు రావడం జరుగుతుందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని అనంతరం శ్రీకాకుళం బస్ స్టేషన్ మరియు శ్రీకాకుళం రెండవ డిపోలను సందర్శించినారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం రెండవ డిపో గ్యారేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకంపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఆధునిక బస్సులను తీసుకోవడంతో పాటు బస్ స్టేషన్లను ఆధునీకరించనున్నామన్నారు. బస్సుల్లో ఆకుపెన్సి రేషియోను పెంచి ఆదాయాన్ని పెంచే విధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) అందవరపు అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయనగరం జోన్1 విజయ గీత.

# నంద్యాల లో ఘోర ప్రమాదం - ముగ్గురు సజీవదహనం

## నెల్లూరు నుండి హైదరాబాదు వెళ్లుతుండగా ప్రమాదం - 15 మందికి గాయాలు 21మంది సేఫ్

**నంద్యాల, జనవరి 22,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల జిల్లా శిరువెల్ల మెట్ల వద్ద ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ట్రావెల్ బస్సు టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ స్పాట్‌లోనే మృతి చెందారు. ఏఆర్‌బీసీవీఆర్ ట్రావెల్స్ బస్ నెల్లూరు నుంచి హైదరాబాద్ వస్తున్నప్పుడు ప్రమాదానికి గురైంది. ప్రమాదం సమయంలో బస్‌లో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. అర్ధరాత్రి నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం శిరివెళ్లమెట్ట వద్దకు వచ్చేసరికి ఘోరం జరిగింది. చాలా వేగంగా వెళ్తున్న బస్సు టైరు పేలడంతో దాన్ని డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో డివైడర్‌ను దాటి అవతలివైపునకు దూసుకెళ్లింది.. డివైడర్‌ను దాటిన బస్సు అవతలి రూట్‌లో వస్తున్న కంటైనర్‌ను ఢీ కొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో ట్రావెల్ బస్సు డ్రైవర్, లారీ డ్రైవర్, లారీ క్లీనర్ స్పాట్‌లోనే మృతి చెందారు. ప్రమాదాన్ని గమనించిన మరికొన్ని వాహనాల డ్రైవర్లు, ఇతరులు పరుగుపరుగున వచ్చి బస్సు అద్దాలు పగలగొట్టారు.అందులో ఉన్న ప్రయాణికులను రక్షించారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు లో మంటలు వ్యాపించాయి. అవి పూర్తిగా బస్సు లో వ్యాపించక ముందే ప్రయాణికులను రక్షించారు. దీంతో వారంతా ప్రాణాలతో బయటపడ్డారు.



వారంతా బస్ నుంచి దిగిన వెంటనే బస్సు , లారీ రెండూ కూడా పూర్తిగా అగ్నికి ఆహుతైపోయాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు బస్ నుంచి దూకిన పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్ పరిశీలించారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్ ప్రమాదం గురించి తెలుసుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల్లో కొందరు ఇదే ట్రోమాలో ఉన్నారని చెప్పారు. వారంతా కోలుకునే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

# సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు!

**విజయవాడ.జనవరి22,ప్రభాతవార్తప్రతినిధి:** సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ పరంగా టెట్ మినహాయింపు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయ రాజు, ఎస్ చిరంజీవి సచివాలయంలో బుధవారం కలిశారు. శశిధర్‌తో చర్చించిన అంశాలను వారు మీడియాకు విడుదల చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రభుత్వపరంగా మినహాయింపు చర్యలు తీసుకోవాలని శశిధర్‌ను కోరారు. పదో తరగతి 100 రోజుల ప్రణాళికలో ఉన్న లోపాలను వివరించారు. టెట్‌పై ప్రభుత్వపరంగా సుప్రీంకోర్టులో ఇప్పటికే రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని శశిధర్ నాయకులకు వివరించారు. ప్రభుత్వ పరంగా కూడా మినహాయింపు ఇచ్చే అంశంపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అందరం కలిసి కృషి చేద్దామన్నారు.

# శివనామస్మరణతో మారు మోగాలి: ప్లెక్సీలకు స్వస్తి చెప్పండి

## సామాన్యభక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకోండి - అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి: సమీక్ష సమావేశంలో కలెక్టర్

**శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త** భారత దేశంలోని పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్య క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్వహించాలని తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ సూచించారు. వచ్చేనెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షా సమావేశం బ్రహ్మాగుడి ఆవరణలో ఏర్పాటు చేసారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, ఎఎస్పి రవిమనోహారాచారి,ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి,ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా మహాశివరాత్రి పర్వదినాన సామాన్యభక్తులకు సుదర్శనం కల్పించాలన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అందుకుతగ్గట్టు క్యూలైన్లను ఏర్పాటు చేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గత ఏడాది శాఖల మధ్య సమన్వయంతో బ్రహ్మోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేసారు.అందుకు అభినందించారు. పట్టణమంతా 'శివనామస్మరణతో మారుమోగాలి' అని కలెక్టర్ సూచించారు. ఉత్సవాల రోజులు ఫ్లెక్సీల సంప్రదాయానికి స్వస్తి చెప్పటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఇక బాల్యవివాహాలను జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.మంచి వాతావరణంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా పటిష్ట బందోబస్తును రూపకల్పన చేసుకొని ఆచరించాలని ఎస్పి సుబ్బరాయుడు సూచించారు. ఏ ఉత్సవాలైనా విజయవంతం కావాలంటే ఒక్కశాఖ పనిని చేస్తే సరిపోదని అందరు కలసి కట్టుగా పని చేస్తేనే సాధ్యమౌతుందన్నారు. దేవస్థానం తరఫున వివిధ శాఖలకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అన్నారు.



సమావేశం అనంతరం నాయకులు,అధికారులు

# తిరుమల సమాచారం

## నేడు వసంత పంచమి శాస్త్రోక్తంగా వార్షిక విశేషపూజ

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంతపంచమి పర్వదినాన నేటిఉదయం వార్షిక విశేషపూజ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది వసంతపంచమి పర్వదినాన ఈ పూజను సర్కార్(ఏకాంతంగా)టిటిడి నిర్వహించనుంది. గతంలో ప్రతి సోమవారం ఉదయం దేవదేవుని ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి విశేషపూజ ,స్నపనతిరుమంజనం జరిపించేవారు. ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలని జీయంగార్లు,అర్చకులు, ఆగమపండితుల సూచనలతో ఏడాదికోసారి జరిపించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ విశేషపూజను శ్రీవారి ఆలయంలోని కల్యాణ మండపంలో వైభవంగా వేదోక్తంగా నిర్వహిస్తారు, చతుర్ధశ కళశావాహనంతో పుణ్యాహవచనం, వివిధ క్రతువులను నిర్వహి స్తారు. అనంతరం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగియనుంది.



## సంక్షేమ పథకాలు పరిపూర్ణంగా అమలవుతున్నాయి

### - తిరుమలలో అసెంబ్లీ కమిటీ ఛైర్‌పర్సన్ గౌరుచరిత



**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేస్తున్న స్త్రీశిశు,వృద్దుల సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయని శాసనసభ సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ,ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం అయ్యాయని, పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం బావుందన్నారు. తిరుపతి జిల్లాలో సంక్షేమ పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయన్నారు. అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నారని ఆమె అభినందించారు. గురువారం ఉదయం అసెంబ్లీ కమిటీ ఛైర్‌పర్సన్ చరితారెడ్డి, సభ్యులు ఎమ్మెల్యేలు గల్లామాధవి, విజయశ్రీ, పల్లె సింధూరరెడ్డి, నాగమాధవి, సత్యప్రభ,కల్పలత, గ్రీష్మప్రసాద్ తదితరులు తిరుమలకు వచ్చారు. విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.10లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు,ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. గురువారం చిత్తూరుకు చెందిన చింతల దివ్యాంత్‌రెడ్డి 10లక్షలు రూపాయలు విరాళాల డిడిని టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.



## మంత్రి నారాలోకేశ్ పేరున అన్నప్రసాద వితరణకు రూ.44లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశంపార్టీజాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన పేరున తిరుమలలో అన్నప్రసాదం వితరణ జరగనుంది. శ్రీవారి భక్తులకు ఒకరోజు పూర్తిగా అన్నప్రసాదానికి అవసరమైన 44లక్షల రూపాయలు విరాళాల డిడిని గురువారం సాయంత్రం భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్‌ను కలసిన దాత నేడు ఒకరోజు అన్నప్రసాదం నారాలోకేశ్ పేరున చేయించాలని కోరారు.



## దేవుని ఆశీస్సులతో అంతా శుభాలు జరగాలి - శ్రీవారిసేవలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం తిరుమలకు విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో హిమాచల్‌ప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ అనిల్‌శర్మ సభ్యులు, సినీనటి సన, తెలంగాణ ఎమ్మెల్యే యాదయ్య, సినీనటుడు ఘట్టమనేని జయకృష్ణ వేర్వేరుగా ఆలయం మహాద్వారం వద్దకు చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికిశ్రీవారి దర్శనం చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్ని రకాల సేవలకు సిద్ధం

### - భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు - మాడవీధులు తనిఖీ చేసిన ఛైర్మన్ నాయుడు

**తిరుమల,జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఒకరోజు ఏడువాహనసేవలు జరగనున్న అర్ధబ్రహ్మోత్సవంకు అన్ని రకాలుగా భక్తులకు సేవలందించేందుకు టిటిడి అధికారులు, జిల్లా పోలీసుయంత్రాంగం, అన్ని విభాగాలు సిద్ధమయ్యారని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. 25వతేదీ ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో వేచివుండే భక్తులకు అసౌకర్యం లేకుండా స్వామివారి దర్శనంతోబాటు మాఢవీధుల్లో వాహనసేవల వీక్షణను ప్రశాంతంగా ఏర్పాట్లు చేశామన్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. గ్యాలరీల్లో, క్యూలైన్లలో భక్తుల తోపులాటలు, తొక్కిసలాటలకు అవకాశం లేకుండా నిరంతరాయంగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. తిరుమలలో అనేక చోట్ల పార్కింగ్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో వాహనసేవల వీక్షణకు 1.25లక్షలమంది భక్తులు ఉంటారని, వారికి అన్ని విధాలా టిటిడి విజిలెన్స్, ఆరోగ్యవిభాగం, పోలీసులు సేవలందిస్తారన్నారు.ఎక్కువమంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించాలనే ఉద్దేశ్యంతో తిరుపతిలో 24వతేదీ నుండి 26వరకు స్లాటెడ్ సర్వదర్శనాలు టోకెన్లు జారీ రద్దుచేశామన్నారు. 1,300మంది పోలీసులు, 1,200మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. భక్తులు టిటిడిసూచనలు పాటించాలని ఆయన కోరారు. గురువారం సాయంత్రం అన్నమయ్యభవనంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇతర అధికారులతో కలసి మీడియాతో ఏర్పాట్లు వివరాలు వెల్లడించారు.



# శారదా జయంతి శ్రీ పంచమి



'శ్రీ' అనే శబ్దం శక్తి స్వరూపాన్ని వివరిస్తుంది. 'విద్' ధాతువునుండి విద్యాశబ్దం ఏర్పడుతోంది మరియు దీని ముఖ్యార్థం జ్ఞానముగా చెప్పు కోవచ్చును. జ్ఞానాన్ని పరబ్రహ్మ రూపంగా కూడా చెప్పుకోవచ్చును. సకల శుభకార్యము లందు **"దేవీం వాచమజనయన్త దేవాః"** అనే ఋగ్వేదమంత్రంతో ప్రారంభిస్తారు. అంటే శుభ కార్యక్రమానికి ముందుగా వాక్కునకు నమస్కరిస్తారు. ఉచ్ఛారణా దోషాలు కలుగకుండా ప్రార్థన చేస్తారు. ఉచ్ఛారణా దోషాలు లేని వాక్కు అద్భుత ఫలితానిస్తుంది. పరమాత్మ తత్వాన్ని గ్రహించటానికి పర మాత్మ జ్ఞానము అవసరం. జ్ఞాన సముపార్జ నకు మానసిక ఏకాగ్రత ముఖ్యము. మానసిక ఏకాగ్రతకు ధ్యానము ప్రధానము. ధ్యానానికి విద్య మూలం. విద్య అంతర్ముఖ, బహిర్ముఖ ఉద్దీపన కలుగచేస్తుంది. సక కళలకు, విద్యకు అధిదేవత శ్రీసరస్వతీదేవి. వివిధ పురాణాలలో సరస్వతీ ఆవిర్భావం గురించి వివిధ కథనాలు కనబడతాయి. గాయత్రీ ఉపాసలో కూడా సరస్వతీదేవి ప్రస్తావన కనబడుతుంది. సరస్వతీదేవిని గాయత్రిమాతగా భావిస్తూ ప్రార్థన చేస్తారు. **"సర్వవర్ణే మహాదేవి సన్ధ్యావిద్యే సరస్వతి", 'సరస్వతీ మావాహయామి....", "సరస్వ త్యై నమః....."** అంటూ నమస్కరిస్తారు."సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి, విద్యారంభం కరిష్యామి." అంటూ విధ్యా భ్యాసము ప్రారంభిస్తారు. అగ్నికార్యక్రమాలలో సరస్వతీదేవి ప్రార్థన కనిపిస్తుంది. ఋగ్వేదంలో కూడా సరస్వతీదేవి ప్రస్తావన కలదు. ఈ విధంగా సరస్వతీదేవి ప్రస్తావన అన్ని జ్ఞాన సముపార్జన కార్యక్రమాలలో, పితృకార్యములలో, దేవతా పూజా విధానాలలో కనిపిస్తుంది. సరస్వతీ కటాక్షం లేకుండా ఎటువంటి జ్ఞాన సముపార్జన జరుగదు. జ్ఞానసము పార్జన లేని జీవితం వ్యర్థ మోతుంది.సరస్వతీదేవి పరమసాత్వికమూర్తి. ఆమె వీణ ధరించి, పుస్తకం చేబూని, హంసవాహనముపై ధవళ వస్త్రాలం కరణలో, నిర్మలం గా, ప్రశాంతంగా దర్శనమిస్తుంది. "హంస"ను పరబ్రహ్మంగా కీర్తిస్తారు. పదకవితా పితామహుడైన అన్నమాచార్యుడు శ్రీవేంకటేశ్వరుని హంసగా అభివర్ణిస్తాడు.

'దిబ్బలువెట్టుచు దేలినదిదివో
ఉబ్బునీటిపై నొక
హంసా"
"పాలు నీరు
నేర్పరచి పాల లో నోలాడె నిదె
వొకహంసా"అంటా సంకీర్తన

ఆలపించాడు.హంసకు పాల నుండి నీటిని వేరుపరచే అద్భుత మైన శక్తివుంది. అంటే మంచిని గ్రహించి, చెడును విస్మరించటం అని దీని అర్థం. "సరస్వతి" అనే పదం "తనను తాను తెలుసుకునే శక్తి" అని కూడా చెప్పవచ్చును. ఈ శక్తి జ్ఞానులకు మాత్రమే సాధ్యం. అటు వంటి జ్ఞానానికి, సర్వ కళలకు అధిదేవ్కతైన శ్రీసరస్వతీ దేవి మాఘ శుద్ధ పంచమినాడు జన్మించినట్లుగా చెబు తారు. మాఘమాసం శిశిర ఋతువులో వచ్చినప్పటికి, వసంత ఋతువుకు స్వాగత సన్నాహాలు ప్రారంభమవుతాయి. ఇదే రోజును శ్రీపంచమి గాను, మదనపంచమిగాను, వసంతపంచమిగాను కూడా జరుపు కుంటారు. సర స్వతీదేవిని బ్రహ్మ తనకు తోడుగా ఉండటానికి సృజించాడని, విష్ణువు సృజించాడని విష్ణుపురాణంలోను, దుర్గామాత సృజించినదని దేవీభాగ వతంలోను కనబడుతుంది. ఏది ఏమైనా సరస్వతి దేవి చదువుకు, జ్ఞానానికి అధిష్ఠాన దేవత. అందు వలన ఆదేవి సకల చరాచర బ్రహ్మాండ ములో పూజలందుకుంటున్నది. వసంతపంచమి రోజున వయోబేధం లేకుండా అందరూ సరస్వతీ పూజలు చేస్తారు. ముఖ్యంగా పిల్లలచేత పూజలు నిర్విహిస్తారు. దీనివలన వారికి మంచి విద్యాబుద్ధులు అలవడ˘తాయని నమ్మిక. ఉదయాన్నే కాలకృత్యాలు నెరవేర్చుకుని, అభ్యంగ నస్నాన మాచరించి, మంచి దుస్తులు ధరించాలి. గృహము ను మామిడి ఆకులతో, ఫలపుష్పాలతో అలంకరించాలి. పూజా గృహమును కూడా శోభ˘స్కరంగా అలంకరించాలి. సరస్వతీదేవిని ఉచితా సనముపై ప్రతిష్ఠించి, సుగంధ ద్రవ్యముతో అభిషే కించి, చక్కని వస్త్రాలంకృతిని చేసి, తాజా పుష్పములతోను, మంచి గంధముతోను, ధూప దీపములతో షోడశోపచారములతో పూజనిర్వ హించాలి. పూజలో పిల్లల యొక్క పుస్తకములు, కలము మొదలగు వాటిని ఉంచి పూజ చేయాలి. తరువాత ఆమెకు ప్రీతిపాత్రమైన మధుర పదార్థములు నివేదనచేసి, నీరాజన మంత్ర పుష్పములు సమర్పించాలి. సకల విద్యలు అలవడుటకై భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేయాలి. ఇదే రోజున పిల్లల చేత అక్షరాభ్యాసము కూడా చేయిస్తారు. తోటి పిల్లలకు పలకలు , పెన్సిళ్ళు వంటి పంచిపెడ తారు. ఈ విధివిధానము వలన సరస్వతీదేవి కరుణించి చల్లని చూపుల తో అనుగ్రహిస్తుంది.సరస్వతీదేవి కరుణతో విశేష జ్ఞానము, వాక్శుద్ధి, మంత్రసిద్ధి, జ్ఞానసిద్ధి, ధారణాసిద్ధి, మేధాసిద్ధి కలిగి సర్వత్రా జయప్రదం కావాలని ఆకాంక్షి స్తూ ప్రార్థన చేద్దాం.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తూ..



**బిడ్డ పుట్టిన 14 రోజులకే ఆమె జీవన పోరాటం మొదలైంది. శారీరక, మానసిక సంఘర్షణలతో కుమిలిపోలేదామె. పరిస్థితు లతో పోరాడటం నేర్చుకుంది. తన కాళ్లమీద తను నిలబడటమే కాకుండా... తనలాంటి నిస్సహాయ మహిళలకు చేయూతనిస్తోంది కారుణ్య గుణవతి. ఆమె గురించి తెలుసుకుందాం..**

సమస్యల నుంచే చాలాసార్లు పాఠాలు నేర్చుకుంటాం. అవే భవిష్యత్తులో మన తీరు తెన్నులు ఎలా ఉండాలో నిర్దేశిస్తాయి. నాన్న .. ఓ వర్క్‌షాప్‌లో పనిచేసేవారు. అమ్మ మేము ఇద్దరం పిల్లలు. నాన్న జీతంతోనే ఇల్లు గడిచేది. దాంతో చదువుకోవడానికి కష్టమైంది. పదో తరగతి పూర్తవుతూనే నేను పార్ట్ టైం ఉద్యోగాల కోసం వెతకడం మొదలుపెట్టా. కానీ మేము ఉండే ప్రాంతంలో ఉద్యోగావకాశాలు చాలా తక్కువ. ఆడపిల్లల్ని చేర్చుకోవడమూ అరుదే. అందుకే ట్యూషన్లు చెబుతూ చదువుకునేదాన్ని. అలా బీఈ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేశా. ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రెజెంటేషన్ ఉద్యోగం సంపాదించా.. కెరియర్లో వృద్ధి కోసం దూరవిద్యలో ఎంబీఏ కూడా పూర్తిచేశా.


**అంకుర స్థాపన...** పని, చదువు ఇవే లోకంగా గడిపా. అంత లోనే పెళ్లి అన్నారు. బాధ్యత కదా అని పెళ్లికి ఒప్పుకొన్నా. అది మొదలు అన్నీ సమస్యలే. ఆర్థికంగా ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నా కారుణ్య ప్రసవమైన 14 రోజులకే ఉద్యోగ వేటలో పడ్డాను. అన్నీ విఫలయత్నాలే. అయినా పట్టుగా 2021లో 'రఫెల్ క్రియేటివ్స్' అంకురాన్ని స్థాపించి... కంపెనీలు, ఉత్పత్తుల కు బ్రాండింగ్, మన తీర మార్కెటింగ్, ప్రాడక్ట్ రీచ్ వాటిల్లో సేవలందించడం మొదలుపెట్టా. రెండు సెకండ్ హ్యాండ్ నా విషం ల్యాప్‌టాప్‌లతో, ఇద్దరు విని యోగదార్లతో నా ప్రయాణం మొద˘లైంది. శారీరకంగా, మానసికంగా గడవకముందే విదేశీ క్లయింట్లను సంపాదించుకునే స్థాయికి చేరుకున్నారు. ఇప్పుడు నెలకు రూ.4 -5 లక్షలు సంపాదిస్తున్నా, ప్రస్తుతం రఫెల్ క్రియేటివ్స్‌కి 500మంది స్థిర వినియోగ దార్లు ఉన్నారు. 15 మందికి ఉపధి కల్పిస్తున్నా.



**ఊహించని మలుపు...**మా చుట్టు పక్కల గ్రామాల్లో ఉపాధి కోసం బిడి చుట్టే మపిళలు ఎక్కువ. మా పిన్ని కూడా ఆ పనే చేసేవారు. టిబి సోకి చాలా ఇబ్బందులు పడ్డారామె. దాంతో ఈ రంగంలో ఉన్న ఉద్యోగం మహిళలకు సహాయం చేయాలని నిశ్చయించుకున్నా వాళ్లకి అవగాహన కల్పించడానికి వాయిస్ అప్ తెనాకాశీ అనే సంస్థలో భాగమయ్యి, దీనిద్వారా చుట్టుపక్కల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం మొదలు˘ ఎట్టారు. అయితే, ఈ పని వాళ్లకి ఉపాధి, మరో ప్రత్యామ్నాయం చూపిస్తేనే కదా... వాళ్లూ చేయకుండా ఉండేది.

అందుకే 2023 నుంచి స్థానిక మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రారంభించాం.' కొట్రవై' అనే సంస్థను స్థాపించి దానిని నిర్వహించడం ప్రారంభించాం. ఇది నాకు అదనపు భారం అవుతుందని తెలుసు! కానీ మహిళలు, అమ్మాయిలు ఆర్థిక సాధికారత సాధించాలనే లక్ష్యంతో పనిచేయడం మొదలుపెట్టా. ఓ రకంగా మల్టీ టాస్కింగ్ కూడా కాదు. అంతకన్నా ఎక్కువగానే పనిచేశా. శిక్షణలోనూ స్టైపెండ్ రూపంలో కొంత మొత్తం ఇస్తున్నాం. దాంతో మహిళలకు ఆర్థిక భారం తగ్గి దృష్టి కేంద్రీకరించగలుగు తున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో టెంకాయ చిప్పలతో గృహాలంకరణ వస్తువులు, టెర్రాకోట నగలు, హెల్త్ మిక్స్ లాంటి ఆహార ఉత్పత్తులు, అద్దాల ఫ్రేములు, వాటర్ బాటిళ్లు తయారుచేస్తున్నారు. వీట నిర్వహిస్తున్న మా వెబ్‌సైట్ ద్వారా అమ్ముతున్నాం. విదేశాలకీ ఎగుమతులు చేస్తున్నాం. ఈ సేవల్ని ఇంకా విస్తరించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నా .

# పాప్‌కార్న్ సులువుగా ..



సినిమాకి వెళ్లాలంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే లేదంటే.. ఏదో వెలితిగా, చక్కగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు. సాగినట్లవుతాయి. అంత కంటే ముఖ్యంగా.. అవి నిలవుండేం దుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ! ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి. ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషం పాటు ఉంచితే సరి. ఘుమఘుమలాడే వేడి వేడి పాప్‌కార్న్ సిద్ధం. ఇక తిని ఆనందించడమే తరువాయి.

# మొటిమలు కనిపించకుండా..



ముఖం మీద మొటిమలను దాచడానికి మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. లేదంటే మొటిమలు మరింత స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంది. మొటిమలను దాచే మేకప్ మెలకువలు ఇవే!

**మాయిశ్చరైజర్:** మేకప్ చర్మం మీద సమంగా అంటుకోవాలంటే, మొదట ముఖాన్ని శుభ్రంగా కడిగి, మాయిశ్చరైజర్ పూసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు మాయిశ్చరైజర్ వాడకూడదు.

**ప్రైమర్:** మేక్‌పకు ముందు అనుసరించవలసిన చిట్కా ఇది. మేకప్ ఉత్పత్తులు చర్మంలోకి ఇంకిపోకుండా ప్రైమర్ తోడ్పడు తుంది. హెచ్చుతగ్గులు లేకుండా మేకప్ చర్మం మీద పరుచుకోవడానికి వీలుగా, ప్రైమర్ చర్మాన్ని సిద్ధం చేస్తుంది.

**కరెక్టర్:** మొటిమలను కరెక్టర్‌తో కనిపించకుండా చేయవచ్చు. ఇందుకోసం ఎర్రగా ఉండే మొటిమల మీద ఆకుపచ్చని కరెక్టర్ అద్ది, పైన కన్‌సీలర్ అద్దుకోవాలి. ఇలా చేయడంవల్ల మొటిమ ఎరుపు రంగు తగ్గి, చర్మంలో కలిసిపోతుంది. మొటిమ ఎరుపు రంగులో లేకపోతే, నేరుగా కన్‌సీలర్‌నే అద్దవచ్చు. కన్‌సీలర్‌ను మొటిమ మీద అద్దాలే తప్ప, రుద్దకూడదు.

**మేపక్ సెట్టింగ్:** ఫౌండేషన్ పూసుకున్న తర్వాత కొన్ని నిమిషా లు ఆగాలి. ఆ తర్వాత ప్రెస్‌డ్ లేదా లూజ్ పౌడర్‌ను అద్దుకోవాలి. తర్వాత ఫినిషింగ్ స్ప్రే కూడా వాడుకోవచ్చు.

**మచ్చలను దాచాలంటే... :** ఫేస్ ప్రైమర్‌తో మేకప్ మొదలు పెట్టాలి. తర్వాత ప్రైమర్, కన్‌సీలర్, అంతిమంగా ఫౌండేషన్, లూజ్ పౌడర్ వాడాలి. మచ్చలు నల్లగా లేదా ఎర్రగా ఉంటే, కలర్ కరెక్టర్‌ను వాడుకోవచ్చు.

# ఎగ్‌ప్లాంట్ పిజ్జా



కావలసిన పదార్థాలు
ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, లివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

తయారీ విధానం: ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం.

# 'హ్యాపీ రాజ్' ప్రోమో విడుదల



అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి సినీ వర్గాల్లో చర్చల్లో నిలుస్తున్న చిత్రం˘హ్యాపీ రాజ్. ప్రమోషన్స్ పరంగా వినూత్నంగా వెళ్తున్న చిత్ర యూనిట్ తాజాగా అధికారిక ప్రోమో విడుదల చేసింది. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ చేతుల మీదుగా విడుదలైన తెలుగు ప్రోమో.. సినిమా స్టోరీ ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పేసింది. డిఫరెంట్ స్టైల్ మేకింగ్ తో విడుదలైన కొద్ది సమయంలోనే సోషల్ మీడియా వేదికలో ఈ వీడియో వైరల్ అయింది. జయవర్ధన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, బియాండ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఫీల్‌గుడ్ ఎంటం˘టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రోమోలో కనిపించే ప్రతి ఫ్రేమ్ కూడా వైవిధ్యంతో కూడి ఉండి ఆకర్షిస్తోంది. సినిమాలో జీవీ ప్రకాశ్ కుమార్‌టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. రిఫ్రెషింగ్ విజువల్స్, లైట్ హ్యూమర్, హాయిగా సాగే టోన్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మంచి సినిమా అనుభూతిని అందించబోతోందనే నమ్మకాన్ని ప్రోమో బలంగా ఆసక్తికరమైన టైటిల్

తెర

# "హాలో ఇట్స్ మీ" టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ, నేను షగ్నతో గతంలో ఓ షార్ట్ ఫిలిం చేశాను. అందులో నాది ఆమెకు ఫాదర్ రోల్. అప్పటి నుంచి డాడీ అని పిలుస్తుంటుంది. ఈ చిత్రంలో మంచి క్యారెక్టర్‌లో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. మా తల్లిదండ్రి రాజశేఖర్ అని పేరు పెడితే, ఈ కళామతల్లి శుభోదయం సుబ్బారావు అనే పేరు పెట్టింది. అన్నారు. నటుడు డా. భద్రమ్ మాట్లాడుతూ, హలో ఇట్స్ మీ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది. వరుణ్ సందేశ్‌తో నేను గతంలో నింద అనే మూవీలో నటించాను. ఆయన పర్ ఫార్మెన్స్‌కు ఆశ్చర్యపోయాను. ఈ సినిమాలో కూడా ఆయన నటనకు పేరొస్తుంది అన్నారు. నటి నందిని మాట్లాడుతూ నటిగా నా ఫస్ట్ మూవీ ఇది. తొలి చిత్రమే నా ఫేవరేట్ హీరో వరుణ్ సందేశ్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. డీవోపీ బ్రహ్మతేజ మరిపూడి మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని షగ్న అన్నీ తానై వన్ మ్యాన్ ఆర్మీలా రూపొందించింది.. ప్రొడ్యూసర్ సందీప్ మాట్లాడుతూ, షగ్న హీరోయిన్‌గా, దర్శకురాలిగా ఈ మూవీకోసం చాలా కష్టపడింది. హీరోయిన్‌గా తన క్యారెక్టర్ పర్ఫార్మ్ చేస్తూనే, సినిమాను డైరెక్ట్ చేయడం అంటే సులువు కాదు. వరుణ్‌ని మేము ఇష్ట పడతాం. ఆయన ప్రాజెక్ట్ లోకి వచ్చాక మా ఎగ్జైట్ మెంట్ రెట్టింపు అయ్యింది.నింద దర్శకుడు రాజేశ్ జగన్నాథం మాట్లాడుతూ, ఒక యంగ్ హీరోయిన్ తనునటిస్తూ, దర్శకత్వం చేయడం చాలా అరుదు. షగ్నను మనమంతా అప్రిషియేట్ చేయాలి.సంజీవ్, సందీప్, సంకీర్త్ ఎంతో ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. వాళ్లతో నేను ఆత్రేయపురం బ్రదర్స్ అనే సినిమా చేస్తున్నాను. హీరోయిన్, డైరెక్టర్ షగ్న శ్రీ వేణున్ మాట్లాడుతూ డైరెక్టర్‌గా ఇది నా మొదటి సినిమా. మంచి కథా కథనాలతో సినిమా చేస్తున్నాను. ప్రతి అబ్బాయి, అమ్మాయికి ఈ మూవీ రిలేట్ అవుతుందని అన్నారు. హీరోవరుణ్ సందేశ్ మాట్లాడుతూ, నా రీసెంట్ ప్రాజెక్ట్ నయనం అందరి ఆదరణ పొందుతోంది. ఇటీవల వరుసగా థ్రిల్లర్స్ చేస్తూ వస్తున్నాను. అలాంటి టైమ్‌లో హాలోఇట్స్‌మీతో ఒక మంచి ఫ్యామిలీ, లవ్ మూవీ చేస్తున్నాను. ఇది క్లీన్ ఫ్యామిలీ మూవీ. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనేది షగ్న బ్యూటిఫుల్ గా ఈమూవీలో చూపించారని అన్నారు.

# 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



నాలుగు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణంలో మెగాస్టార్ చిరంజీవి ఎన్నో సంచలనాలు సృష్టించారు. తాజాగా ఖమన శంకర వరప్రసాద్ గారుఖతో మరోసారి సరికొత్త రికార్డులు నెలకొల్పారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం, సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ప్రత్యేకపాత్ర పోషించడం విశేషం. మెగా అభిమానులతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా మలిచిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపి స్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్,'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. "మెగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారికి, అలాగే 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర యూనిట్ మొత్తానికి హృదయ పూర్వక శుభాకాంక్షలు.నాలుగు దశాబ్దాలకు పైగా చిరంజీవి గారు ప్రజల హృదయాలకు అత్యంత దగ్గరగా నిలుస్తూ.. అదే తపన, అదే ఉత్సాహంతో తన నటన, హాస్యం, నృత్యాల ద్వారా ప్రేక్షకులను నిరంతరం అలరిస్తున్నారు. ఆయన అద్భుతమైన సినీ ప్రస్థానంలో ఇది మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది.



# అడవి శేష్ 'డెకాయిట్' షూటింగ్ పూర్తి


వరుస బ్లాక్‌బస్టర్‌లతో దూసుకు పోతున్న అడవి శేష్ ఇప్పుడు తన ప్రతిష్టాత్మకమైన చిత్రం 'డకాయిట్'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. తాజాగా మృణాల్ ఠాకూర్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఒక భారీ షెడ్యూల్‌లో తన షూటింగ్ ఫినిష్ చేశారు. చిత్ర బృందం ఆమెకు ఘనంగా సెండ్ అఫ్ ఇచ్చింది, ఆమె అన్ని ప్రమోష నల్ యాక్టివిటీస్ భాగమవుతారు. ఆమె తన పాత్రకు తెలుగు, హిందీ రెండు భాషలలో డబ్బింగ్ కూడా చెబుతున్నారు.ఇటీవల, చిత్ర నిర్మాతలు రిలీజ్ చేసిన సినిమా టీజర్ కు అద్భుతమైన స్పందన లభించింది. శేష్ డిఫరెంట్ అవతార్, రఫ్ లుక్‌ల, మాస్ యాటిట్యూడ్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. మృణాల్ ఠాకూర్ మార్చి 19న తెలుగు, హిందీలో థియేటర్లలో రిలీజ్



# ఆత్రేయపురం బ్రదర్స్ మూవీ ప్రారంభం

ఒక్కప్పటిలా లేవు రోజులు.. ట్రెండ్ మారింది. అందుకు తగ్గట్టుగా ఆడియన్స్ ఆలోచనలు, టేస్ట్ కూడా మారిపోయాయి. కాబట్టి ప్రేక్షకులు కనెక్ట్ అయ్యే కొత్త కొత్త కథలతోనే మేకర్స్ సినిమాలు ప్లాన్ చేస్తున్నారు. అలాంటి ఓ వైవిధ్యభరితమైన స్టోరీ తీసుకొని, ఇప్పటితరం ఆడియన్స్ కోరుకునే అన్ని అంశాలతో ఆత్రేయపురం బ్రదర్స్ అనే సినిమా రూపొందిస్తున్నారు డైరెక్టర్ రాజేష్ జగన్నాధం. '2' సినిమాస్, ది ఫెర్వేంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్లపై VSK సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్, ప్రవీణ్ గద్దె, రాజేష్ గద్దె,రాకేష్ గద్దె నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాజీవ్ కనకాల,గవిరెడ్డి, సన్నీ పత్సా, రఘు బాబు, గీత్ సాయిని, నేహా పఠాన్, సిద్దార్థ్ గొల్లపూడి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమా పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ వశిష్ట, డైరెక్టర్ అనుదీప్, డైరెక్టర్ ఆదిత్య హాసన్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి వశిష్ట క్లాప్ కొట్టగా..

# 'పేట రౌడీ' బర్త్‌డే పోస్టర్ లాంచ్



వీకే క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్-2గా తెరకెక్కుతున్న చిత్రం˘పేట రౌడీ. ఇటీవల ఈ చిత్రాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. మాక్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కళ్యాణి కర్తనాథ నిర్మిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మాస్ లవ్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.హీరో చంటి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన స్పెషల్ బర్త్‌డే పోస్టర్‌ను ఆనంద్ గ్రూప్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎల్. ఆనంద్ కుమార్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ఫైట్ సీక్వెన్స్ షూటింగ్ పూర్తయ్యిందని, త్వరలోనే మూవీ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది.ఈ చిత్రానికి అదనపు స్క్రీన్‌ప్లే కేవీర్ అందించగా, మాటలు-పాటలు భాష్యశ్రీ రాశారు. సినిమాటోగ్రఫీని వై.ఎస్. కృష్ణ నిర్వహిస్తు న్నారు. లైన్ ప్రొడ్యూసర్లుగా ఇటీకర్లపల్లి మహేష్ కుమార్, దంతు లూరి పృథ్వీరాజ్ వ్యవహరి స్తున్నారు. ఫైట్ మాస్టర్‌గా : జాషువ, ఎడిటర్ : శివ శర్వాణి పీఆర్‌ఓగా గణేష్ పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకుపోతున్న అల్కరాజ్

## బాంబ్రీ జోడీ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రపంచ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో యానిక్ హాన్‌ఫ్‌మాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన 78 నిమిషాల ప్రారంభ సెట్‌లో బ్రేక్ డౌన్ నుండి బయటపడి తన రెండవ వరుస సెట్ల విజయాన్ని నమోదు చేశాడు. ఇదే సమయంలో మిక్స్‌డ్ డబుల్స్‌లో యుకీ భాంబ్రి జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. అల్కరాజ్ గురువారం మెల్‌బోర్న్‌లో హాన్ఫ్‌మాన్‌పై 2 గంటల 44 నిమిషాల్లో 7-6 (4), 6-3, 6-2 తేడాతో తన రెండవ విజయాన్ని సాధించాడు. హాన్ఫ్‌మాన్ మొదటి సెట్‌లో 3-1తో ఆధిక్యంలో ఉండి, 5-5తో రెండు బ్రేక్ పాయింట్లోతో ఉండగా, అల్కరాజ్ తన కెరీర్‌లో అత్యంత కఠినమైన మొదటి సెట్‌ను ఆడాడు. తరువాత రాడ్ లావర్ అరీనాలో అల్కరాజ్ నాలుగు వరుస పాయింట్లను సాధించే ముందు టైబ్రేక్‌లో 4/3 ఆధిక్యాన్ని సాధించాడు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన భాంబ్రీ-నికోల్ మెలిచార్ మార్టినెజ్ జోడీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. ఈ ఇండోఅమెరికన్ ద్వయం ఆరో సీడ్ టిమ్ పుట్జ్-జాంగ్ షుయ్ జోడీపై 4-6, (3) 6-7 తేడాతో ఓడిపోయింది. ఇక శ్రీరామ్ బాలాజీ కూడా పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌కు భాగస్వామి నీల్ ఒబెర్లీట్నర్‌తో కలిసి దూసుకెళ్లాడు. ఇండోఆస్ట్రేలియా జంట జోర్డాన్ థాంప్సన్ మరియు పియరీ హెర్బెట్‌పై 7-6 (4), 3-6, 7-6 (8) తేడాతో విజయం సాధించింది.

# టాటా స్టీల్ చెస్ టోర్నీలో గుకేశ్ తొలి విజయం

## అర్జున్ మొదటి ఓటమి




**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్ 2026లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ రౌండ్ 5లో మొదటి విజయాన్ని నమోదు చేయగా, ఐదవ రౌండ్‌లో ఎరిగైసి అర్జున్ తన తొలి ఓటమిని చవిచూశాడు. ఓడించి, గుకేష్ గురువారం 51 ఎత్తుగడల పాటు జరిగిన ఈ పోరులో గుకేష్ తన ప్రత్యర్థి డైవాన్ న్గుయెన్ చేసిన తప్పిదాన్నే సద్వినియోగం చేసుకుని అతన్ని ఓడించి ఐదు రౌండ్లలో 3 పాయింట్లకు చేరుకున్నాడు. గత సంవత్సరం టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన గుకేష్, టోర్నమెంట్‌లో వరుసగా నాలుగు డ్రాలతో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. అతను జావోఖిర్ సిందరోవ్, జోర్డెన్ వాన్ ఫారెస్ట్, అర్జున్ ఎరిగైసి, ప్రజ్ఞానంద రమేష్‌బాబులతో ఒక్కొక్కటి డ్రాగా ఆడాడు.

ఐదవ రౌండ్‌లో గుకేష్ ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేశాడు. ఐదవ రౌండ్‌లో హోమ్ ఫేవరెట్ అనిష్ గిరి చేతిలో ప్రజ్ఞానంద వైట్ పావులతో డ్రాగా ముగిసింది. అలాగే అర్జున్ నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్‌లపై వరుసగా రెండు ఓటములతో తన ప్రచారాన్ని ప్రారంభించిన ఇప్పుడు వరుసగా మూడు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. అర్జున్ ఐదవ రౌండ్‌లో తెల్లటి పావులతో వ్లాదిమిర్ ఫెడోసీవ్ చేతిలో తన తొలి ఓటమిని చవిచూశాడు.











## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..

# రన్స్ మోనార్క్‌లు


### టాప్ 5 లో స్మృతి మంధాన

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)లో పరుగుల వరద పారించడం అతి కొద్ది మందికే సాధ్యపడుతుంది. డబ్ల్యూపిఎల్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన పలువురు బ్యాటర్లు తమ తమ జట్ల గెలుపునకు కీలకమయ్యారు. ఇటువంటి టాప్ 5 జాబితాలో భారత్‌కు చెందిన స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన కూడా ఉంది. డబ్ల్యూపిఎల్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించి అగ్రస్థాయిలో ఉన్న రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన జార్జియా వోల్ పేరిట ఉంది. లక్నోలో (2025) రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో జరిగిన మ్యాచ్‌లో యుపి వారియర్జ్ తరపున ఆమె 56 బంతుల్లో అజేయంగా 99 పరుగులు చేసి 12 పరుగుల తేడాతో మ్యాచ్‌ను గెలిపించింది. ఆమె ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు మరియు ఒక సిక్సర్ ఉన్నాయి. బ్రాబోర్న్ స్టేడియంలో గుజరాత్ జెయింట్స్‌తో (2023) జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తరపున ఆడుతున్నప్పుడు న్యూజిలాండ్ ఆల్ రౌండర్ సోఫీ డివైన్ కేవలం ఒక పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకుంది. 189 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, డివైన్ కేవలం 36 బంతుల్లో 99 పరుగులు చేసింది. ఆమె తొమ్మిది ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో బెంగుళూరు ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించడంలో సహాయపడింది. ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో (2023) జరిగిన మ్యాచ్‌లో యుపి వారియర్జ్ తరపున ఆస్ట్రేలియా ప్లేయర్ అలిస్సా హీలీ 47 బంతుల్లో 96 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమె 18 ఫోర్లు మరియు ఒక సిక్సర్‌తో యుపి వికెట్ కోల్పోకుండా 139 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. లక్నోలోని ఎకానా క్రికెట్ స్టేడియంలో యుపి వారియర్జ్‌తో (2025) జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ తరపున ఆస్ట్రేలియా ప్రొఫెషనల్ క్రికెటర్ బెత్ మూనీ 59 బంతుల్లో అజేయంగా 96 పరుగులు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ ఐదు వికెట్లకు 186 పరుగుల భారీ స్కోరు చేసింది. మూనీ 17 ఫోర్లు కొట్టి కేవలం నాలుగు పరుగుల తేడాతో తన సెంచరీని కోల్పోయింది. గుజరాత్ 81 పరుగుల తేడాతో గెలిచినందున ఆమెను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపిక చేశారు. డబ్ల్యూపిఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు కెప్టెన్ స్మృతి మంధాన ఐదవ స్థానంలో ఉంది. నవీ ముంబైలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో (2026) జరిగిన మ్యాచ్‌లో ఆమె 96 పరుగులు చేసి 74 నిమిషాలు అద్భుతంగా ఆడింది. బెంగుళూరు గ్రేస్ హారిస్‌ను ఒక పరుగు కోసం ప్రారంభంలోనే కోల్పోయింది. కానీ మంధాన మరియు జార్జియా వోల్ కలిసి జట్టును పెద్ద విజయానికి నడిపించారు.

## ఇండోనేసియా మాస్టర్స్

# క్వార్టర్స్‌లోకి సింధు, లక్ష్య






**న్యూఢిల్లీ:** రౌండ్‌ఆఫ్16 మ్యాచ్‌లలో వరుస గేమ్‌ల విజయాలు సాధించడం ద్వారా భారత షట్లర్లు పివి సింధు, లక్ష్య సేన్ ఇండోనేషియా మాస్టర్స్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. జకర్తాలో గురువారం నాడు అరగంటకు పైగా జరిగిన పోటీలో లక్ష్య 21-10, 21-11 తేడాతో హాంకాంగ్‌కు చెందిన జాసన్ గుణవన్‌పై విజయం సాధించాడు. అలాగే రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు 43 నిమిషాల్లోనే ముగిసిన ప్రీక్వార్టర్ ఫైనల్‌లో సుపరిచితమైన ప్రత్యర్థి డెన్మార్క్‌కు చెందిన లైన్ క్జెర్‌ఫెల్ట్‌పై 21-19, 21-18 తేడాతో విజయం సాధించింది. ఇప్పటివరకు జరిగిన ఆరు హోరా హోరీ మ్యాచ్‌ల్లో డేన్ క్రీడాకారిణిపై సింధు ఐదవ విజయం సాధించింది. ఈ ఫలితంతో సింధు ఆరో మహిళా సింగిల్స్ క్రీడాకారిణిగాను, మరియు కెరీర్‌లో500 విజయాలు సాధించిన తొలి భారతీయురాలిగా నిలిచింది. ఇప్పటివరకు 732 మ్యాచ్‌లు ఆడిన ఆమె విజయ శాతం 68.3 గా ఉంది. సింధు తదుపరి టోర్నమెంట్ టాప్ సీడ్ మరియు ప్రపంచ 4వ ర్యాంక్‌లో ఉన్న చైనాకు చెందిన చెన్ యు ఫీతో తలపడనుంది. సింధు మరియు ఫీ ఇప్పటివరకు 13 సార్లు తలపడ్డారు. మరియు మొత్తం రికార్డులో 7-6తో స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. ఫీ పై భారత క్రీడాకారిణి చివరి విజయం 2019లో సాధించింది.



# అఫ్ఘాన్‌దే టి20 సిరీస్

## వెస్టిండీస్‌పై 39 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో జరిగే టీ20 ప్రపంచ కప్ కోసం అఫ్ఘానిస్తాన్ జట్టు సిద్ధమవుతున్న సమయంలో మిస్టరీ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రెహమాన్ హ్యాట్రిక్ సాధించాడు. వెస్టిండీస్ పై జరిగిన మ్యాచ్ లో 39 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలి మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో ఓడిపోయిన వెస్టిండీస్ 18.5 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. ముజీబ్ 21 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి టీ20ల్లో హ్యాట్రిక్ సాధించిన మూడో ఆఫ్ఘన్ బౌలర్‌గా నిలిచాడు. వెస్టిండీస్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న తర్వాత, దర్విష్ రసూలి తన అర్ధ సెంచరీని 39 బంతుల్లో 68 పరుగులు చేయగా, సెదికుల్లా అటల్ 53 పరుగులు చేశాడు. దీంతో ఆఫ్ఘనిస్తాన్ 4 వికెట్లకు 189 పరుగులకు పరిమితమైంది. ముజీబ్ ఎవిన్ లూయిస్‌ను లెగ్‌బిఫోర్ వికెట్‌కు ట్రాప్ చేసి, జాన్సన్ చార్లెస్‌ను అవుట్ చేశాడు. దీంతో వెస్టిండీస్ 8 ఓవర్లలో మూడు వికెట్లకు 38 పరుగులు మాత్రమే చేసింది. టాప్ స్కోరర్ కెప్టెన్ బ్రాండన్ కింగ్ (50) లాంగ్‌ఆన్‌లో ఔట్ అయ్యాడు. తర్వాత క్వెంటిన్ సాంప్సన్‌ను క్లీన్ బౌల్డ్ చేయడం ద్వారా 4 వికెట్లు పడగొట్టాడు. షిమ్రాన్ హెట్మెయర్ (46) రాణించాడు. అయితే ఫజల్హాక్ ఫరూఖీ (2) భారీ షాట్ కొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఫాస్ట్ బౌలర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ 20 పరుగులకు 2 వికెట్లు పడగొట్టగా, ఫరూఖీ 11వ ర్యాంకర్ రామన్ సిమండ్స్‌ను అవుట్ చేసి, ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే ఆఫ్ఘనిస్తాన్‌కు సిరీస్‌ను కైవసం చేసుకున్నాడు. అలాగే ఆఫ్ఘనిస్తాన్ ఓపెనింగ్ జోడీ రహ్మానుల్లా గుర్బాజ్ (1), ఇబ్రహీం జాద్రాన్ (22) పవర్ ప్లేలోనే నిష్క్రమించారు. కానీ రసూలి, అటల్ పేస్, స్పిన్ రెండింటిలోనూ ఆధిపత్యం తో 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఒమర్జాయ్ అజేయంగా 26 పరుగులు చేయగా, స్పిన్నర్ గుడకేష్ మోతీ చివరి ఓవర్లో 19 పరుగులు చేశాడు.

# 78% క్షీణించిన ఇండిగో నికర లాభం




**న్యూఢిల్లీ,జనవరి 22:** ఇండిగోమాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ రూ.549.1 కోట్ల నికరలాభం సాధించింది. గత ఏడాది ఇదేకాలంలో రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78శాతం క్షీణించింది. కొత్తగా వచ్చిన లేబర్‌కోడ్‌లు గత ఏడాది డిసెంబరులో తలెత్తిన విమాన సర్వీసుల లోటుపాట్లు వంటివి నికరలాభాలపై ప్రభావంచూపించాయి. కొత్త కార్మికచట్టాల అమలుకు రూ.969కోట్లు కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయిందని కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. ఈ త్రైమాసికంలో రూ.1546 కోట్లు అదనపు భారంపడిందని కంపెనీ వెల్లడించింది.ఇక కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్‌ఆధారిత భవిష్యత్తు చెల్లింపులకోసం రూ.1035కోట్లను డిసెంబరు త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో వెల్లడించింది. మొత్తం రాబడులు రూ.24,540.6 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో రూ.22,992.8 కోట్లతోపోలిస్తే కొంతమేర మెరుగుపడింది. ప్రయాణీకులకు గుడ్‌విల్ గెశ్చర్‌కింద టికెట్‌కు పదివేలు చెల్లించింది. డిజిసిఎ ఇండిగోకు రూ.22 కోట్ల జరిమానా విధించడంతోపాటు రూ.50 కోట్లు బ్యాంక్ గ్యారంటీ చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 10వరకూ శీతాకాలం షెడ్యూలులో 10శాతం కోతపెట్టింది. ఈ ప్రభావం డిసెంబరుత్రైమాసిక ఫలితాల్లో కనిపించింది. మరో త్రైమాసికంలోకూడా ఈ ప్రభావం కనిపిస్తుందని ఇండిగో మాతృసంస్థ ప్రకటించింది.



## రికార్డు పతనం నుంచి

# స్వల్ప రికవరీ

### 91.60కి చేరిన డాలర్ వర్సెస్ రూపాయి

**ముంబయి, జనవరి 22:** రికార్డు స్థాయి కనిష్ఠంనుంచి నుంచి భారత రూపాయి గురువారం రికవరీ అయింది. గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత ఊరట లభించింది. ఫలితంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు బలపడి 91.60 వద్ద ట్రేడ్ అవుతోంది. సమీప భవిష్యత్తులో రూపాయి ఒడిదొడుకులు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో ఉన్నంత వేగంగా పతనం ఉండకపోవచ్చని డీబీఎస్ బ్యాంక్ అంచనా వేసింది. డీబీఎస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ ఎకనమిస్ట్ రాధికా రావు మాట్లాడుతూ అంతర్జాతీయ, దేశీయ అంశాలు కలిసి రూపాయిపై ఒత్తిడి పెంచాయని తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో భయాలను సూచించే వీఐఎక్స్ సూచీ పెరగడం, అంతర్జాతీయంగా భౌగో ళిక రాజకీయ ఉద్రిక్తతలు, బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటివి రూపాయిని బలహీనపరిచాయి. ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్ ఉద్రిక్తతలు తగ్గడం మార్కెట్లకు ఊరటనిచ్చే అంశంఅని ఆమె వివరించారు. మరోవైపు యూరోపియన్ యూనియన్‌తో కీలక వాణిజ్య ఒప్పందం వచ్చే వారం ఖరారయ్యే అవకాశం ఉండటం, దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికాతో వాణిజ్య చర్చలపై సానుకూల సంకేతాలు రావడం కూడా మార్కెట్లకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. దేశీయంగా ఆర్థిక వృద్ధి బలంగా ఉన్నప్పటికీ రూపాయి ఒత్తిడికి గురవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాల్లో సగటు వృద్ధి 8 శాతంగా నమోదైంది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7.5 శాతానికి పైగా ఉంటుందని అంచనా. విదేశీ పెట్టుబడులు తరలిపోవడం ప్రధాన ఆందోళనగా మారింది. ఈక్విటీ మార్కెట్ల నుంచి ఈ ఏడాది ఇప్పటికే 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. దీంతో కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.01.2 శాతం వద్ద అదుపులోనే ఉన్నప్పటికీ, మూలధన ప్రవాహాలపై ఒత్తిడి తప్పదని డీబీఎస్ అంచనావేసింది.

# బ్యాంకులకు 4 రోజులు సెలవులు!


**న్యూఢిల్లీ, జనవరి 22:** కొత్త ఏడాది ప్రారంభమైంది. జనవరి మాసంలో ఏదైనా వస్తువులు కొనుగోలు చేయాలంటే సంక్రాంతి పండగకు ఊరు వెళ్లి వచ్చిన తర్వాత చూసుకోవచ్చని భావించే వారికి బ్యాంకులనుంచి వరుస సెలవులు కొంత ఆటంకం కలిగిస్తున్నాయి.




ఎందుకంటే బ్యాంకులకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రానున్నాయి. జనవరి 24 నుంచి 27వ తేదీ వరకు వరుసగా బ్యాంకులు మూతపడనున్నాయి. ఈనెల 24న నాలుగో శనివారం, 25న ఆదివారం, 26న గణతంత్ర దినోత్సవం, 27న సమ్మె కారణంగా బ్యాంకులు బంద్. ఆర్థిక లావాదేవీల నిమిత్తం వినియోగదారులు కాస్త అలర్ట్ అయి బ్యాంక్ పనులను చూసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. 24 నుంచి 26వ వరకు బ్యాంకు సెలవులంటే ఓకే.. కానీ 27న బ్యాంకుల బంద్ ఎందుకనే ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది. తమకు వారంలో ఐదు పనిదినాలు కల్పించాలని బ్యాంక్ సిబ్బంది కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా ఆరోజున దేశవ్యాప్తంగా బ్యాంక్‌ల బంద్‌కు పిలుపునిచ్చాయి బ్యాంకింగ్ సంఘాలు. ఈ విషయమై గతంలోనే బ్యాంక్ ఉద్యోగులు పలుమార్లు సమ్మె చేపట్టారు. చర్చలు జరిగినా వారి డిమాండ్ మాత్రం నేటికీ నెరవేరలేదు. ఈక్రమంలోనే మంగళవారం మరోసారి సమ్మెకు దిగనున్నారు. విదేశీ మారక ద్రవ్య మార్కెట్, ద్రవ్య మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజీలు శనివారాల్లో పని చేయవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు సైతం శనివారం పని చేయవు. ఈ నేపథ్యంలో బ్యాంకులు వారంలో ఐదు రోజులు పని దినాలను ఎందుకు అమలు చేయవని కేంద్రాన్ని యుఎఫ్‌బీయూ(యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్) సూటిగా ప్రశ్నిస్తోంది.

# డిఎల్‌ఎఫ్ నికరలాభం 1203.36 కోట్లు

**న్యూఢిల్లీ,జనవరి 22:** రియాల్టీ దిగ్గజం డిఎల్‌ఎఫ్ గురువారం మూడోత్రైమాసికంలో నికరలాభం రూ.1203.36 కోట్లు ఆర్జించినట్లుప్రకటించింది. గత ఏడాది 1058.73 కోట్లకంటే 14శాతంపెరిగినట్లు ప్రకటించింది. త్రైమాసికం వారీగాకూడా




రెండుశాతంపెరిగింది. కంపెనీ రాబడులు కూడా 32శాతంపెరిగి 1528.71 కోట్లనుంచి 2020.22కోట్లకు చేరాయి. రాబడులు క్రమానుగతంగా రాబడులు 23 శాతంపెరిగినట్లు ప్రకటించింది. మంచి బిజినెస్ జరగడంతోపాటు రికార్డు వసూళ్లు ఈత్రైమాసికంలో సంస్థను పటిష్టంచేసింది. తొమ్మిదినెలల కాలంలో పటిష్టమైన ప్రగతినిసాధించినట్లుప్రకటించింది నగదు మిగులు రూ.3876 కోట్లుగా ఉందని ఈత్రైమాసికంలో మేం లక్ష్యాలు సాధించామన్నారు. స్థూల రుణస్థాయి కూడా జీరో చేసుకోగలిగామన్నారు. నికరంగా మా నగదు స్థాయి రూ.11,660 కోట్లుగా ఉందని కంపెనీ బిఎస్ఇ ఫైలింగ్‌లో తెలిపింది. ఈత్రైమాసికంలోనే కొత్తగా రూ.419 కోట్ల అమ్మకాల బుకింగ్‌లు జరిగాయని, వార్షిక లక్ష్యాలను కూడా సులువుగా సాధించుకోగలమన్న ధీమాను కంపెనీ ప్రకటించింది. కొత్త ఉత్పత్తుల ఆఫర్లుతోపాటు ఉన్న వాటిని మరింత సమర్థవంతంగా క్లియర్‌చేస్తున్నట్లు డిఎల్‌ఎఫ్ వెల్లడించింది.

## వాణిజ్యం




# 300% పెరిగిన ఎన్పీసిఐ 'భీమ్' యాప్ లావాదేవీలు

**న్యూఢిల్లీ, జనవరి 22:** ప్రభుత్వ స్థాయిలోపని చేస్తున్న చెల్లింపుల యాప్ భీమ్‌పై ప్రజల నమ్మకం పెరురగుతోంది. నెలవారీ లావాదేవీలు గత ఏడాది 300శాతం వృద్ధిని నమోదు చేసాయి. జాతీయ చెల్లింపులసంస్థనుంచి విడుదలయిన భీమ్ సర్వీసెస్ డేటా ప్రకారం భీమ్ యాప్‌లో నెలవారీ లావాదేవీలు గత ఏడాది 165.1 మిలియన్లకు పెరిగింది. గత ఏడాది భీమ్ సగటు నెలవారీ లావాదేవీల పెరుగుదల 14శాతం ఉంది. డిసెంబరు నాటికి మొత్తం రూ.20,854కోట్లపైచిలుకు లావాదేవీలు చేసింది. అంతకుముందు ఏడాదితోపోలిస్తే లావాదేవీల సంఖ్య 390శాతంపెరిగితే లావాదేవీల విలువల్లోకూడా 120శాతానికి పెరిగింది. కస్టమర్లు రోజువారి చిన్నచిన్న చెల్లింపులకు మాత్రమే కాకుండా అధిక విలువలున్న లావాదేవీలకు కూడా భీమ్‌ను ఎక్కువ ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది. ఎన్‌పిసిఐ భీమ్ సర్వీసెస్ ఎండి సిఇఒ లలిత్‌నటరాజ్‌మాట్లాడుతూ భీమ్ చెల్లింపుల యాప్ అందరికీ సురక్షితమైన సౌకర్యవంతమైన లావాదేవీలతో అందుబాటులోకి వచ్చిందని, మరింత మెరుగ్గా సెక్యూరిటీ భరిత డిజిటల్ చెల్లింపులుందించేందుకు భీమ్‌ను అప్‌డేట్‌చేసామని, ఇంటర్నెట్ కనెక్టివిటీ తక్కువ ఉన్న ప్రాంతాల్లోకూడా భీమ్ సులువుగా వినియోగించుకోవచ్చని సిఇఒ తెలిపారు.




# నష్టాల నుంచి లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జనవరి 22:** స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల నష్టాలకు గురువారం బ్రేక్ పడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, తగ్గుముఖం పట్టిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 397.74 పాయింట్లు పెరిగి 82,307.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 132.4 పాయింట్లు లాభపడి 25,289.9 వద్ద ముగిసింది. యూరోపియన్ యూనియన్ దేశాలపై ఫిబ్రవరి 1న టారిఫ్‌లు విధించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం మార్కెట్లకు కలిసొచ్చింది. గ్రీన్‌లాండ్‌పై నాటోతో భవిష్యత్ ఒప్పందానికి ఒక ఫ్రేమ్‌వర్క్ కుదిరిందని, భారత్‌తో గొప్ప వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆయన చేసిన వ్యాఖ్యలు కొనుగోళ్లను ప్రోత్సహించాయి. బీఎస్‌ఈలో అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్బీఐ, టాటా స్టీల్ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. మరోవైపు, ఇటర్నల్, టైటాన్, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలతో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ఉన్నాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ మీడియా సూచీలు 2 శాతానికి పైగా పెరిగి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే సానుకూల ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.34 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.76 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 1.28శాతం,స్మాల్‌క్యాప్‌సూచీ 1.13శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో 2951 కంపెనీలషేర్లు పెరిగాయి. 1280 షేర్లు క్షీణించాయి. 161 కంపెనీలషేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.60గా కొనసాగింది. అంతకుముందురోజు 90.65తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిల్మెంట్లు రూ.1,51,469గా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు ఫ్యూచర్స్ 71స ఎంట్లు నష్టపోయి బ్యారెల్‌కు 64.53 డాలర్లుగా కొనసాగింది. ఫార్మారంగంలో డా.రెడ్డి ల్యాబ్స్ 5.34శాతంపెరిగింది. కంపెనీ నికరలాభం క్షీణించినా షేర్లు దూసుకుపోయాయి. ర్యాడికో ఖైతాన్‌కూడా 5.69శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 5.62శాతం, జీ ఎంటరటైన్‌మెంట్స్ 3.86శాతం చొప్పున పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.